


మహిళ
చదివారా!
తెలుగు మహిళా లోకంలో
అపూర్వ సంచలనాన్ని
విజ్ఞాన, వినోద
వికాసాల్ని
కలిగిస్తున్న
పత్రిక.
ప్రతి మహిళ తప్పక చదివి
తీరవలసిన పత్రిక.
ఇంటిల్లిపాదికీ వికాస దీపిక!
మహిళా లోకానికి విజ్ఞానజ్యోతి!
ప్రతి నెలా తప్పక చదవాలని
పించేది! చదివించేది!
పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణ
విడి ప్రతి వెల రు 2/- మాత్రమే
వివరాలకు
'మహిళ'
తిరుపతి - 517501

జూన్ 1976

సంపుటి: 14
సంచిక: 5

సచిత్ర మాసపత్రిక

సంస్థాపకులు :
కీ.శే. వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్ :
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

సహకార సంపాదకుడు . వేమూరి సత్యనారాయణ


విషయ సూచిక

నవలానుబంధం
ప్రియబాంధవి — యలమంచిలి ఝాన్సీలక్ష్మి

ఆర్. కె. ఆర్ట్ ప్రొడక్షన్స్ వారి 'మనవూరి కధ'లో కృష్ణ, సత్యనారాయణ

జ్యోతి, 40/1 మూసాసేట్ స్ట్రీట్, టి. నగర్, మద్రాసు-600017.


మీ అభిమాన 'నవల'కు అపురూప చిత్రకల్పన!
SM
సురేష్ మూవీస్
సెక్రటరీ
ఈస్ట్‌మన్ కలర్
నిర్మాత: డి. రామానాయుడు
దర్శకత్వం: కె. ఎస్. ప్రకాశరావు
ఆంధ్ర: నవయుగ సీడెడ్: చక్రవర్తి పిక్చర్స్ నైజాం: విజయా సురేష్ పిక్చర్స్
NVKR


REGD:169505
ESTD:1948
త్రివేణి
వక్కపొడి
గంగ, యమున, సరస్వతుల సంగమం
త్రివేణి
రుచి, సువాసన, పరిమళాల సమ్మేళనం
త్రివేణి వక్కపొడి
త్రివేణి వక్కపొడి
మచిలీపట్నం
PHONE: 270
TRIVENI NUT POWDER MFG. CO.
CIRCLEPET,
MACHILIPATNAM (A.P)
Mg. PARTNER: DESU VENKATA SUBBA RAO


ముక్కంటి దేవరకు
కన్నులవిందు చేసిన తిన్నని కథ
కృష్ణంరాజు
సమర్పించు
గోపీకృష్ణ మూవీస్
భక్త
కన్నప్ప
ఈస్ట్మన్ కలర్
మాటలు: ముళ్ళపూడి వెంకటరమణ ◇ ఫొటోగ్రఫీ: వి.యస్.ఆర్. స్వామి
నిర్మాత: యు.వి. సూర్యనారాయణరాజు
దర్శకత్వం: బాపు
సౌత్ డిస్ట్రిబ్యూటర్స్
లక్ష్మీ కంబైన్స్ ◇ విడుదల: లక్ష్మీ ఫిలింస్
LAKSHMI PUBS

మి నీ క థ :

కుక్క-మాంసంముక్క

అది—ముచ్చటగా రెండే రెండు వాటా లున్న డాబా యిల్లు. దాన్ని సూరిబాబు డాబా అంటారు. అలాగని సూరిబాబు దాని సొంతదారు కాడు. తనూ అద్దెకే ఉంటు న్నాడు. ఎన్నాళ్ళగానో ఒక వాటాలో పాతుకుపోయి—మరో ఊళ్ళోఉన్న యజమాని దగ్గర సర్వహక్కులూ పొంది— రెండో వాటామీద అజమాయిషీ చలా యిస్తున్నాడు.

డాబా ముందు విశాలమైన ఆవరణ వుంది. దాన్లో రంగురంగుల పూలమొక్క లున్నాయి. చుట్టూ ప్రహరీ ఉంది. ప్రహరీని కలుపుతూ ఎత్తైన గేటుంది. గేటు కుడి రెక్కమీద 'గేటు మూయవలెను' అనే నిజం బోర్డు, ఎడమ రెక్కమీద 'కుక్క ఉన్నది జాగ్రత్త' అనే దొంగ బోర్డు ఉన్నాయి. డాబా అంత 'రూలు'గా ఉండ డానికి కారకుడు సూరిబాబే. అద్దె కొంపని సొంతయింటిలా భావిస్తాడు. అలాగే భావించమని రెండోవాటా వాళ్ళని శాసిస్తాడు. అద్దెకిచ్చే ముందు నిబంధనలు విని పించి ఆంక్షలు విధిస్తాడు. కోళ్ళున్నా, కుక్కలున్నా, పశువులున్నా, ముగ్గురు మించి పిల్లలున్నా, ఉన్న పిల్లల్లో అల్లరి వాళ్ళున్నా వాటా అద్దెకు దొరికే ప్రసక్తి లేదు అతని ఆంక్షలకి తట్టుకోలేక ఎన్నో కాపురాలు మధ్యలో జండా ఎత్తేశాయి.


వెంకటపతి అనే పెద్ద మనిషొకాయన నిబంధన లన్నిటికీ తల ఊపి — తీరా వాటాలో చేరిన రెండోరోజున ఒక చూలు గేదెను కొనుక్కుని ఆవరణలో కట్టేశాడు. ఆ రాత్రి గేదె ఈనింది. బుల్లి దూడకి జన్మ నిచ్చింది.

యిది చూసి సూరిబాబు ఉగ్రుడై పోయాడు. కాలు చెయ్యి ఆడక జుట్టు పీక్కున్నాడు. యిన్నాళ్ళూ నీట్ నెస్‌కోసం పడ్డ శ్రమ అంతా గేదె మూలంగా వృథా అయినట్టు ఫీలయ్యాడు. అతని కళ్ళముందు ధ్వంసం కాబోతున్న పూలమొక్కలు, చెడువాసనతో రొచ్చుతో బురదమయం కాబోతున్న ఆవరణ, తద్వారా విజృంభించే దోమలు కదిలాయి.

కోపం కూడగట్టుకుని 'వెంకటపతి గారూ' అంటూ వాళ్ళ ముందుగదిలోకి చొరబడ్డాడు సూరిబాబు.

"వచ్చారూ.రండి.కూర్చోండి యింకా మీకు పంపిద్దా మనుకుంటున్నా. పోన్లెండి. యిద్దరం కలిసి ఆరగిద్దాం. గేదె రాత్రి ఈనింది. అరె. కూర్చోరేం. అమ్మాయ్. పట్రా" అన్నాడు వెంకటపతి. 'ఏవిటీ సంధిప్రేలాపనా' అని సూరిబాబు అనుకుంటుంటే వెంకటపతి కూతురు రెండు ప్లేట్లతో జున్ను తెచ్చి ముందు పెట్టింది. సూరిబాబు కళ్ళు మెరిశాయి. నోరూరింది. రుచికరమైన జున్నును సేవించి నవ్వుతూ సెలవు తీసుకున్నాడు వెంకటపతి దగ్గర.

—గుత్తుల భాస్కరరావు



దొంగతనం చెయ్యడం అరవై నాలుగు కళ్ళల్లో ఒక కళగా మన వాళ్ళు గుర్తించారు కానీ దొంగల్నిపట్టుకోవడం మాత్రం గుర్తించలేదు. కానీ దొంగల్ని పట్టుకోవడం కూడా ఓ మంచి కళ అని నా అభిప్రాయం.

కళ అని ఎందుకంటున్నానంటే, మీరు రోడ్డుమీద నడుస్తూ వస్తూంటే, ఎదురుగా ఓ వ్యక్తి పరిగెత్తుకొస్తున్నాడనుకోండి. అతని వెనక్కాల "దొంగ, దొంగ, పట్టుకోండి" అన్న కేకలూ, వినవస్తూంటాయి. మీరు చేతులు సాచి అతన్ని పట్టుకొందామని అనుకొంటారు. కానీ చేతిలో వున్న పంచదార పొట్లాన్ని ఏం చెయ్యాలో తోచదు. 'పక్కవాణ్ని పిలిచి వాడి చేతికిద్దామా,' లేక 'దొంగాణ్నే పొట్లం పట్టుకోమందామా' అన్న ఆలోచన తెగే లోపుల దొంగాడు మీకు బాగా దగ్గరగా వచ్చేస్తాడు. మీరు కంగారుగా పొట్లం వదిలేసి, ఏదో తెలియని నాట్య భంగిమలో చేతులు పెట్టి గాలిని పట్టుకొనే లోపుల దొంగాడు పారిపోతాడు (వాడు వెళ్తూ వెళ్తూ మిమ్మల్ని తన్నకుండా వెళ్తే అదృష్టవంతులనుకోండి). ఆ తరువాత మీరూ "దొంగ, దొంగ, పట్టుకోండి" అని అరిచేవాళ్ళలో ఒకరవుతారు.



పోనీ అర్ధరాత్రి ఇంట్లో నిద్రపోతుండగా పక్కింట్లోంచి "బాబోయ్' దొంగ, దొంగ" అన్న కేకలు విని ఉలిక్కిపడి లేచారనుకోండి. అడ్డదిడ్డంగా ఉన్న లుంగీని సవరించుకొని "మీకెందుకండీ అనవసరంగా, గమ్మునుండక" అంటూన్న భార్యామణి మాటలు త్రోసిపుచ్చి, రోడ్డు మీద పడి దొంగని పట్టుకోడానికి పరిగెట్టబోయే సరికి లుంగీ కాళ్ళకి అడ్డం పడుతుంది. కంకరరాయి కాలికి ఎదురుదెబ్బ తీస్తుంది. లేచినవేళ బాగుండకపోతే మిమ్మల్నే దొంగ అని మిగతా వాళ్ళు పట్టుకోవచ్చు.

పరుగు బాగా వచ్చినంత మాత్రాన

దొంగాణ్ని పట్టుకోగలమనుకోడం పొరపాటు. ఒలింపిక్ రన్నర్ మిల్కాసింగ్ ('ఆర్ యూ రిలాక్సింగ్?' అని అడిగితే 'నో ఐ యామ్ మిల్కాసింగ్ అన్న జోక్ తెలుసుగా) ఇంట్లో ఓసారిలాగే దొంగాడు పడితే మిల్కాసింగ్ వాణ్ని పట్టుకోడానికి వెంటపడ్డాడట' కొంతసేపు పోయాక జనం అడ్డదారిని పరిగెట్టి మిల్కాసింగ్ని ఆపి "దొంగేడీ" అంటే, మీసం మెలేసి, "వెధవ, నాతో సమానంగా పరిగెట్టగలడా? ఎప్పుడో వెనకపడిపోయాడు" అన్నాట్ట గర్వంగా.

దొంగల్ని పట్టుకోగానే సరిగాదు: వాళ్ళని కొట్టి, వాళ్ళచేత నిజం కక్కించాలి. ఈ కార్యక్రమంలో మాత్రం చాలా మంది సహకరిస్తారు. "గుంపులో గోవిందా" అన్నట్లు వెనకనుంచైనా ఓ దెబ్బ వెయ్యొచ్చుకదాని. మా ఇంటి దగ్గర ఓ సారిలాగే దొంగాడు దొరికితే మా అన్నయ్య హీరోలా వెళ్ళాడు. దొంగని ఎలక్ట్రిక్ స్తంభానికి చేతులు విరిచి వెనక్కికట్టేస్తే, అలాక్కాదని విప్పించి చెట్టుకి కట్టించాడు. (ఎలక్ట్రిక్ పోలయితే సినిమాల్లోలా దాని మీద తాడు గీసి, తెంపేసుకొంటాడట') చేతులు గట్టిగా కట్టేసారని ధృవపరచుకొన్న తర్వాతనే ఈడ్చిపెట్టి లెంపకాయలు కొట్టేడు చివరగా తన డిటెక్టివ్ సాహిత్యానుభవాన్ని పురస్కరించుకొని సిగరెట్టుతో వాడి బుగ్గ కాల్చి, రహస్యాలు చెప్పమని హింసించేడు.

ఈ విధంగా వాడు డిటెక్టివ్ కావాలన్న తన కండూతి తీర్చుకున్న, తర్వాత అందరూ వాణ్ని భయపెట్టేరు. ఆ దొంగాడెప్పుడో దారికాసి, తన్ని తన కక్ష తీర్చుకొంటాడని. దాంతో ఆ ర్నెల్లపాటు సాయింత్రం చీకటి పడితే ఇంటినుండి బయటకు వెళ్ళేవాడు కాదు. ఇప్పుడు అంటుంటాడు. 'పడుక్కొనేటప్పుడు రెండు తలుపులు తెరిచి వుంచాలని, ఒక దాంట్లోంచి దొంగ ప్రవేశిస్తే, రెండో దాంట్లోంచి మనం పారిపోవచ్చుట! (ఒకే తలుపైతే చీకట్లో కనబడక, ఒకళ్ళనొకళ్లు గుద్దుకోడానికి అవకాశం వుంది.)

దొంగలు పట్టుబడ్డప్పుడు సిగ్గుపడినట్లు కనిపించరు. సినిమాల్లో నాగభూషణం లాటి వాళ్ళు క్లైమాక్సులో 'మేమేకాదు, మాలాటివాళ్ళు ఈ లోకంలో చాలామంది వున్నారు' అని క్లోజప్పులో డైలాగు చెప్పేసి, వేన్ ఎక్కేస్తారు. (ఆ వేన్ సీను నాకు భలే ఇష్టం! లాంగ్‌షాట్లో ఆ వాన్ ఊచల్లోంచి హీరోయిన్ ఏడుస్తూ కనిపిస్తూంటే 'ఆహా! పట్టుబడ్డంతో ఎంత మజా ఉంది' అనిపిస్తుంది.) ఒక్కొక్కప్పుడు దొంగకంటే పోగొట్టుకొన్నవాడే



ఎక్కువ సిగ్గుపడాల్సొస్తుంది. ఒకసారి నేను డబల్‌డెకర్ ఎక్కుతూంటే ఎవడో నా పర్సు కొట్టేసేడు. నేను ఫరవాలేదని ఎంత చెప్తున్నా వినకుండా, జనం పరిగెట్టి వాణ్ని పట్టుకొని పర్సు లాక్కున్నారు. తెరచి చూస్తే నాలుగు పిచ్చి కాయితాలు, ముప్ఫైఅయిదుపైసల చిల్లరా ఉన్నాయి. జనం అంతా 'అబ్బో చాలా ఖజానాయే వుందే! అంటూ వేళాకోళం చేసేరు. నాకు సిగ్గుతో చచ్చినంత పనయి, జనంలో కలిసిపోయేను.

దొంగల్ని పట్టుకొన్నాక పోలీసుల కప్పగించినవాడు. జన్మలో మళ్ళీ దొంగల్ని పట్టుకొనేందుకు సాహసించడు. పోలీసులు వాణ్ని కోర్టులవెంట తిప్పించి నేరకపోయి పట్టుకున్నా(నా భగవంతుడా! అనిపించేస్తారు

దొంగల్ని పట్టుకోడానికి పోలీసులు, పోలీసు కుక్కలూ, డిటెక్టివ్‌లూ చాలా మంది ఉన్నారు. కానీ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. కారణం దొంగల్నిపట్టుకోడం ఈ రోజుల్లో గిట్టుబాటుగా లేదు. వెనుకటి రోజుల్లో అయితే ('అనగనగా ఓ రాజు ' కథల ప్రకారం) అర్ధరాజ్యం రాజకుమార్తె దొరికేవి. ఇప్పుడో— ప్రాణంకు తెగించి దొంగను పట్టుకున్న పోలీసుకు పదిహేను రూపాయల చెక్కు ఐజీగారు 'స్వయంగా' అందజేస్తున్నారు.*

వానరాత్రి

నిన్నరాత్రి లోకం ఏడిచింది?
పొగిలి పొగిలి పొర్లిపోతూ ఏడిచింది!
తెల్లముఖాలు వేసిన మబ్బులు కొన్ని
పడమరకు పరుగెత్తి పోతూ
ఏవో దారుణవార్తలు మోసుకెడుతుంటే చూసి,
ఎంత విపత్తు విశ్వానికీ నాడు అని
అలవాటు కొద్దీ నేనూ ఏడిచాను!
పొగిలి పొగిలి పొర్లిపోయే ఏడుపాకటి
శ్రుతిగా కలిపి, నిలిచి ధారల్లో ఏకమైనాను!
నిన్నరాత్రి లోకం ఏడుస్తూ నాకు
చెప్పిన భీకర కథనం వళ్ళంతా చెవులై వింటూ
చీకటి నాకే సందేశం యిస్తుందోనని
తడిసి బరువెక్కిపోతున్న చీకట్లో
అన్నివేలక్షణాలూ అట్టే కూర్చున్నాను.
నాతోపాటే పాపం యీ ప్రకృతి అని,
పాపం ప్రకృతితోపాటే నేనూ అని
అన్ని వేలక్షణాలూ అట్టే కూర్చున్నాను.
ఎందుకో కళ్ళెత్తి చూశాను—కొనగోటి నొక్కులాటి
చంద్రవంకలో చల్లదనం నింపి,
తళుకుక్కున మెరిసే చుక్కొకటి క్రిందుగా
చుబుకంపై అందగిస్తోంటే,
చిక్కని నల్లదనం ముసుగుగా పైనపడుతోంటే,
రాత్రి క్రొత్త రూపుదాల్చిందేమిటి? రంగం మారిందా?
నివ్వెర పోయి చూస్తుంటె, ఎన్ని వేలక్షణాలో అవి!
తూర్పున, చెక్కిన సన్న పులి ఎరుపు నొక్కులు,
బారెడు ఆకాశంపైన చారెడు
గులాబీ రంగు ముత్యాలు పోసేసి,
ఉదయం శోభను కూడా తెచ్చుకొస్తోంది!
మళ్ళీ రంగం మారిందా?
కళ్ళు మూసిన నాలోనే మారిన రంగం!
రాత్రికథలోనే బ్రతుకుతోందీ అంతరంగం!
నిన్నరాత్రి ఏడిచిన లోకం, యివేళ నవ్వింది!



జగపతి ఫిలిమ్సు

దశావతారములు

ఈస్ట్‌మన్ కలర్

నిర్మాత వి.కృష్ణప్రసాద్   దర్శకత్వం కె.ఎస్.గోపాలకృష్ణన

మాటలు పాటలు ఆరుద్ర   సంగీతం చక్రవర్తి   ఫోటోగ్రఫీ రవికాంత్ నగాయిచ్   కూర్పు ఎ.సంజీవి

అన్నపూర్ణ విడుదల

ANNAPURNA

alpana

సీరియల్



ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

"ఎందుకూ? నెత్తికెక్కి తొక్కడానికా? అయినవాళ్ళనందర్నీ వదలి ఆ కూడూ గుడ్డా లేని వాళ్ళవెంట ఎందుకు పడతారో అర్థం కాదు."

"అవి లేకపోవడం వాళ్ళ తప్పిదం కాదు. వాటికోసమే నౌఖరీచేసేవాళ్ళు భయ భక్తులతో మసలుకుంటారు!"

"ఓహో! పూర్వాశ్రమం గుర్తుకు వచ్చినట్లున్నది ఇక నా మాటెందుకు పని కొస్తుందీ?" తలుపులు భళ్ళున బ్రద్దలు గొట్టినట్లు తెరుచుకు వెళ్ళిపోయింది ఆ గదిలో నుంచి.

అంతా వింటూన్న సుందరి అసహ్యంతో తలపోసింది. 'ఛీఛీ! డాడీ ఎందుకు సహిస్తారు ఈ నిందలూ, నిరసనలూ?'

9

పూజా మందిరంవద్ద అవనతనేత్రియై మౌనప్రార్థనలో లీనమైన భద్రమ్మనూ, అనతిదూరంలో అవనతశిరస్కుడై భక్తిగా నమస్కరిస్తూ నిలబడిన సత్యమూర్తినీ ఆరాధనగా చూస్తూ ద్వారంవద్దనే నిలబడిపోయింది సుందరి.

శివరావు సౌమ్యుడు. పై మెరుగులకు కాక వ్యక్తిత్వాలకు విలువనిచ్చే వ్యక్తి. ఆయన భార్య మీనాక్షి అందుకు పూర్తిగా వ్యతిరేకం. వారి కున్న ఇద్దరాడ పిల్లలలో పెద్దది ఉమ. గుణాలకు తల్లి పోలిక. తండ్రి గుణాలకు వారసురాలు సుందరి. ఆర్థిక చిక్కులలో ఉన్న గాయక కళాకారుడు సత్యమూర్తికి సాయం చేద్దామనుకున్న సుందరిని కసిరి కొట్టింది మీనాక్షి. మీనాక్షి అభ్యంతరం పెట్టినా సత్యమూర్తికి తన పర్సనల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చాడు శివరావు. ఇదీ ఇంతవరకు జరిగిన కథ.

చిన్న యింటిలో ఒక ప్రక్క చిన్న గదిలో ఏర్పాటుచేసుకున్న అతి చిన్న భగవన్మందిరం అది.

అంత పెద్ద భగవానుడు ఆ భక్తురాలిని కరుణించి ఆ చిన్న మందిరంలో యిమిడిపోయాడా అన్నట్లు కళకళలాడుతూన్నది రంగురంగుల పూలతో, తైల దీపాలతో

ధ్యానం ముగించి, హారతి యిచ్చి లేచిన భద్రమ్మా, హారతి కనులకద్దుకొని అటనుండి నిష్క్రమించబోతూన్న సత్యమూర్తీ ఒకేసారి చూచారు, భక్తిపురస్సరంగా చేతులు జోడించి నిలబడివున్న సుందరిని.

ఆశ్చర్యపోయారు కూడా తమ కనులను తామే నమ్మలేనట్లుగా.

"నమస్కారం రండి రండి నాకు తెలియదు, నేను చూడలేదు" ఖంగారుపడిపోతున్నాడు సత్యమూర్తి ఈ అనుకోని ఆగంతకురాలిని తన యింట

చూచి, "అమ్మా! శివరావుగారి చిన్నమ్మాయి సుందరిగారు నీకు చెప్తూంటాను కదూ?" ఖంగారుఖంగారుగా పరిచయం చేశాడు.

భద్రమ్మ వదనం ఆనందవిస్ఫారితమైంది.

"దామ్మా! లక్ష్మీదేవే దిగివచ్చిందా అన్పించింది హఠాత్తుగా చూడగానే."

సిగ్గుపడ్తూన్న సుందరిని భుజంపట్టి ముందు గదిలోనికి. నడిపించుకువస్తూ, అక్కడ కుర్చీలో కూర్చునివున్న శివరావును చూచి మరింత ఖంగారుకూ, ఆశ్చర్యానికీ లోనైంది.

ఆమె వెనుకనే వున్న సత్యమూర్తి ఆనందంగా విస్మయంగా చేతులు జోడించుతూ శివరావువైపు నడిచాడు. ఆనందాతిరేకంతో అతడికి నోట మాట రావడంలేదు.

"ఎలా వున్నావ్? జ్వరం తగ్గిందా?" తానే పలుకరించాడు శివరావు.

"తగ్గిందండి. ఈ రోజు నేనే వద్దామనుకుంటున్నాను. మీరెందుకింత శ్రమ తీసుకున్నారు?" నొచ్చుకుంటూ అన్నాడు సత్యమూర్తి.

"మా నాన్నగారు." నెమ్మది స్వరాన సుందరి అన్నది భద్రమ్మతో.

సంతోషాతిశయంతో చమర్చిన కనులతో హస్తద్వయం జోడించింది భద్రమ్మ.

శివరావు ప్రతినమస్కారం చేశాడు. "బాగున్నారామ్మా? ఆపరేషన్ తర్వాత ఆరోగ్యం కోలుకున్నదా?"

సాదరంగా వున్న ఆ పరామర్శ భద్రమ్మ నేత్రాలనుండి ఆనందాశ్రువులను వర్షింపజేసింది

"'భగవంతుని ప్రతిరూపమే తమరు' అని సత్యం చెప్తూంటాడు. ఈనాడు దర్శన భాగ్యం కూడా కలిగింది."

"వద్దమ్మా! అటువంటి మాటలు వద్దు." శివరావు వారించాడు.

"నేనే ఒకసారి వచ్చి తమ దర్శనం చేసుకోవలసింది. తమరిలా వచ్చి శ్రమ తీసుకున్నారు"

గంభీర చిరుహాసంతో శివరావు సంభాషణను మళ్ళించాడు "ఈ ఇల్లు సౌకర్యంగానే వుంటూన్నదా మీకు?"

"ఆఁ, బాబూ! తమ దయవల్ల ఏ లోటూ లేదు. దిక్కులేని కుటుంబానికి దిక్కై దారి చూపారు. జన్మజన్మలకూ ఋణపడి వుంటాం." డగ్గుత్తికతో అన్నది.

ఈ సంభాషణ కూడా మార్చవలసిన అవసరం కన్పించింది శివరావుకు.


"ఇంకా విశ్రాంతి అవసరమైతే తీసుకో సత్యం పూర్తిగా కోలుకున్నాకనే రా."

"అదేం కాదండి. నేను బాగానే వున్నాను. ఈ రోజే వస్తాను."

"కూర్చోండి. ఇప్పుడే వస్తాను." అంటూ లోనికి వెళ్ళబోతూన్న భద్రమ్మను ఆపుజేసింది సుందరి.

"ఏమీ హైరాన పడవద్దు మీరు. మేము వెళ్తాం. నాకు కాలేజీకి టైమైంది."

"ఔనమ్మా! ఇంటిదగ్గర కాఫీ ఫలహారాలు చేసే వచ్చాం. మిమ్మల్ని చూడాలని ముఖ్యంగా సుందరి పటుబటింది. అందుకే వచ్చాం. వెళ్తాం మరి."



"సుందరి' నీ పేరు నీకు తగ్గట్టే వున్నదమ్మా!" ప్రేమాప్యాయతలు ఉట్టిపడే స్వరంతో అన్నది భద్రమ్మ. "అదుగో, ఆ దేవుడి దగ్గర పూలు తీసుకుని, కుంకుమ పెట్టుకో అమ్మా."

సుందరి యిబ్బందిగా చూచింది. టైట్ పాంట్స్, స్కర్ట్స్, జీన్స్ వగైరా దుస్తులు ధరించి, భుజాలు దిగని గిరజాల జుట్టుతో అత్యాధునికంగా వుండే సుందరికీ, ఉమకూ కూడ స్త్రీకి నుదుట కుంకుమ తిలకపు ప్రాముఖ్యం తెలియదు.

అత్యాధునికతకు ఆలవాలమైన మీనాక్షి యింట యిటువంటి ఛాందసాలకు తావు లేదు!

అటు శివరావు వదనంలో లజ్జారుణిమ అలముకొన్నది హైందవత్వం లోపించిన కొమరితకు తండ్రియైన అతడి తల వాలిపోయింది.

ఇటు సత్యమూర్తికి తల్లి పాతకాలపు ధోరణి ఇబ్బందికరంగా వుండడమే కాదు; నవ్యనాగరికులైన ఆ తండ్రీ కుమార్తెలకు ఈ అనాగరిక మర్యాదలు ఆగ్రహం కలిగించుతాయేమోననే శంకతో గాభరాగా చూస్తున్నాడు, ముచ్చెమటలు పోస్తూండగా.

కానీ అవేమీ గ్రహించని భద్రమ్మ ఇంకా తన ధోరణిలోనే అన్నది. "మొదటిసారిగా వచ్చిన కన్నెపిల్లవు. బొట్టుపెట్టుకు వెళ్ళమ్మా!"

ఇక తప్పలేదు సుందరికి దైవమందిరం దెస మెల్లగా అడుగులు వేస్తున్న సుందరిని చూచి ఖంగారుగా ముఖముఖాలు చూచుకున్నారు తల్లీ కుమారులు


గమనించాడు శివరావు.

"సుందరీ! చెప్పులు బయట వదలి వెళ్ళాలి, దేవుని దగ్గరకు."

తండ్రి ఉత్తరువు విన్న సుందరిలో గాభరా స్పష్టంగా ద్యోతకమైనది.

ఖంగారుగా వెనుకకు అడుగులు వేసింది అపరాధినిలా లజ్జిల్లుతూ అందరి ముఖాలూ మార్చి మార్చి చూచింది.

చెప్పులు విడచి, ఎలాగో మొత్తంమీద భద్రమ్మ చెప్పినట్లుగా కుంకుమా, పూలూ తీసుకున్నది. చామంతి పూవు అయితే అందంగా చెంపన పిన్నులో పెట్టి అలంకరించుకున్నది. కానీ నుదుట బొట్టుపెట్టుకోవడం—అలవాటులేని పని కావటం



వల్ల కొంత అవస్థే అయ్యింది.

నిత్యం గంభీరంగా కన్పట్టే సత్యమూర్తి పెదవులపై కన్పించీ కన్పించని చిరుహాసం నిలచింది, సుందరి యిబ్బందిని చూస్తూ.

"వెళ్తామండి." చేతులు జోడించింది.

అప్పటికే శివరావు లేచి నిలబడ్డాడు.

"వస్తూండు అమ్మా!" గుమ్మంవరకూ సాగనంపుతూ అన్నది భద్రమ్మ సుందరిని.

"అలాగే." సంతోషంగా అన్నది.

"నేనే రావలిసింది తమ దర్శనార్థం. మిమ్మల్నిలా శ్రమపెట్టాం బాబుగారూ!"

కారులో కూర్చోబోతున్న శివరావు ఆగి వెనక్కు చూచాడు. "అటువంటి అనవసర శంకలేమీ మనసున వద్దు. మిమ్మల్ని శ్రమపెట్టరాదనే మేము వచ్చాం. మీరు శ్రమపడి రానవసరంలేదని మరీ మరీ చెప్తున్నాను అన్నట్టు సత్యం! వచ్చే నెలలో మీరు మరో యింటికి మారవలసివుంటుంది. వివరాలు తర్వాత చెప్తాను."

కారు సాగిపోయిన దెసగానే చూస్తున్నది భద్రమ్మ. "ధనవంతులకు గర్వమనీ, మనసు వుండదనీ శివరావుగారిని చూచిన ఎవరైనా అనగలరా? సహృదయునికి సంపద కల్గటం సుందర సుమానికి తావి అబ్బి పరిమళించినట్లే!"

10

"గుడ్ మార్నింగ్ సర్."

"మార్నింగ్!"

"ఈ ఫైల్ మీరు చూస్తే "

"నో మిస్టర్ సత్యం" చాలా విసుగ్గా వున్నది శివరావు ధోరణి. "సాయంత్రం చూస్తాలే."

నోటిలో పైప్. చూపులు ఎక్కడో. దీర్ఘాలోచనలో వున్నట్లున్నాడు.

నిత్యం ఫైల్స్‌లో—వ్యవహారాలతో మునిగిపోయి వుండడమే కానీ, శివరావు యిటువంటి రూపాన్ని చూడడం యిదే ప్రప్రథమం సత్యమూర్తికి.


అతడినే చూస్తూ అలా అయిదు నిముషాలు నిలబడ్డాడు.

సత్యమూర్తిని గమనించనట్లే వున్నది శివరావు మార్పులేని తీరు.

"తమరి ఆరోగ్యం బాగున్నదాండీ?" ఆందోళనగా అడిగాడు శివరావును.

"ఊఁ?" అన్యధ్యాస వదలి శివరావు ప్రస్తుతంలో ప్రవేశించాడు.

"ఓ. అదేం లేదు. డోంట్ వర్రీ" చిన్నగా నవ్వాడు కానీ ఆ నవ్వు సహజంగా లేదు.



ఇంకా అలానే నిలబడి వున్నాడు సత్యమూర్తి.

"ఏమిటి సత్యం? ఏమైనా చెప్పాలా?"

"ఔనండి. తమరు మరోలా భావించకుంటే .. "

"ఏమిటి? చెప్పవోయ్ "

"మా అమ్మగారి ఆపరేషన్ బిల్లు ఎనిమిది వందలూ తమరు చెల్లించారు."

అతడు చెప్పబోయేదానికి ఎదురు చూస్తున్నాడు శివరావు.

"నెల నెలా నా జీతంలో వంద తగ్గించమని అకౌంటెంటుకు చెప్పండి మీరు."

శివరావు గంభీరంగా చూస్తున్నాడు, ఏమీ మాట్లాడలేదు.

ఆ మౌనం చూచిన సత్యమూర్తికి సందేహం కలిగింది. 'బహుశః నా మాటలు ఏమైనా పొరపాటుగా గానీ లేవు కదా?'

సందేహిస్తూ నెమ్మదిగా అన్నాడు "తమరు మరచిపోయి వుండవచ్చు. అందుకు గుర్తు చేస్తున్నాను. నిన్న నా జీతం పూర్తిగా అందింది. వచ్చే నెల నుండీ పోనీ రెండు వందలు 'కట్' చేసినా ఫర్వాలేదు."

శివరావు గంభీరంగా అన్నాడు, అతడి దెస చూడకుండానే. "ఆ విషయం మరచిపో సత్యం."

సత్యమూర్తి వదనంలో నీలినీడలు కదులాడాయి


"నన్ను ఋణ విముక్తుని చేయండి బాబుగారూ, ఇంత ఉదారత భరించ లేను."

"మూర్తీ!" శివరావు సంబోధనలో ఆర్ద్రత వున్నది, ఆప్యాయత వున్నది.

"అమ్మకు ఒక్కడే కుమారుడను, నా బాధ్యతలను నిర్వహింపగలిగాననే తృప్తి నాకు కలిగించండి," మందంగా వున్నది స్వరం, కానీ స్థిరంగా ధ్వనిస్తున్నది.

శివరావు మనసులోని ఆశ్చర్యభావం అతడి చూపులలో ప్రతిఫలించింది.

సత్యమూర్తి ఎంతటి ఆత్మాభిమానియో గ్రహించగలిగిన శివరావు అంతరంగం ఆనంద తరంగితమైనది. చిరు నగవు నిలచిందతడి పెదవులపై, నఖశిఖ పర్యంతం



పరీక్షగా చూస్తూన్న శివరావు చూపుల నెదుర్కోలేని సత్యమూర్తి తల వాల్చుకున్నాడు.

అతడి నిర్ణయం స్థిరమైనదని, అతడింకా నిలబడి వుండడంలోనే స్పష్టమౌతూన్నది.

"ఎంత ఋణపడి వున్నావ్‌? చెప్పు మరి. నాకు గుర్తులేదు."

శివరావు చిరునగవుతోనే అడిగినా ఆయన మనసు బాధపడినదని గ్రహించగలిగాడు సత్యమూర్తి.

"క్షమించండి. మీ దయా ఋణం ఏనాటికీ తీర్చుకోగలది కాదు. కనీసం రొక్కమైనా తీర్చుకుందామని ఆపరేషన్ బిల్లు కాక అయిదువందలు అడ్వాన్సు కూడా తీసుకున్నాను కదా?"

"సరే" అప్పటికప్పుడు మానేజర్‌కు ఫోన్ చేశాడు శివరావు. "మన సత్యమూర్తి జాబ్ పర్మనెంట్ చేయండి ఇక నుండి మన స్టాఫ్, వర్కర్స్—అందరి కుటుంబాలకూ వైద్యం ఖర్చులు మనమే భరిస్తామనీ, మెడికల్ బిల్సు సబ్మిట్ చేయమనీ సర్క్యులర్ పంపించండి."

సత్యమూర్తికి మరి మాట్లాడే అవకాశమీయలేదు శివరావు. "క్రొత్త యింట్లోకి మారుతున్నారా?"

"ఆఁ. రేపే మారుతున్నామండి."

"సరే. నా వెంట రా. ఈరోజు రీటా వివాహం."

రీటానూ, వరునీ ఆశీర్వదించి పదిహేనువందల చెక్కు యిచ్చాడు శివరావు, సోఫాసెట్ కొనుక్కోమని.

కేవలం ఒక్కరినే కాదు—తన ఆశ్రితుల నందరినీ శివరావు ఉదారంగానే సత్కరించుతాడని గ్రహించాడు సత్యమూర్తి.

రీటా తండ్రితో శివరావు మాటలలో అన్నాడు "మీరు మంచి పని చేశారు. ఆడపిల్లకు తన యిల్లూ సంసారం అనేది ఎంత త్వరగా అయితే అంత త్వరగా ఏర్పరచగల తలిదండ్రులు ధన్యులు."


ఆ మాటలు విన్న సత్యమూర్తికి, ఉదయం శివరావు అన్యమనస్కతకు కారణం బోధపడింది.

11

ఇంటికి త్వరగా జేరాలనే తపన ఏనాడూ వుండదు సుందరికి.

కత్తుల బోను వంటి ఆ యింటినుంచి ఎప్పుడు బయటపడదామా అనే

రంజిత్ కుమార్ సమర్పిస్తున్న రంగుల చిత్రం 'మనవూరి కథ'లో కథా నాయకుడు కృష్ణ. కోనసీమ అందాలను రెట్టిస్తూ చూపించే యీ చిత్రానికి దర్శకుడు కె. హేమాంబరధరరావు.




చూస్తుంది. ఆదివారంకోసం విద్యార్థులంతా ఎదురుచూస్తుంటారు సంతోషంగా. కానీ సుఖ వాతావరణం, సరసతా లోపించినా ఆ యింట రోజు గడపలేని సుందరి ఆదివారాన్ని ఘోరంగా ద్వేషిస్తుంది.

ప్రతి ఆదివారంలాగే ఈ ఆదివారమూ నౌఖర్లు ప్రాణాలు ఉగ్గబట్టుకు తిరుగుతున్నారు ఆ యింట.

అందరికీ ఆదివారం విశ్రాంతి దినమైతే సంపన్న ఆధునిక గృహాలలో అదే చాలా హడావుడిగా వుండే రోజు; మిత్రుల రాకపోకలతో, విందు వినోదాలతో, సమావేశాలతో మునిగివుండే యజమానులూ, తత్ఫలితంగా తీరికే లేక సతమతమయ్యే నౌఖర్లూ. అటువంటివాటిలో ప్రప్రథమ స్థానం మీనాక్షి భవంతిది. ఎక్కడ ఏ చిన్న లోటు జరిగినా నౌఖర్లు క్షమింపబడరు. అందుకే వారికి అది గడ్డు రోజు.

నౌఖర్లతోపాటు సుందరికీ అది గడ్డురోజే.

మార్నింగ్ వాక్కు వెళ్ళి తిరిగి వచ్చారు శివరావూ సుందరీ.



అప్పుడే లేచివచ్చి లాన్‌లో గార్డెన్ ఛెయిర్‌లో కూర్చున్న మీనాక్షి విసుగ్గా అరుస్తోంది బెడ్‌కాఫీ అందించటం ఆలస్యం చేసిన బట్లర్ మీద.

శివరావు ప్రవేశంతో తన ప్రాణాలకు ఫరవాలేదని గ్రహించిన బట్లర్ "బ్రతుకు జీవుడా" అని లోనికి నిష్క్రమించాడు.

"ఏమిటి, ఈరోజు పెందరాళే లేచావే?" శివరావు భార్యను సరసంగానే పలకరించాడు. "ఏమైనా ప్రోగ్రాం వున్నదా?"

ఏడు దాటితే కాని మీనాక్షి నిద్ర లేవదు

"ఆఁ." దీర్ఘాలోచనలో వున్నది మీనాక్షి "అదే. సాయంత్రం పార్టీ ఇంట్లో అరేంజ్ చేద్దామా, లేక హోటల్లోనా? అని ఆలోచిస్తున్నాను."

తండ్రీ కుమార్తెల గుండెలు గుభిల్లుమన్నాయి.

"మిసెస్ వెంకటేష్ తెలుసుగా మీకూ? నాకు చాలా కావలసినావిడ."

"జెమినీ హోటల్ వెంకటేశ్వర్రావ్ భార్యేనా?"

"ఆఁ. ఆవిడే. 'వెంకటేశ్వర్రావ్' అని పాత పద్ధతిలో అంటే ఆవిడకు కోపం వస్తుంది."

"ఓహో."

"వచ్చే నెలలో కొడుకు కుమార్ స్టేట్స్‌కు వెళ్తున్నాడు "

"అలాగా? ఒక్కడే కొడు కనుకుంటాను?" ఆలోచిస్తూ అన్నాడు.

"ఆఁ. మరి?" గర్వంగా నవ్వింది మీనాక్షి 'నా తెలివి చూచావా' అన్నట్టు. "చాలా తెలివైనవాడు. ఫొటోగ్రఫీలో స్పెషల్ ఎఫెక్ట్స్ నేర్చుకోవటానికి వెళ్తున్నాడు "

"తెలివైనవాడా?" మీనాక్షి మాటల మధ్యలోనే అడ్డుకున్నాడు శివరావు. "నేను వినడం చాలా బడుద్దాయి అని?"

మీనాక్షికి కోపం వచ్చేసింది. "ఎవడన్నాడు! ఇష్టం లేనివాళ్ళు ఎన్నో కూస్తారు" అన్నది ఎర్రబడిన ముఖంతో.

శివరావు తాపీగా అన్నాడు, "వాళ్ళ నాన్నే గోలపెట్టాడు నా దగ్గర. ఏదో నానా



గడ్డి కరచి బీకాం పాస్ చేయించాడట. ఎంకాంకు పంపిస్తే డబ్బు తగలేసి జల్సాలే కానీ కనీసం పరీక్షలకైనా కూర్చోలేదట."

"వెధవ చదువు" అత్త తేలిగ్గా తీసి పారేసింది మీనాక్షి. "పుస్తకాల పురుగులు కానంత మాత్రాన తెలివి తక్కువ వాళ్ళు కారు. ఎన్నో ఫీల్డ్స్‌లో రాణించుతున్న కొందరు వేలిముద్రగాళ్ళే! సంతకం చెయ్యడం కూడా రాదు."

ధారాళంగా వెలువడుతూన్న ఆ అమూల్యాభిప్రాయాలను కిక్కురుమనకుండా వింటూన్న శివరావును జాలిగా చూచింది సుందరి.

"ఫొటోగ్రఫీ అంటే చాలా యిష్టమట. చాలా బహుమానాలు కూడా వచ్చాయి. అంతెందుకూ ఆమధ్య మా క్లబ్ ఫంక్షన్‌లో ఫోటోలు తీశాడు—ఎంత బాగున్నా యనీ."

" "

"అందుకే మిసెస్ వెంకటేష్ భర్త వద్దన్నా, నచ్చజెప్పి కుమార్‌ను స్టేట్స్‌కు పంపిస్తోంది. వచ్చాక ఫిలిం ఫీల్డ్‌లో బాగా రాణిస్తాడు."

"రానీయ్. రాణింపు వచ్చాక కదా తెలిసేది?"

"రాణించక పోయినా నష్టమేమీ లేదు. ఇక్కడొక హోటల్ వున్నది. బొంబేలో ఒక హోటల్, ఢిల్లీలో ఒక హోటల్ కట్టే ప్రయత్నంలో వున్నారట. ఒక్కడే కొడుకు అందుకే నేను వీళ్ళని పైకి పోనీయదలచుకోలేదు ఘనంగా పార్టీ లవీ యిచ్చి ఇప్పట్నుంచీ ఆకట్టుకోవాలి."

"ఎందుకూ?" అర్థమైనా కానట్లే అడిగాడు శివరావు క్రీగంట చూస్తూ.

"అయ్యో ఖర్మా? ఇంత మాత్రం అర్ధం కాని మీరు అంతటి బిజినెస్ మాగ్నెట్‌గా ఎలా రాణిస్తున్నారో అర్ధం కాదు నాకు."

"నీకు నేనూ-నాకు నువ్వూ ఎప్పు డర్థమయ్యాము గనుక?" జీవంలేని నవ్వు నవ్వాడు శివరావు.

"మన ఉమ కోసం!" సప్త సముద్రాల ఆవలి అద్భుత లోకంలోని అపురూపమైన వస్తువును తెచ్చిన సాహసిలాగా ముఖం పెట్టింది.

"ఉమకు ఇప్పుడప్పుడే పెళ్ళి వద్దన్నావ్?"

"అబ్బబ్బా, అన్నీ చెప్పాలా మీకు? అతడు తిరిగి వచ్చేప్పటికి ఓ ఏడాది రెండేళ్ళు పట్టవూ? అప్పుడు చేయవచ్చు!"

హఠాత్తుగా శివరావు గంభీరంగా మారిపోయాడు: "ఎందుకు మీనా ఈ డొంక

తిరుగుళ్ళన్నీ? నీకు అంతగా నచ్చితే పోనీ మాట్లాడేయరాదూ ఆవిడతో? హాయిగా ఇద్దర్నీ పంపించుదాం పెళ్ళి చేసి."

"నాన్సెన్స్. వాళ్ళిద్దరూ కొన్నాళ్లు ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకోకుండా ఇప్పుడే పెళ్ళేమిటీ."

"అర్థం చేసుకున్నాక ఒకరి కొకరు నచ్చకపోతే?"

మీనాక్షికి వెంటనే సమాధానం దొరకలేదు. "మానేయొచ్చు మరొకడు దొరుకుతాడు. అదేమంత సమస్య మనకీ." అన్నది ఆఖరుకు.

"ఔనా మరి? ఇంకెందుకు చెప్పు వాళ్ళ గౌరవార్థం—వీళ్ళ సన్మానార్థం అంటూ ఈ పార్టీల ఖర్చూ జిడ్డూ మనకి? 'ఒకరి కొకరు అర్థం కావటం' అనేది కేవలం అర్థం లేని మాట. ఇన్నాళ్ళు కాపురం చేసినా మనం ఒకరి కొకరం అర్థం కాలేదు."

"మాటి మాటికీ మన సాపత్యం తెస్తారెందుకు." మీనాక్షి సహనం సరిహద్దులను దాటనే దాటింది. "ఖర్మ. మనలాగే వుండాలా వాళ్ళూ, ఉత్తర దక్షిణ ధృవాల. లాగా?"

శివరావు వదనంలో బాధ స్పష్టంగా పొడచూపింది "మాటవరసకు అన్నానే కానీ వాళ్ళ తండ్రినై వుండీ అలా కోరుకుంటానా మీనా? ఏ తండ్రీ కోరడు అలాగ. నేను చెప్పేది ఒక్కటే. 'ఏ బర్డ్ ఇన్ది హాండ్ ఈజ్ టూ ఇన్ ది బుష్' అన్నారు. నువ్వు యింతా ఆర్భాటం చేసి ఉమలో ఆశలు పెంచితే—ఏమౌతుంది! భవిష్యత్తు మన చేతిలో వుందా? అతడు అక్కడే ఎవర్నైనా కట్టుకుని వస్తే? ఇటువంటివి ఎన్ని వినడంలేదు మనం?"

"అవన్నీ తర్వాతి సంగతులు. ముందునుంచీ అలా చెడు ఊహించుకుంటూ కూర్చుంటే జీవితంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేం." ఖండితంగా అన్నది మీనాక్షి. "ఇంతకూ పార్టీకి మరలా ఓ నాలుగైదువేలు ఖర్చైపోతాయేమోనని మీ యావ- అంతేగా?"

మెల్లగా మీనాక్షికి ఉపశక్తి రూపం వచ్చేస్తూండడం గమనించిన శివరావు ఇక తాను మాట్లాడేదేమీ లేనట్లుగా దినపత్రిక చేతికి తీసుకున్నాడు.

ఈ సమరం యింతతో ఆగుతుందో, ఇంకా తీవ్రరూపం ధరిస్తుందో ఊహించలేని సుందరి బెదురుబెదురుగా చూడసాగింది తల్లిదండ్రులను.

"అదుగో, నేనేదైనా మాట్లాడ్తూంటే మీరు పేపర్ ముఖాన్నేసుకూర్చుంటారేం?" బిగ్గరగా అరచినట్లే అన్నది.

శివరావు ముఖంనుండి పేపర్ తొలగలేదు.

"అక్కడికి మీరు చేస్తూన్న ఖర్చులన్నీ మహాముఖ్యమైనవీ, నన్నడిగి చేస్తూన్నట్టూ."



ఎ. పూర్ణచంద్రరావు శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ పతాకం క్రింద నిర్మించిన 'రాజు వెడలె' చిత్రంలో కథానాయకుడు శోభన్‌బాబు చిత్ర వేషధారణ ప్రత్యేకాకర్షణ. చిత్రంగా కన్పించే గెటప్‌తో శోభన్‌బాబు, జయసుధను టీజ్ చేస్తున్నట్లున్నాడీ చిత్రంలో.

ఇప్పటికీ శివరావు మౌనం చెదరలేదు.

"మన కంపెనీలో అందరికీ 'ఉచిత వైద్యం' ప్రారంభమైందిటగా?" ఎకసక్కెంగా అన్నది.

"మన కంపెనీ బాగుకోసం పాటుపడేవారి ఆరోగ్యాదుల రక్షణ మన విధి. ఇదివరకే చేయవలసినదిది. ఆలస్యమైంది." ముఖానికి పత్రిక అడ్డుతీయకుండానే అన్నాడు.

"ఓహో. అయితే, ఇక రేపు ప్రతి వాడికీ ఫోనులూ, ఫర్నిచర్‌లూ వున్న ఇళ్ళు యిచ్చి అది కూడా మన ధర్మం అనండి. ఎల్లుండి ప్రతి ఒక్కడికీ ఒక్కో కారు ఇవ్వండి. ఆపైన నెత్తిన కొంగు...."

శివరావు ముఖాన పేపరు అడ్డుతొలగింది. "సత్యమూర్తి విషయమేనా నువ్వనేది?"

"ఆఁ." ఖంగుమన్నది మీనాక్షి గొంతు. "వాడిని అంత పెద్ద బంగళాలోకి ఎందుకు మార్చినట్టు? వాడింట్లో ఫోనూ హంగులూ ఎందుకు?"

"నా సెక్రెటరీ. కొంత స్టేటస్ వుండాలి. అదీకాక ఎప్పుడే పని కావలసినా నాకు అందుబాటులో వుంటాడని ఫోన్ వేయించాను."

"ఓహో! అయితే రీటా వున్నప్పుడు లేవే యివన్నీ? వీడిమీద ఇంత అభిమానం ఎందుకో?"

"అతడిమీద నీ కసహ్యం ఎందుకో? రీటా ఆడపిల్ల అని ఎప్పుడూ అను మానంగా చూచేదానివే. అందుకే నేనామెను తీసివేయలేక వుంచాను కానీ, ఏనాడూ సెక్రెటరీగా నా వెంట ఎక్కడికీ తీసుకెళ్ళలేకపోయాను. ఇప్పుడా బాధ తప్పింది. సత్యమూర్తి నా వెంట అన్ని వూళ్ళూ వస్తాడు. ఏ క్షణంలో అయినా నేను పిలి పించుకోగలను. నాకెన్నో పనులుంటాయి. నువ్వు బాధపడడానికి అతడేమీ ఆడపిల్ల కాదే?"

"ఏదో పురాణం చెప్తారు నా నోరు మూయటానికి. వాడి గోలకేంగానీ, సాయంత్రం పార్టీకి మీరూ, సుందరీ తప్పకుండా వుండాలి. తెలుసా?" ఆజ్ఞాపూర్వ కంగా అంటూ సుందరి దెస చూపులు త్రిప్పింది. "అలా ముంగిలా కూర్చుంటావేం? నువ్వసలు మన హైసొసైటీలో ఎలా బ్రతుకుతావ్?" ముఖం కొట్టుకుంది 'ఖర్మ' అన్నట్లుగా.

"మీ పెద్దవాళ్ళ మాటలలో నేనేం మాట్లాడను మమ్మీ" బెదరిపోతూ అన్నది సుందరి.

అంతలోనే కుక్కపిల్లను ఓ చేత ఎత్తుకుని బద్ధకంగా ఆవులిస్తూ వచ్చిన ఉమ "గుడ్ మార్నింగ్ మమ్మీ. గుడ్ మార్నింగ్ డాడీ." అన్నది ఓ కుర్చీలో కూర్చుంటూ.

మీనాక్షి ముఖం వికసించింది. "చూశావా? ఉమ సాక్షాత్తూ నా బిడ్డ అన్పించు కుంటుంది. నువ్వు నాకు మార్నింగ్ చెప్పావా?" సుందరిని తీవ్రంగా మందలిస్తూ న్నట్లే అన్నది.

"ఓ! సారీ మమ్మీ!" సుందరి తల వాల్చుకున్నది.

శివరావు తీవ్రంగా చూచాడు నైట్ డ్రెస్‌లోవున్న ఉమ దెస. "ఇప్పుడే లేచావా ఉమా?"

"హాఁ డాడీ!" కుక్కపిల్లను లాన్‌పై కుప్పిగంతులు వేయిస్తూన్న ఉమ ఇటు చూడనేలేదు. "ఆ రోగ్ ఆ బట్లర్‌గాడు ఏదో చప్పుడు చేశాడు ఇడియట్. మెలకువ వచ్చేసింది."

"ఉమా!"

శివరావు గర్జింపుకు చికాకుగా చూచింది ఉమ. విస్మయంగా చూచింది మీనాక్షి.

"ఇప్పుడా నిద్ర లేవడం?" కఠినంగా అడిగాడు.

ఉమ ఫిర్యాదుగా తల్లి దెస చూచింది గారాలు పోతూ. సమాధానం మీనాక్షి నుండి వినవచ్చింది "ఎప్పుడు లేస్తే ఏమిటి? కోటీశ్వరుల బిడ్డ. ఏం పని చేయాలి?"

[సశేషం]

సామెతల కథలు

యామిజాల పద్మనాభస్వామి

నవ్వు.

మాటగాని, ఆటగాని, పాటగానీ—

ఏదైనా హద్దుమీరితే ముద్దుగా ఉండదు అనవసరముగా కూర్చుని మాటాడుతూ ఉంటారు కొందరు. అదే పనిగా మాటాడుతూ ఉంటే పనికిమాలిన సొల్లు కబుర్లుగా మారుతాయి. వినేవారికి విసుపు కూడా పుట్టుతుంది ఈ తేనె టీగల పట్టు నేరక కదిపాముర బాబూ' ఈ నోటికి తాళం లేదు కాబోలు! ఈ గచ్చపొదలోంచి ఎప్పుడు బయటపడ తామా? అని అనుకుంటారు. అలాగే ఆటా, పాటా అన్నీ ఒక హద్దు వుండాలి. మితభాషిత్వం మానవభూషణం. చూడండి. తేనె ఎంతో తియ్యని పదార్థం. తియ్యగా ఉందని హద్దూపద్దూ లేకుండా ఆస్వాదిస్తే అనారోగ్యానికి దారితీస్తుంది. అలాగే నవ్వు కూడా. ముద్దుగా, ముచ్చటగా ఉండాలి నవ్వు. విరగబడి నవ్వ కూడదు. అదేం ప్రారబ్ధమో కొందరు నవ్వుతూ ఉంటే ఏడుస్తూన్నట్టుంటుంది. అసహ్యంవేస్తుంది చూడడానికీ, వినడానికిన్నీ. కొందరు నవ్వితే వెనకనుంచి తాటక వీపు తట్టినట్టుంది. కొందరు నవ్వుతూన్నపుడు లక్ష్మణుని శిక్షకు గురియైన ఇంద్రజిత్తు మేనత్త ఇలాగే గాబోలు ఉంటుందనిపిస్తుంది. కొందరు నవ్వితే కుంభకర్ణుడి గురక గాబోలునని తోచుతుంది. దీనికి మనమేమీ చెయ్యలేము. వాళ్లు పుట్టిన వేళావిశేషం—అని అనుకుని ఊరకోవడమే కర్తవ్యం. సారమేమిటంటే దేనికైనా హద్దు ఉండాలని విశేషించి విరగబడి నవ్వకూడదు. అందునా ఆడవాళ్లు—పరువూ, మర్యాదా ఉన్న గృహిణులు అసలే విశేషించి నవ్వ కూడదు. అయితే ఏడవమంటావా? అని ఏ బుద్ధిమంతుడైనా అడగవచ్చు సంతోష సూచకమైన నవ్వే అట్టే కూడదంటే అమంగళసూచకమైన ఏడుపు ప్రస్తావన ఎందుకని జవాబు.

రాయలవారి కాలములో 'స్త్రీ నీతి పద్య రత్నావళి' అనే పేరుతో ఒక కవి ఒక చిన్న కావ్యం వ్రాసి రాయలవారి కొలువులో చదవనారంభించి—

'పతికి మారాడక, పలుమారు నేడ్వక
అలయక, మిగుల గయ్యాళిగాక'

అని ఒక పాదం చదివేసరికి సభలో

వున్న కొంటె తెనాలి రామలింగం లేచి 'ప్రభూ! ఇక మన మగవాళ్ళ పని అయి పోయింది. ఈ పుస్తకం ప్రజలలోకి వెళ్లిందంటే మగవాళ్ల పాట్లు కుక్కలు పడవు. మాబోటివాళ్ల మాటకేంగాని బండెడు సంసారం వున్న ఏలినవారివంటి ప్రభువులకు దినదిన గండంగానే వుంటుంది. చిత్తగించండి నీతులు. 'పతికి మారాడకు' - మగడు నెత్తి మొత్తుకుని దేనికి పిల్చినా మాటాడకు. మౌనమవలం బించు. 'పలుమారు నేడ్వకు'- అదేపనిగా ఏడవక ఏదో ఒక సమయం నిర్ణయించు కుని భర్తకెదురుగానో, పరోక్షంగానో యింట్లో కూర్చుని కొంతసేపు 'అలో' మని ఏడువు ఇంతతో చాలునను కుంటాను నీతుల వివరం. ఇంకా చెప్ప మంటారా? అని అడిగాడట!' రాయల వారికేమి తోచిందో మరి, కొంచెం నవ్వుకుని తరువాయి చదవనివ్వలేదట ఆ కవిని. ఇది అంతా అబద్ధమని కొట్టివేయ వద్దంటాను. నిప్పులేనిదీ పొగరాదు కదా' కొంత నిబద్ధిగా తీసుకోవాలి. ఈలాగే విపరీతంగా నవ్వితే పిచ్చి ఆస్పత్రికి పంప వలసివస్తుందా వ్యక్తిని.

విశేషించి గృహిణులు నవ్వకూడదు గచ్చకాయ పొద కదిపినట్టు. అలా నవ్వితే కొన్ని అనర్థాలు కూడా వున్నాయి దీనికే నవ్వు 'నవ్వు నాలుగు విధాల చేటు' అనే నాణెమైన సామెత పుట్టింది. ఏమిటా నాలుగు విధాల చేటో వివరిస్తాను చూడండి

మానవ మాణిక్యం అని చెప్పదగిన ధర్మరాజు తమ్ముల పరాక్రమం, కృష్ణుని అనుగ్రహం, స్వకీయ ప్రాభవం కలిసి రాజసూయం చక్కగా చేశాడు. జయజయ ధ్వనులతో యజ్ఞం ముగిసింది. బంధు వులూ, మిత్రులూ చాలామంది వెళ్ళి పోయారు. ద్వారకనుంచి వచ్చిన యాద వులు కొందరు, హస్తినుంచి వచ్చిన దుర్యోధనాదులూ మాత్రం వున్నారు.

ధర్మరాజు రాజసూయం చేస్తూన్నంత కాలం దుర్యోధనుడు రతనాల రాసులున్న భవనానికి అధికారిగా వుండేవాడు. రాజులూ, బంధువులూ, మిత్రులూ కాను కలుగా యిచ్చిన రతనాలు ఆ భవనములో పోయించడం, దానధర్మాల సమయములో తృప్తిగా యివ్వడం దుర్యోధనుని పని. అది ధర్మరాజు నిర్ణయమే.

క్రమంగా అందరూ తమతమ ఊళ్లకు వెళ్లిపోయారు దుర్యోధనుడూ, అతని తమ్ముళ్లు కొందరూ, అలాగే కృష్ణుడు, సాత్యకీ ఉన్నారు ఇంద్రప్రస్థంలో. ఒకనాడు దుర్యోధనుడు ధర్మరాజును చూపి మయసభ విశేషాలు చూడాలని ఉన్నదన్నాడు. 'దానికేం' చూడవయ్యా! మన భీమన్ననూ, నకుల సహదేవులనూ తోడుగా తీసుకుని వెళ్లు' అని అన్నాడు ధర్మరాజు.

ముందు దుర్యోధనుడు, వెనక నకుల సహదేవులు, మధ్య భీముడు ఉండి అక్క డక్కడ వింతలూ, విశేషాలూ వివరించి చెప్తున్నారు దుర్యోధనుడు నిల్చుని పరీ క్షగా చూస్తూ వెళ్తున్నాడు కొంత భాగం అయాక భీముడు ముందు, తరువాత దుర్యోధనుడు, వెనక నకుల సహదేవులూ వెళ్తున్నారు. భీముడికి అంతా పరిచితమే కనక గబగబా వెళ్ళిపోతూన్నాడు. నిదా నంగా వెళ్తున్నాడు దుర్యోధనుడు.

ఒక దగ్గర ముందు నీళ్ళమయం నేల అంతా. అది మామూలు నేల అనుకుని దుర్యోధనుడు వెళ్ళి నీళ్ళలో దిగి పోయాడు. బట్టలు తడిసిపోయాయి. విసుగుతో ఆ జాగా దాటాడు. అంతలో పైనుంచి పరిహాససూచకంగా నవ్వు విని పించింది. చిరాకుతో దుర్యోధనుడు పైకి చూశాడు. చెలికత్తెలతో పై అంతస్తులో వున్న ద్రౌపది కనిపించింది. దుర్యోధనుడు సిగ్గుతో, చిరాకుతో తలవంచుకుని ముందుకి వెళ్ళాడు. అక్కడ మామూలు నేల. కాని నీళ్ళున్నట్టు కనిపించుతూంది. దుర్యోధనుడు పంచ కొంచెం ఎత్తిపట్టుకుని మెల్లగానడిచాడు.ఏమీలేదే అని అనుకున్నాడు, మళ్ళీ నవ్వు పైన ద్రౌపది. 'ఊఁ కానీ!' అని అనుకుని ముందుకు సాగాడు. ఎదురుగా తలుపులు మూసినట్టు కనిపించింది. భీముడు కనిపించలేదు. రెండు చేతులతో ముందుకి తోసి తూగి పోయాడు. మేను నివురుకుని లేచాడు. మళ్ళీ నవ్వు పై అంతస్తులో వున్న పాంచాలి. 'నవ్వు' నవ్వు!' అని ముందుకి వెళ్ళాడు. కొంత దూరం వెళ్ళి అక్కడ ఏమీ లేనట్టే అనుకుని వెళ్ళాడు. పెదేలున ద్వారం తలకి తగిలి బొప్పికట్టింది. మళ్ళీ నవ్వు. దుర్యోధనుడికి కళ్ళలోంచి నిప్పులు తుళ్లుతున్నాయి. అలాగే మీదికి చూసి 'నన్ను యీలాటి అవస్థలో నీ కొలువులో చూసి నవ్వావు కదా! నిన్ను నా నిండు కొలువుకి యీడిపించి తెచ్చి, అవమానించి, నిన్ను నవ్వులపాలు చేస్తాను చూడు'—అని ప్రతిజ్ఞ పెట్టి హస్తినానగరికి వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళయిన తరువాత ఒక సభా భవనం కట్టించి దానిలో ప్రవేశించేముందు ఉత్సవంచేస్తూ పాండవులను ఆహ్వానించాడు. ఒకనాడు నిండు కొలువు. ఉబుసుపోకకి జూదం శకునిచే ఆడించాడు. దానిలో ధర్మరాజు ఓడిపోయాడు.

దుర్యోధనుడు తన ప్రతిజ్ఞ తీర్చుకున్నాడు, పకపక నవ్వి 'ఏమే దాసీ! ఆనాడు మయసభలో నన్ను చూసి నవ్వినట్టులేదే యీనాడు నీ బ్రతుకు!'—అని ఎకసక్కెమాడాడు.

నిండు కొలువులో వస్త్రాపహరణం, అరణ్యాజ్ఞాతవాసాలు, ఘోరమైన యుద్ధం, దానిలో దారుణంగా ఉపపాండవులు (ద్రౌపది కొడుకులు) చనిపోవడం నాలుగు విధాలా ద్రౌపది జీవితాన్ని కూలద్రోసింది.

పెద్దమామగారి కొడుకు,మన్నింపదగిన మరది మయసభలో తెలియక పడిన దురవస్థకి బాధపడడానికి బదులు ద్రౌపది నవ్వడం తగునా? ఏదో ఒక మారు నవ్వి అతని కంటపడకుండా తప్పుకుంటే ఏమగునో? ఏమయినా ఇంత దారుణంగా అవదు. ఇంకేమగునో చెప్పలేము.

ఏది ఏమయినా కానీయండి ఆడుబిడ్డ, అందునా ఇల్లాలు బొత్తిగా హద్దుమీరి నవ్వకూడదు అనడానికి ద్రౌపది నవ్వు బలీయమైన సాక్షి.

అయితే అలా నవ్వినవారందరికీ యీలాటి ప్రమాదాలు జరుగుతాయా అని ఎవరేనా అడగవచ్చు. దానికి సమాధానం చెప్పగలవారు పాఠకుల్లో ఎవరేనా ఉండరా? ★

స్కూల్ ఆఫ్ కరస్పాండెన్స్ కోర్సెస్

ఆంధ్రా యూనివర్శిటీ .: వాల్తేరు

1976–77 విద్యా సంవత్సరమునకు దిగువ తెలియపర్చబడిన కరస్పాండెన్స్ కోర్సులలో ప్రవేశమునకు భారతదేశములో గల, అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులు కోరబడుచున్నవి. దరఖాస్తులు తీసుకొనుటకు ఆఖరు తేదీ 15–7–1976.

కోర్సులు	సబ్జెక్ట్సు
రెండు సంవత్సరముల పి. యు. సి. (బోధనా భాష ఇంగ్లీషు లేక తెలుగు)	1. హిస్టరీ, సివిక్సు మరియు ఎలిమెంట్స్ ఆఫ్ ఇండియన్ ఎడ్మినిస్ట్రేషన్. 2. ఎకనమిక్స్ మరియు సివిక్సు. 3. ఎకనమిక్స్, ఎకౌంట్స్ మరియు కమర్షియల్ నాలెడ్జి. 4. హిస్టరీ మరియు ఎకనమిక్స్.

మూడు సంవత్సరముల బి. ఏ. (బోధనా భాష ఇంగ్లీషు మాత్రమే)	మెయిన్	యాన్సిలరీ
	1. ఎకనమిక్స్	హిస్టరీ మరియు పొలిటిక్స్
	2. హిస్టరీ	ఎకనమిక్స్ మరియు పొలిటిక్స్
	3. పొలిటిక్స్	హిస్టరీ మరియు ఎకనమిక్స్
	4. పొలిటిక్స్	పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్, హిస్టరీ
	5. పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్	పొలిటిక్స్ మరియు హిస్టరీ

మూడు సంవత్సరముల బి. కామ్. (బోధనాభాష ఇంగ్లీషు మాత్రమే)	స్పెషలైజేషన్స్ కాస్టింగు లేక సెక్రటేరియల్ ప్రాక్టీసు

రెండు సంవత్సరముల బి. జి. ఎల్. (బోధనాభాష ఇంగ్లీషు మాత్రమే)

గమనిక కరస్పాండెన్సు కోర్సుద్వారా బి.జి.యల్. డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణులయినవారు బి. ఎల్. డిగ్రీ చదువుటకు వీలులేదు. అడ్వకేట్లుగా నమోదు చేయించుకునేందుకు బార్ కౌన్సిల్ చే గుర్తింపు పొందరు.

రెగ్యులర్ విద్యార్థుల మాదిరిగానే యూనివర్సిటీచేత నిర్వహించబడే సిలబస్, పాఠ్యాంశాలు, డిగ్రీలు, పరీక్షలు ఈ స్కూలునుంచి నిర్వహించబడును. వయోపరిమితి లేదు. అభిలాషగల అభ్యర్థులు ప్రాస్పెక్టస్, సిలబస్ మరియు ఎగ్జెంప్షన్ తో, ప్రవేశానికి దరఖాస్తు ఫారములకొరకు రు. 5 లు (అయిదురూపాయలు మాత్రం) మనీయార్డరుద్వారా పంపి, ఈ క్రింది సంతకందారుకు రాసి తెప్పించుకొనవచ్చును. డబ్బు ఎందుకు చెల్లించుతున్నదీ మనియార్డరు కూపనుమీద స్పష్టంగా వ్రాయాలి. నగదు, చలాన్లు, చెక్కులు, డ్రాఫ్టులు స్వీకరించబడవు.

వాల్తేరు,
6–5–1976

ప్రొఫెసర్ కె. వి. శివయ్య,
డైరక్టర్.

మినీకథ:

ఓ సీటు కథ

కంపార్టుమెంటు అమిత రద్దీగా వుంది. అన్ని సీట్లూ ఆక్రమించుకోబడ్డాయి, ఒకటితప్ప. అది లోకనాథం ప్రస్తుతం తన స్వాధీనంలో వుంచుకున్నాడు. అంటే దానిమీద అతగాడు కూచున్నాడని కాదు. రైలుపెట్టెలో కిటికీ ప్రక్కనే వుండే ఓ సింగల్ సీట్‌లో అతడు కూర్చుని తన ఎదురుగుండా వున్న మరో సింగల్ సీటు పైన తన కర్చీఫ్ వేశాడు. కనుక ఆ కర్చీఫ్ వున్నంతవరకూ అది అతగాడి స్వంతమే మరి।

లోకనాథం, ఆ కంపార్టుమెంటు అంత రద్దీగా వున్నా, అలా ఆ సీటుని కర్చీపుతో ఆక్రమించుకుని, నిర్దాక్షిణ్యంగా ఎవరికీ ఆఫర్ చెయ్యకపోవడంలో ఒక నిగూఢార్థమూ, పురుషార్ధ ప్రయోజనమూ వుండక పోలేదు. అదే కంపార్టుమెంటులో గనక ఎవరేనా ఓ అందాల అతివ, పరువంలో వున్న పడుచూ గనక ఎక్కితే, ఆమెకా సీటు ఆఫర్‌చేసి తన ప్రయాణాన్ని 'కలరు' మయం చేసుకోవాలని అతడి వూహ. లోకనాథం ఉత్తిరోజుల్లో భగవంతుణ్ణి అమితంగా ప్రార్ధించే అలవాటున్నందున కాబోలు లేక అతగాడు పూర్వజన్మలో బోలెడు పుణ్యాలు చేసుకునివుండినందున కాబోలు, అతడి వూహకి అనుగుణంగా నిజంగానే ఓ పజ్జెనిమిదేళ్ళ అమ్మాయి ట్రయినెక్కింది. ఆమె తండ్రి బహుశా రైలెక్కించడానికొచ్చినట్టున్నాడు.

"జాగ్రత్తగా వెళ్ళు తల్లీ." అన్నాడా తండ్రి.

"ట్రయిను కదిలే టయిమయినట్టుంది. ఇక వుంటా నాన్నా. అబ్బా ఎంత రద్దీగా వుందో? ప్రయాణమంతా ఇలా నిలబడాలి కాబోలు."

"ఎంతమ్మా ఓ అరగంట యిలా నుంచుంటే యిట్టే కాళీ అయిపోదూ పెట్టె!"

"ఏమో బాబూ ఇలాంటి ప్రయాణాలంటే నాకు తగని చిరాకు" అంటూ ఆ అమ్మాయి తన అసహనం వెలిబుచ్చుతున్న తరుణంలో లోకనాథం లేచి కాలరు సవరించుకుని "మీకాశ్రమ లేదు మేడం. ఇదో ఈ ఎదురుసీటు మీకోసమే ఇందులో కూర్చుని హాయిగా ప్రయాణం చేయండి" అన్నాడు హీరోలా. గార్డు విజిలూదాడు.

"థాంక్సండి" అని ఆ పడుచు లోకనాథంతో అని "నాన్నా ఈ సీటు కాళీనేట! కనుక మీరింక హాయిగా ప్రయాణం చెయ్యొచ్చు వెళ్ళగానే వుత్తరం రాయడం మర్చిపోకండి. వుంటా" అని పెట్టె దిగి 'టాటా' అంటూ కదులుతూన్న రైలులోని తండ్రికి చెయ్యూపింది. లోకనాథం హతాశుడై ఆ తండ్రీ కూతుళ్ళకి జరిగిన సంభాషణ మరొక్కమారు నెమరువేసుకుని నాలిక్కరుచుకున్నాడు.

—కార్టూనిస్టు శశిధర్

వారసుడు

ఆ పెట్టెలో జనం కిటకిటలాడు తున్నారు. ఆ కొస నుంచి యీ కొస దాకా చూసాడు కాని, బాబుగారు కూర్చో డానికి ఎక్కడా చోటు దొరకలేదు అప్పల సామికి. నలుగురు కూర్చోవలసిన బెంచీ మీద ఆరుగురు, ఏడుగురు కూర్చున్నారు

"మా బాబుగారికి కూసింత సోటియ్యండి బాబూ" అన్నాడు అప్పల సామి అర్థింపుగా.

ఆ బాబూగారనబడే వెంకటరెడ్డి ఒక సారి అందరి మొహాల్లోకీ చూసాడు.

ఎవరూ చోటిచ్చి పుణ్యం కట్టుకోలేదు.

"ఒరే కొండా, నువు కింద కూకుని, ఆ బాబుగారికి సోటియ్యరా" అన్నాడు కళ్ళజోడెట్టుకున్న ముసిలాడు.

"మూడుంబావలా ఎట్టి టికెట్టు కొను క్కున్నాను. నానెందుకు కూసోవాల కింద." అన్నాడు కోపంగా కొండయ్య బిగదీసుక్కూచుని.

"కొన్నావులేరా మూడుంబావలా ఎట్టి' పెద్దోళ్ళంటే బయంబత్తి వుండొద్దేటి?" అని కసిరి, ఎదురుగా కూచున్న కొండయ్య రెండు చేతులూ పట్టి లాగాడు ఆ ముసలాడు — క్రింద కూచోమని! అప్పలసామి కొండయ్యను ఒడుపుగా సీటులోంచి బయటకు లాగి కింద కూర్చో పెట్టేశాడు.

"యిమానంలో ఎల్లాల్సిన మారాజు యీ బండిలో ఎడతన్నారండి. అరి జెంటుగా రమ్మని మినుష్రునుంచి పిలు పొస్తే అయిదరాబాదు ఎలతన్నారండి" అని ఆ బాబును అక్కడ కూచున్న వాళ్ళకందరికీ పరిచయం చేసి "కూకోండి బాబూ, కూకోండి" అని కొండయ్య ఖాళీ చేసిన చోటును తువ్వాలుతో తుడి చాడు అప్పలసామి.

ఆ బాబుగారు ఠీవిగా కూర్చుని, ఒక సారి అందరి వంకా చూసాడు.

"యిదేవన్నా దరమంగా వుందా? నాను ముందొచ్చి బెంచీ మీద కూకుంటే మీరెనకాలొచ్చి నన్ను కింద కీడ్చేత్తారా? నాను టికెట్టు కొనుక్కోలేదేటి?" అని సణిగాడు కొండయ్య.

"కొన్నావులేరా ఎదవ టికెట్టు— యింతోటి మొకానికి యీ సేబులం పసుపా అని సీటూ బెంచీ కావాలేటి?" అని కసిరాడు ముసిలాడు

బాబుగారు జేబులోంచి చుట్ట తీసి, ఓటి ముసలాడికి, ఓటి అప్పలసామికీ యిచ్చాడు.

"బాబుగారు యిన్ని గింజలు చల్లితే యేరుకోవాల్సిన వాళ్ళం మనం' పెద్దంత్రం సిన్నంత్రం లేకుండా యేటీ నీ సణుగుడు? కూకో, అలాకింద కూకో." అని గదమా

సి. సత్యనారాయణ

యించాడు అప్పలసామి చుట్ట నోట్లో పెట్టుకుంటూ.

ఆ బెంచీలమీద కూచున్న మిగతా వాళ్ళంతా, ఎవరికీ యేమీ పట్టనట్లుగా డ్రామా చూస్తున్నట్లు చూస్తున్నారు.

"యిది దవుర్జెన్నం బాబూ! మీవూరికి మీరు మారాజులు కావచ్చు. అయితే నాకేటి? నానెందుకు కింద కూకోవాలి?"

వాడి సణుగుడికి ముసిలాడు తాటాకు మంటలా లేచాడు.


"ఏటిరా నీ యేడుపు? నువు పుట్టిం దగ్గర్నుంచీ సోపాల మీద, పట్టు పరుపుల మీదా పెరిగేవుట్రా—కింద కూకోడానికి వలవలా యేడిసేత్తన్నావు' అలా కింద కూకో—ఒరన్నా దిగిపోతే కూకుందువు గానిలే." అన్నాడు కోపంగా.

అప్పలసామి ఛర్రున లేచాడు "ఆ బాబు లచ్చాధికారి. నువ్వేమో ఫకీరు వెదవ్వి. ఆ బాబుగారి కుక్కలికి కాళ్ళు పట్టడానిక్కూడా పనికి రానోడివి ఆ బాబుతో సమంగా బెంచీ మీదకూకుంటా వేటి? కూకో—అలా కిందకూకో. ఆడికో సుట్టముక్క పారెయ్యండి బాబూ ఏడుత్తన్నాడు." అని అరిచాడు కోపంగా.

ఆ మాటలు కొండయ్యకు ఛెళ్ళున తగిలాయి

"దరమం వుండాలి బాబూ, దరమం. డబ్బుంటే సరిపోద్దేటి? ఎదవ డబ్బు! ఆడ ముండా సంపాయిద్ది, యీది కుక్కా సంపాయిద్ది. సీ-వెదవ డబ్బు! ఏటి రంగన్నా తాతా, అలా సూత్తూ వున్నావు-దరమం సెప్పు—నానిలా కింద కూసోవాలా?" అన్నాడు కోపంగా.

అప్పుడే చలనం వచ్చిన



మనిషిలా కదిలాడు రంగన్న తాత. తన ప్రక్కనకూచున్న ఆ బాబుగారినీ, ఎదురుగా కూచున్న కళ్ళజోడు ముసిలాణ్ణి, అప్పల సామినీ ఒకసారి చూసి, కొండయ్యా మీద విరుచుకు పడ్డాడు.

"ఒరేయ్ నువ్వు మనుషుల్ని తిట్టు. దులిపేసుకుంటారు. కాని డబ్బును తిట్టకు. డబ్బంటే యేటనుకున్నావొరే? లచ్చిమీ దేవి—మహాలచ్చిమీ దేవి. లెంపలేసుకుని లచ్చిందేవికి దణ్ణం పెట్టుకో! ఆయమ్మ నీకాడుంటే యీ రైలుబండే కొనీయొచ్చు. రైల్లో మనుసుల్నీ కొనీయొచ్చు. మీ వూరి పెసిడెంటవ్వచ్చు. యమ్మెల్లే అవ్వొచ్చు. మినుష్ట్రు అవ్వొచ్చు. సభలెట్టెచ్చు. సమ్మానాలు చేయించుకోవచ్చు. బుర్ర లిత్తీయొచ్చు. బుర్రలు మార్చొచ్చు. ఆ డబ్బుమహత్తిం అంతా యింతా అనుకున్నావేటి?

నీకే డబ్బు నేకపోతే నీ పెళ్ళాం అవతలిది కాబూలీ వోడితో లేచిపోద్ది. నీకూతురు వూరంతకీ మరదలవుద్ది. నీ కొడుకు నీపీక కోరికేసి నీ శవాన్ని మెడికల్ కాలేజీ కమ్మేత్తాడు. డబ్బంటే యేటనుకున్నావ్?

నీకు డబ్బున్నప్పుడు చచ్చిపోతే గందం చెక్కల్తో తగలేత్తారు.

నీకు డబ్బు లేనప్పుడు చచ్చిపోతే మునిసిపాలిటీ బండిలో తోసేత్తారు.

నీకు డబ్బిలవ తెలవకపోతే మా నాయుడు బాబుగోరి నడుగు. మా సుక్కమ్మగోరి నడుగు. రాధమ్మగోరి నడుగు. ఆ యమ్మ బాబుగోరి నడుగు. అంతేకాని ఎదవ డబ్బని తిట్టమాకు!" అని వూపిరి పీల్చుకున్నాడు.

"మీ నాయుడి బాబంటే ఎవరు తాతా?"

"అలాగడుగు సెప్తాను."

* * *

నాయుడు బాబంటే మా వూరి పంచాయితీ పెసిడెంటు. సినీమాహాలు పొప్పురేటరు. పెంకులమిల్లు పొప్పురేటరు. రైసు మిల్లు ఓనరు. లారీ అస్సోసియేషను పెసిడెంటు.

ఆ బాబుకి ఆత్తి ఎంతనుకున్నావేటి?

ఆళ్ళ బాబిచ్చింది అయిదెకరాలు. అటు పక్క పదెకరాలూ, యిటుపక్క పదెకరాలూ కలుపుకుని పాతికెకరాలు సేసేడు. ఎండి గిన్నెల్లో ఏడంబలి తాగి యేభై ఎకరాలు సేసేడు. సినీమాహాలు కట్టి దాన్ని వందెకరాల్లు అయిందనిపించాడు. పంచాయితీ పెసిడెంటయిం తర్వాత ఇంకో రెండింతలు సేసీడు. ఈ గట్టుమీద కొబ్బరి పిట్టెక్కి సూత్తే అవతలి గట్టు కనిపించకుండా పెంచేడు.


ఊళ్ళో సినీమాహాలు కట్టేడు. పెంకుల మిల్లు కట్టేడు. సగ్గు బియ్యం ఫేక్టరీ కట్టేడు. నన్నేటి సెప్పమంటా వొరే—వూరంతా ఆ బాబుదే.

ఆ బాబు బంగళా ఎలాగుంటుందనుకున్నావేటి?

సినీమాల్లో సూపిత్తారు సూడు—రాజదర్బారు లాగుంటది! బారతంలో సెప్తారు సూడు—మయసబలాగుంటది! ఇల్లంతా ఏర్ కండీసను.

మరి ఆ బాబు పలుకుబడీ ఎలాంటిదనుకున్నావ్?

మా వూళ్ళో ఆ బాబు సెప్పిందే వేదం! పొలం తగువులూ ఆ బాబే తీర్చాల, ఇంటి తగువులూ ఆ బాబే తీర్చాల! నిన్ను కొన్ని



లర్ని సేయాలన్నా. ఖూనీకోర్ని సెయ్యాలన్నా ఆ బాబే సెయ్యాల. నడీధిలో నలుగుర్ని పొడిసేసి, ఆ బాబు కాళ్ళట్టుకో— మరి కేసుండదు. దొంగనోట్లచ్చేసి దొరికి పోయావనుకో! ఆ బాబు కాళ్ళట్టుకో— నీకేం బయంలేదు.

అల్లాంటి—అంత ఆత్తీ, పలుకుబడీ వున్న బాబుకి-మనోయా దట్టుకుంది-ఇంత ఆత్తి సంపాయించాను గందా, ఇంత పలుకుబడీ వుంది గందా, ఈటన్నిటికీ నా తరవాత ఓరసులెవరూ అని?

ఆ బాబుకు యాభయ్యేళ్ళొచ్చేయి కాని, ఒక్క నలుసుకూడా నేదు.

ఓరసుల్లేకపోతే, ఆత్తంతా పెబుత్వం పట్టుకుపోద్దని ఆ బాబుతో ఎవరో సెప్పారు.

ఆ రేత్తిరినుంచీ ఇంక నిద్దరపట్టలేదు.

ఇంత కట్టపడి, ఇంత మందినీ దోచి, ఇన్నన్యాయాలు సేసి ఇంతాత్తీ సంపాయించింది పెబుత్వం ఎదాన కొట్టడానికా అని గింజుకున్నాడు.

ఆ బాబుకి అన్నం సయించలేదు.

పెళ్ళయి ముప్ఫయ్యేళ్ళయినా ఒక్క పిల్లాణ్ణయినా కననందుకు పెళ్ళాంమీద కోపమొచ్చింది. ఆ కోపంతో పెళ్ళాన్ని తిట్టేడు. "యింక నీకు పిల్లలు పుట్టరేసే సెంద్రం?" అని ఇసుక్కున్నాడు.


ఇసుగెక్కుపై "ఇదిగో సెంద్రం, యిదే ఆఖరిమాట సెప్తున్నాను. నీకు మూణ్ణెళ్ళు టయిమిత్తున్నాను. నువు పిల్లోణ్ణెత్తుకోపోతే నేనింకో పెళ్ళి సేసుకుంటాను." అన్నాడు ఖరాఖండీగా ఓరోజు.

ఆ యమ్మ లబోదిబో మంది కాని, ఆ బాబు ఇనుకోలేదు.

నాయుడు బాబిలా రెండోపెళ్ళి సేసుకుంటాడన్న యిసయం ఎలా పొక్కిపోయిందో కాని, వూరంతా తెలిసిపోయింది. మా అమ్మాయిని సేసుకొమ్మంటే మా అమ్మాయిని సేసుకొమ్మని ఆ చుట్టుపక్కల వూళ్ళనుంచి జనం తిరణాళ్ళగా వచ్చేరు.

"ఆ బాబుని గుండెజబ్బులా తినేసింది కాని, ముసలోడా, ముతకోడా! బుగ్గన చుక్క, మొహాన బొట్టూ పెడితే పెళ్ళికొడుకు నాగుంటాడు. ఆ బాబు కిట్టమైతే, మా రెండోదాన్ని సేసుకోమను." అని కబురంపిన తల్లులున్నారు.

"మా పెద్దమ్మాయిని మీరు సూసే వుంటారు బాబూ, దీపం నాగుంటది. పొలంకెడదావని బయల్దేరతావుంటే,తలుపు



చాటున్నుంచుని సిగ్గుపడి పోతుందండీ అమ్మాయి. "యేటేసెప్పు" అన్నానండీ "నేన్నాయుడు బాబును పెళ్ళిసేసుకుంటా న్నాన్నా" అని సెప్పి వాళ్ళమ్మదగ్గరికి పారి పోయిందండి దానికి మీరంటే ఎంత పేమో, ఎంత అభిమానమో।" అని తెలి విగా సెప్పిన తండ్రులున్నారు

నాయుడు బాబు అన్నీయిన్నాడు. యిని మూణ్ణెళ్ళ తరవాత అందరి సంగతీ సూత్తా నని సెప్పాడు.

బస్తీలో నాయుడు బాబుకో మరద లుంది. పేరు సుక్కమ్మ. మరదలంటే ఓరనుకున్నావ్॰ సొయాన తమ్ముడి పెళ్ళా వన్నమాట బావగా రిలా మళ్ళీ పెళ్ళిసేసు కుంటున్నాడన్న సంగతి ఇని నమ్మలేక పోయింది. మనిసిని పంపించి ఇసయాలే మిటో తెలుసుకోమంది. తెలుసుకున్న తర వాత ఆ యమ్మకింక కళ్ళూ సేతులూ ఆడ లేదు. ఆరేతిరి నిద్దరట్టలేదు. సిన్నప్పటి సంగతులన్నీ గేపకం ఒచ్చేయి

అప్పుడు సుక్కమ్మకు పదేనేళ్ళు, సెంద్రమ్మకు పదారేళ్ళు వుండేయి కూతు ళ్ళిద్దరికీ ఓపాలే పెళ్ళిసేద్దామని ఆళ్ళబాబు దేశమంతా తిరిగి యిద్దరన్నదమ్ముల్ని సూసేడు పెద్దల్లుడి మొహంలో కుబేరుడి కళలున్నాయని, చిన్నల్లుడి మొహంమీద బుహస్పతి గీతలున్నాయని మురిసిపోయా వోడు ఆ తండ్రి.

ఆ కుబేరుడి కళలున్నాయన పేర్నా యుడు—మన నాయుడుబాబు.

ఆ బుహస్పతి గీతలున్నాయన సిన్నా రావు—నాయుడుబాబు తమ్ముడు.

ఆళ్ళిద్దర్నీ పెళ్ళి సూపులకి పిలిసి, కూతుళ్ళిద్దర్నీ సాపమీద కూచోపెట్టేడు తండ్రి.


సుక్కమ్మ సూపులన్నీ నాయుడుబాబు మీదేవున్నాయి. నాయుడు సన్నని లాల్చీ తొడుక్కుని పంచెకట్టేడు. సేతికున్న రెండుంగరాలూ, మెళ్ళో పులిగోరూ ధగ ధగ మెరుస్తున్నాయి. కుర్చీలో దర్జాగా కూచుంటే సివాసనం మీద దేవేంద్రుడు కూచున్నట్టుంది. ఆ బాబు మొహంలో దేశా న్నేలే జాతకం సుక్కమ్మకి కనిపించింది. "మొగాడంటే ఇలాగుండాల దర్జాగ." అనుకుంది


సెంద్రమ్మ మనసంతా సిన్నారావు మీదుంది ఆ బాబు పేంటూ, చొక్కా యేసుకుని బూటు తొడుక్కున్నాడు తల నున్నగా దువ్వుకుని బుద్ధిగా కుర్చీలోకూచు న్నాడు. ఆ బాబు మొహంలో సీరామ చంద్రుడు కనిపించేడు సెంద్రమ్మకి. "యీ సినబాబు నన్నుసేసుకుంటే సింవా చలం కొండకొత్తాను" అని మొక్కు కుంది.

పెళ్ళిసూపులయింతర్వాత అన్నదమ్ము లిద్దరూ ఎళ్ళిపోయారు.

"నేన్నాయుడు బావను సేసుకుంటా న్నాన్నా" అని సెప్పింది సుక్కమ్మ.

తండ్రి అదిరిపడ్డాడు. "సీ—సీ—ఎదప మాటలూ, నువ్వూను। సెంద్రికీ, పెద





బాబుకీ జత. నువ్వూ, సినబాబూ సిలకా గోరింకల్లాగుంటారు" అన్నాడు

"ఆ సిన్నారావూ, సన్నాసిరావూ నా కక్కర్లేదు. నేన్నాయుడు బావనే సేసుకుంటాను" అని మారాం సేసింది సుక్కమ్మ.

ఆ తండ్రికి మతిపోయింది. కూతురికి ఎలా నచ్చచెప్పాలో తేలేదు "ఆ పెద బాబులో ఏముంది పల్లెటూరి సన్నాసి' సదుగూ, సామూ యేటీలేవ్ప యవసాయం సేసుకుంటూ వూళ్ళోనే వుంటాడు. సిన బాబు సూడు, బస్తీలో సదూకున్నాడు. రేపో మాపో వుజ్జోగం వచ్చిందంటే బస్తీలో కాపరం యెడతాడు నిన్ను కార్ల మీద, యిమానాలమీదా తిప్పుతాడు." అన్నాడు తండ్రి

తండ్రి అమాయకత్వానికి కూతురు నవ్వింది. "నీకు బుర్రలేదు నాన్నా' సదూకొని వుజ్జోగం సేస్తే ముష్టిపడేసినట్లు మూడొందలిస్తారు. అదే యవసాయం సేసుకుంటే మూడేళ్ళలో ముప్పయ్యేలు ఎనకేసుకోవచ్చు ఇనకం టాక్సు ఓళ్ళ కూడా జెల్లకొట్టీయొచ్చు." అంది


కూతురి తెలివి తేటలకి ఆ తండ్రి ఆచ్చెరిపోయాడు. ఆడదానికిన్ని తెలివితేటలేంటని కోపమొచ్చింది. ఒచ్చి, యెంటనే ముహూర్తాలు పెట్టేశాడు.

సెంద్రమ్మని నాయుడుబాబు పెళ్ళిసేసుకున్నాడు.

సుక్కమ్మని సిన్నారావుసేసుకున్నాడు.

ఆ తరవాత సిన్నారావు కుజ్జోగమొచ్చి బస్తీలో కాపరంపెట్టాడు. ఆ బాబుకు తాలూకాపీసులో పని. జీతం మూడొందలుకాని, తెలివుంటే వూరంతా నొళ్ళేసుకునే వుజ్జోగమంట. యీ బాబేమో అరిచ్చెందుడు లాటోడు. పెళ్ళానన్నా అమ్మేత్తాను కాని, లంచంపట్టను అనీవోడు. జీతం మూడొందలూ యేటికి సరిపోతయ్యి. ఆ సుక్కమ్మ సీరలకీ, సోకులకీ సరిపోయీవి కావన్న మాట.

సంకురేతిరికి, ఇద్దరక్కసెల్లెళ్ళు మొగుళ్ళను తీస్కుని అమ్మగారింటికొచ్చేరు. సెంద్రమ్మ మెళ్ళో నాలుగుపేటల గొలుసు సూసింది సుక్కమ్మ. మొగుడికి సూపించి తనకూ సేయించమంది మళ్ళీ సంకురేతిరికి నెక్లేసు సూసింది సూసినెంటనే శివమెత్తిపోయి మొగుణ్ణి తిట్టింది "నాయుడు బావ మా సెంద్రానికి సేయించిన నెక్లేసు సూసేవా? మొగుడంటే అలాగుండాలి. నువ్వూ వున్నావు-జమాజట్టీలా ఎందుకు?"



అంది. ఆ మళ్ళీ సంకురేతిరికి దండ వంకీ ల్చూసింది సూసి ఎఱ్ఱెక్కి-పోయింది. "ఎదవ సదువు సదివి, సన్నాసుజ్జోగం సేసుకునీవోడికి నీకు పెళ్ళామెందుకు? నా మెళ్ళో తాళికట్టి నా గొంతు కోసావ్." అని యేడ్చింది.

ఇలా పదేళ్ళు నా కది సేయించు, ఇది సేయించని ఆ బాబు పేనాలు తోడేసింది. ఆ బాబు ఈటన్నిటికీ తట్టుకోలేక దొరికిన సోటల్లా అప్పులేచ్చేసేడు. వడ్డీతో ఒడిగుఱ్ఱాలన్నా పరుగెత్తలేవంటారు. అల్లాగ ఆ బాబు జీతమంతా వడ్డీకి సరిపోయేది. జీతం తెస్తేనేగాని తిండెట్టననేది సుక్కమ్మ. ఇంక ఆ బాబు పేనం యిసికిపోయి అన్నయ్యదగ్గిరికెళ్ళి ఆస్తి పంచమన్నాడు. తన వాటా అమ్మేసి అప్పు తీర్చుకుంటానన్నాడు

అప్పుడు నాయుడుబాబు యేటన్నాడనుకున్నావ్?

"అయ్య చచ్చీనాటికి మనకి ఆస్తీపాస్తీ యేటున్నాయి. ఉన్న డబ్బంతా నీ సదువుకే తగిలేశాడు. నువు పంచుకుంటానంటే, అయ్య సేసిన అప్పులింకా వున్నాయి" అన్నాడు.

ఆ బాబుకేటీ దారి గనిపించలేదు. ఇంటికొచ్చేసి పెళ్ళాన్ని తిట్టేడు. "నీ సీరలకీ, సోకులకీ అప్పులేసేను. నీమెళ్ళో బంగారం ఇచ్చేయి—అప్పు తీరుత్తాను." అన్నాడు. బంగారం ఇమ్మనేప్పటికి ఆ యమ్మ తాసుపాములా లేసింది. "యి య్యాల పెళ్ళాం మెళ్ళో బంగారం అమ్ముతానన్నావు. రేపు పెళ్ళాన్నే అమ్ముతానంటావు. సిగ్గూ, శరమూ లేదేటి?" అని తిట్టింది. అసలే అప్పుల్లో వున్నాడేమో, ఆ బాబుకు తిక్క-కోపంవచ్చేసి, ఆ బంగారం ఇయ్యక పోతే పొడిచేత్తానన్నాడు.

ఆ రాత్రి పడుకున్న సినబాబు పొద్దున్న లేవలేదు. "నన్ను అన్నేయంసేసి పోయినోవు దేవుడో" అని సుక్కమ్మ గోలు గోలున యేడిసింది. "సుక్కమ్మే మొగుడికి మందెట్టి సంపేసింది—యీయన్నీ దొంగేడుపులు" అన్నారు కొంతమంది. "అప్పులబాధ భరించలేక మందు మింగీసేడు" అన్నారు కొంతమంది. ఏటి నిజమో ఆ పాపం-పున్నెం మనకు తెలీదు.

ఆ తరవాత "సేవలేని మొగుడు వుంటేనేం, పోతేనేం?" అని సరిపెట్టుకుంది. పదికాసుల బంగారం అమ్మేసి ఒడ్డీ యాపారం ఎట్టుకుంది. అయిదేళ్ళలో ఇల్లు కట్టుకుంది.

ఆ ఇంటి పక్కనో డాట్రుబాబుండేవోడు, పేరు యిసినాదం. ఆ బాబు వైద్యం చేత్తానంటే జనం ఒచ్చీవోరు కాదు. అందుకని మందులసాపు ఎట్టుకున్నాడు. ఆ సాపులో సుక్కమ్మ మందులు కొనుక్కునీది. ఆ బాబు సుక్కమ్మదగ్గిర డబ్బు తీసుకునేవోడు ఒడ్డీకి. ఆ యిదంగా ఆళ్ళిద్దరికీ కలిసింది.

పదేళ్ళనుంచీ సుక్కమ్మింటికి ఒస్తూ, పోతూ వుంటాడు యిసినాదంబాబు.

ఈ సంగతులన్నీ గేపకం ఒచ్చీయన్న మాట సుక్కమ్మకి.

గేపకం ఒచ్చి కళ్ళంట నీళ్ళొచ్చేయి. "అప్పుడే నాయుడుబావను సేసుకుంటే మహారాణీలాగుండేదాన్ని గదా." అనుకుంది.

ఆ రేత్తిరి ఇంక నిద్దరట్టలేదు

తాటిచెట్టునీడ నీడాకాదు, తగులుకున్న మొగుడు మొగుడూ కాదు అనుకుంది

యిసినాదం బాబుకేటీ అర్ధంకాలేదు. "యియ్యాల నిద్దరావడం లేదేమిటే సుక్కా" అన్నాడు.

సుక్కమ్మ పక్కమీద లేచి కూచుంది. కూచుని యిసినాదం బాబు కళ్ళల్లోకి సూసి "నీకు మళ్ళీ జనమలో రుణం తీర్సుగుంటా కానీ, నాకో సాయం సేత్తివా మావా?" అంది.

"అద్దరేత్రికాడ సాయాలేటే పడుకో." అని కపిరాడు ఆ బాబు.

"నాకు నెలతప్పకుండా యిచ్చేవోడివి, అలాంటి మాత్రలు ఓ సీసాడు కావాలి. అరిజెంటుగా తెచ్చిపెట్టు." అంది. ఆబాబు మందుల సాపుకెళ్ళి, మాత్రలు తెచ్చేటప్పటికి, సుక్కమ్మ పెట్టె సర్దీసుకుంది. సీసా పెట్టెలో పెట్టుకుని అసలు సంగజ్జెప్పింది. "మా అక్కకు ఒంట్లో బాగోలేదంట! నే నూరెల్లి ఒత్తాను. ఇల్లూ, యాపారంబాగా సూడు. నేను లేనని బెంగపడీపోకు. మరి నన్ను బస్సెక్కించు." అంది.

ఆ బాబు ఎర్రిమొహం యేసుకుని సూత్తుండగానే, పెట్టె పట్టుకుని గడప దాటింది సుక్కమ్మ.

సుక్కమ్మ నాయుడింట్లో అడుగుపెడుతూనే ఏడుపు లంకించుకుంది. "నీకెన్ని కష్టాలొచ్చేయే సెంద్రీ, బావ మళ్ళీ పెళ్ళి సేసుకుంటే నీ బతుకేమయిపోద్దే సెంద్రీ! సింహాచలం కొండమీద సివాద్రప్పన్న వున్నాడు. అన్నవరం కొండమీద సత్తెన్నారాయణ మూర్తున్నాడు, ఏడుకొండల మీద ఎంకన్న బాబున్నాడు, ఏ బాబూ నీకు పిల్లోణివ్వలేదా?" అని యేడిసింది.

సెల్లిలి పేమకి అక్కకీ యేడుపొచ్చేసి సెల్లిల్ని కావలించుకుంది. కాస్సేపు యేడిసి "ఎలా జరిగేదుంటే అలా జరుగుద్ది. బగమంతుడు ఆయిధంగా గీత గీస్తే అనుభవించక తప్పుద్దా. యీమూడు నెల్లూ ఎలా గడుత్తాయో, యేటో!" అని యేదాంతం మాట్టాడింది.

"నువ్వేటీ బయపడకే సెంద్రీ! నిన్నొదిలేసి దేన్ని కట్టుకుంటాడో సూద్దాం. అయికోర్టు కీడిపించి సీస్సీ అనిపిత్తాను. సుప్పిరీం కోర్టు కెల్లయినా నీ కాపరం నిలబెడతా సూడు." అంది. "నువ్విలా బెంగెట్టేసుకుని మంచాన పడిపోతే లాబం లేదు సూడు ఆ కళ్ళు ఎలా లోతుకు పోయాయో పాలూ, పళ్ళూ తీసుకుని బలంగా వుండాల" అని ధైర్యం చెప్పింది.

పెతీ రోజూ పడుకోబోయే ముందు గ్లాసుడు పాలల్లో ఓ మాత్ర కలిపి అక్కతో తాగించేది. సెల్లెలి పేమకి సెంద్రమ్మ మనసు సెరువై పోయింది. "నేనంటే ఎంత పేమే సెల్లీ" అని కావిలించుకుని యేడిసీది ఆ ఎర్రి మొహం.

నాయుడు బాబిచ్చిన గడువు రోజులు దగ్గిర కొచ్చీ కొద్దీ సెంద్రమ్మకి కాళ్ళూ, సేతులూ ఆడేవి కావు. సెల్లి చెప్పినట్లు అయికోర్టు కెళ్ళయినా కాపరం నిలబెట్టుకో వాలనుకుంది "గంగలో ముంచినా, గోదార్లో ముంచినా నువ్వే ముంచవే సుక్కా— అని సెప్పి తాళం చెవు లిచ్చేసింది." ఎదవ డబ్బుపోతే ఎప్పుడేనా సంపాయించుకోవచ్చు కాపరం పోతే మళ్ళీ నిలబడుద్దేటి? బస్తీలో మంచి వకీల్నెట్టు" అంది.

సెంద్రమ్మ యింత తొందరగా లొంగిపోద్దని ఆయమ్మ అనుకోలేదు. సేతి కింత తొందరగా తాళాలొచ్చినందుకు అచ్చెరిపోయింది

నాయుడు బాబుకీ మరదల్ని సూడగానే మతి చలించింది. ఎప్పుడో ముప్ఫయ్యేళ్ళ క్రితం పెళ్ళి సూప్పుల రోజులు మళ్ళీ గేపకం ఒచ్చేయి. అప్పుడెలాగుందో పెళ్ళికూతుర్లాగ, యిప్పుడూ అలాగేవుంది' వయసొచ్చి ఒళ్ళు సేసింది కాని సుక్కమ్మ కేటి?

తెల్లచీర కట్టుకుంటే ఎదవ ముండ గాని, రంగు చీర కట్టుకుంటే సినిమా తారలాగుంటుంది.

ఆ రాత్రి నాయుడు బాబు కలలోకి సిలుకు సీర కట్టుకుని సుక్కమ్మొచ్చింది. ఒంటి నిండా బంగారం, బస్తీలో డాబా ఆ బాబు కళ్ళని జిగేళ్మనిపించేయి

"ఓరసుల్లేరని మళ్ళీ పెళ్ళి సేసు కుంటానంటే వందల కొద్దీ ఒచ్చేరు పిల్ల నిత్తామని' ఓ తులం బంగారం పెడతామని గాని, ఓ వెయ్యి రూపాయలు కట్నం యిత్తామనిగాని ఓరైనా అన్నారా? పిల్లనిచ్చి ఆత్తి కాజేద్దామని' గుంటనక్కల జిత్తులుగాని! పిలిత్తే లచ్చిమి దేవిలా ఒత్తాది సుక్కమ్మ. బంగారం వుంది. ఒడ్డీ యాపారం వుంది, బస్తీలో డాబా వుంది. సిలుకు సీర కట్టుకుంటే సీమహా లచ్చిమిలాగుంటది. యింకేటి కావాల?" అనుకున్నాడు నాయుడు బాబు.

సుక్కమ్మకీ నిద్దరట్టలేదు. సిలుకు లాల్చీ తొడుక్కుని కల్లోకొచ్చీ వోడు నాయుడు బాబు. ఆ బాబు సుట్టూ సినీమా హాళ్ళూ, సగ్గుబియ్యం పేక్టరీలు వుండీయి. లాల్చీ జేబుల్లో ఒంద రూపాయల నోట్లూ చెక్కు బుక్కులూ వుండేవి

నూకలు సల్లి గుర్రంలాంటి కోడి పుంజునైనా పట్టుకోవచ్చు సుక్కమ్మ ఆ తెలివితేటలే వుపయోగించింది. "పెద్దోళ్ళు పెళ్ళి సేసారని సిన్నారావుతో కాపరం సేసానుగాని, నామనసంతా నీ మీదే నాయుడు బావా." అంది "స్నేవున్న మొగుడు దొరికితే సేను గట్టు మీదన్నా కాపరం సేసుకుంటాను అంతే గాని, నీఆత్తీ డబ్బూ సూసి పేమించడం లేదు" అంది

ఆ మాటలకి నాయుడు బాబు రెండింతలైపోయాడు.

"కట్టుకున్న పెళ్ళాన్ని కట్ట పెడితే యింటికి యినాశం అని దాంతో కాపరం సేసాను కాని, పెళ్ళి సూప్పుల్రోజు నుంచీ నా మనసంతా నీమీదేనే సుక్కా' బగమంతుడు యీ రోజుకైనా ఓ సోటికి చేర్చేడు యిద్దరినీ!" అని సుక్కమ్మని దగ్గిరికి తీసుకున్నాడు



అల్లుడొచ్చాక వెంటనే వచ్చేది తేనెజాబిల్లి. (ఆంగ్లంలో హనీమూన్ తెలుగులో కొచ్చేసింది మరి!) జాబిల్లి చల్లదనంలో తేనెలూలికే వలపును పంచుకొంటున్నది 'అల్లుడొచ్చాడు' చిత్రంలోని నాయకుడు రామకృష్ణ, నాయకి జయసుధ. నిర్మాత ఎ. వి. సుబ్బారావు, కె. ప్రత్యగాత్మ దర్శకత్వంలో నిర్మించిన యీ చిత్రం త్వరలో విడుదల.

ఆ మర్నాడుదయం అక్క దగ్గరికెళ్ళి తసూ, బావా పెళ్ళి సేసుకుంటున్నామనీ, ఆశీర్దించమని అడిగింది సుక్కమ్మ.

ముందు ఆయమ్మ కర్దం కాక. యేటీ? అంది.

"బావా, నేనూ పెళ్ళి సేసుకుంటున్నాం, ఆసీర్దించు" అంది.

అప్పటిగ్గానీ ఆయమ్మకు తలకెక్క లేదు. ఎక్కగానే, పీటమీంచి లేచింది గుళ్ళో సూకాలమ్మలా! లేచి సుక్కమ్మ జుత్తట్టుకుని గుంజింది. కాళికాదేవిలా నాలిక సాచి, సెల్లెలిమీద యిరుచుకు పడింది. "సుట్టం సూపుగా కొంపకి సేరి, కొంపకే నిప్పెట్టేత్తావా? సెల్లెలివని సోటిత్తే మొగుణ్ణే ఎత్తుకుపోతావా? నీ గుడ్లు పీకేత్తాను. నీ రకతం తాగేత్తాను." అని సుక్కమ్మ తలని దభీ దభీ మని గోడకేసి కొట్టింది. యింకో దెబ్బ తగిలితే సుక్కమ్మ తల పగిలి పోయేదే కాని, యీలోగా నాయుడు బాబొచ్చి విడిపించేడు.

సెల్లెల్ని డిపించడానికి మొగుడురాగానే ఆయమ్మకి శివమెత్తిపోయింది. తలిరగబోసుకుని మహా మారిలా మొగుడిమీద పడింది సెంద్రమ్మ. ఆయమ్మ కోపం,

అవతారం సూపి పేనాలు తీసేత్తాదని బయపడిపోయాడు నాయుడు బాబు. పాలేళ్ళను పిలిసి పగ్గం తాళ్ళు తెప్పించీడు. సుక్కమ్మా, నాయుడుబాబు కలిసి ఆయమ్మ సేతులూ, కాళ్ళూ కట్టేసి ఓ గదిలో కూర్సోపెట్టేరు.

"ఆ పిశాచానికి తాళ్ళాలాగుతా యేటి? ఆ తాళ్ళు తెంపేసుగుందంటే నిన్నూ, నన్నూ కరకరా నములేద్ది, ఏ రేత్తిరికాడ మీద పడిపోద్దో బయంగా వుంది," అంది సుక్కమ్మ.

ఆ సాయంత్రమే నాయుడుబాబు యినప గొలుసులు తెప్పించేడు. పెళ్ళాం సేతులుకీ, కాళ్ళకీ గొలుసు వేయించీడు.

ఓరం రోజులు తిరక్కుండా సుక్కమ్మను పెళ్ళి సేసుకున్నాడు,

మూడేళ్ళు గడిసేయి కాని, ఆయమ్మకీ కడుపు పండలేదు.

ముందు పెళ్ళామయితే మొగుణ్ణీ, దేవుణ్ణీ నమ్ముకుంది కాని, యీయమ్మ మొగుణ్ణీ నమ్ముకోలేదు దేవుణ్ణి నమ్ముకోలేదు.

అయినా ఓ నలుసూ కలగలేదు.


నాయుడిబాబుకి యిసారం పట్టుకుంది. ఓరసుల్లేకపోతే యీ ఆత్తంతా ఏమైపోవాలి అని బెంగ పడిపోయేడు. "పదారేళ్ళ కుర్రదాన్ని పెళ్ళి సేసుకునుంటే, నాన్నా నాన్నా అని యీ పాలికి ముగ్గురొచ్చీవోరు. ఆత్తి కాసపడి యీ సుక్కమ్మని సేసుకున్నందుకు తగిన శిచ్చే పడింది. నలభైయేళ్ళ దాన్ని సేసుకుంటే పిల్లా పీచూయేటి? నా తెలివంతా యేటయిపోయింది? సీస్సీ" అని తిట్టుకుని లెంపలేసుకున్నాడు.


నాకు కట్నాలూ ఒద్దు, కానుకలూ ఒద్దు పదారేళ్ళ కుర్రద్దారికితే సాలన్నాడు నాయుడుబాబు. యీ మాటిని జనం తిరణాలలాగా ఒచ్చేరు నాకూతుర్ని సేసుకోమంటే, నాకూతుర్ని సేసుకోమని!

నాయుడుబాబు దగ్గిర గుమాత్తా ఒకడుండీవోడు గుర్నాదం అని' ఆ బాబుకి వూరంత ఆశ, గోరెతోకంత జీతమూను! తినడానికి మూడుపూటలూ వుండేది కాదు గాని కూతుర్ని కలెట్టరు కిచ్చి పెళ్ళి చేద్దామని వుండీది ఆ బాబుకి! అంచేత కూతుర్ని బస్తీలో సరివించీవోడు. బస్తీ సోకులు సేయించీవోడు. ఆ గుర్నాదం కూతురే రాధమ్మ.

రాధమ్మకి అయ్య తాహత్తెలుసు!తన్ని కలెట్టరికీ, యింజినీరికీ యిచ్చి పెళ్ళి సేయలేడని తెల్సు. అంచేత తనతో సదూకానే 'యేణు' నన్న సేసుకుందా మనుకుంది. అనుకుని పేమించింది. పేమించిందగ్గర్నుంచీ, యేణుబాబును సూడగానే ఆయమ్మకు పమిట నిలిసేది కాదు. యేణుబాబుకీ రాదమ్మన్నా, జారిపోయే పమిటన్నా యిష్టం అంచేత బజారుకి తీసుకెళ్ళీవోడు సినీమాలకు తీసుకెళ్ళీవోడు. కూడా ఒటేళ్ళకు తీసుకెళ్ళేవాడు.

నాయుడు బాబిలా పదారేళ్ళ కుర్రద్దారికితే సాలనేసరికి, గుర్నాదం బుర్ర తిరిగింది. తన కూతురు నాయుడుబాబు కోసమే పుట్టిందనుకున్నాడు. ఆపూట నుంచీ తన జాతకం మారి పోయిందనుకున్నాడు. తన కూతురు మహారాణీలా బతుకుద్దని మురిసిపోయేడు. రెండు, మూడే





ళ్ళలో ముసిలాడు కునికేత్తే, ఆత్తి పెత్తనమంతా తనదేనని ఆశపడ్డాడు. యీ శుభవార్త కూతురికి సెప్దామని పరుగు పరుగున యింటి కెళ్ళేడు.

'రాధా', 'రాధా' అని పిలిసేడు.

ఆయమ్మ పలకలేదు.

తలుపు విరిగిపోయేలా గుద్దేడు. ఆయమ్మ పలకలేదు.

లోపలేం సేత్తుందో కిటికీలోంచి సూసేటప్పటికి గుర్నాదం పేనాలు పోయేయి. యింటి దూలానికి సేంతాడు కట్టుకుంది. కురిసీయెక్కి వురేసికుంటోంది

ఆ బాబు తలుపు విరగ్గొట్టి కూతుర్ని కావిలించుకున్నాడు.

రాధమ్మ యెక్కెక్కి యేడ్సింది. "నాబతుకుక్కాలిపోయింది. యేణూ నన్ను సేసుకోను పొమ్మన్నాడు. నాకిప్పుడేటి దారి? వురేసుకోనా? పెద్ద సెరువులో పడి పోనా?" అంది.

"సీ స్సీ ఎదవ మాటలూ నువ్వూను! యేణూ సేసుకోనంటే సచ్చిపోవడమేనేటి? నిన్ను సేసుకోడానికి యేణూకి తాహతుందేటి? మారాణీలా రాజ్జేలేలాల్సిన జాతకం నీది. నువ్వు వూఁ అన్నావంటే లచ్చాధికారికిచ్చి పెళ్ళి సేత్తాను. నలభై లచ్చలాత్తికి పట్టాభిసేకం సేత్తాను." అని కూతురి కళ్ళు తుడిసేడు.

ఆ యమ్మకి ఏడుపింకా ఆగనేదు. "నాకు మూడో నెల నాన్నా. యీ పాపాన్నెలా మోయను?" అని అయ్యను కావిలించుకుంది.


గుర్నాదం నవ్వేడు. "సూసేవా? నలభై లచ్చలనేప్పటికి నేనంటూ ఓరసుడు గూడా ఒచ్చీసేడు. డబ్బు మహత్తిమే అంత!" అన్నాడు.

ఆయమ్మ కర్థంకాక తెల్లమొహం యేసింది.

నాయుడి సంగతంతా యివరంగా సెప్పేడు.

"నేను అరవయ్యేళ్ళ ముసిలోణ్ణి సేసుకోను. స్సీ." అంది రాధమ్మ.

అప్పుడు నాయుడు బాబుకున్న ఆత్తీ, పాత్తీ యివరాలన్నీ సెప్పేడు. సెప్పి "ఆ బాబు బతుకుతాడేటి? గుండెజబ్బుంది. సుగరు జబ్బుంది. పేనాలు తోడీసే వుబ్బసం జబ్బుంది. రెండేళ్ళు గడిసీయంటే గేరంటీగా కునికేత్తాడు. ఆ తర్వాత నీకిట్టమైన కుర్రాణ్ణి సేసుకుందువుగాని." అన్నాడు.



అప్పుడాయమ్మ మొహం దీపంలా ఎలిగింది. అయ్యా కాళ్ళకి దణ్ణం పెట్టి దీవించమంది.

రాధమ్మను సూడగానే నాయుడు బాబుకి కళ్ళు తిరిగేయి.

"నేను లచ్చిమీదేవిని సూళ్ళేదుగాని, వుంటే రాదలాగే వుండాల" అన్నాడు.

"సీ మహాలచ్చి మెచ్చి పెళ్ళిసేసుకుంటానూ అంటే కాదంటానేటి? ముహూర్తా లెట్టేయండి." అని తొందర సేసేడు.

రాదమ్మకీ, నాయుడుబాబుకీ మూడో పెళ్ళి జరిగింది.

యీ పెళ్ళి సెల్లదంది సుక్కమ్మ. తన కిట్టంలేదు కాబట్టి, నాయుడు బాబుకి పెళ్ళి సేసుకునే హక్కు లేదంది. సేసుకుంటే ఏ కోర్టుకెళ్ళినా తనే నెగ్గుతానంది. నెగ్గకపోతే రాధమ్మనీ, దానికి పుట్టే కొడుకునీ పీక నొక్కేత్తానంది.

ఆ మర్నాడు పోలీసులొచ్చేరు.రాదమ్మ పీక నొక్కేసిందన్న నేరం మీద సుక్కమ్మని జైల్లో యేసేరు పీక నొక్కుతానన్నాను కాని నొక్కలేదు మొర్రోమంది సుక్కమ్మ నొక్కేసీవంది రాధమ్మ. నాయుడుబాబూ, గుర్నాదం బాబూ అవునన్నారు. ఓ డాక్టరు బాబుకూడా సాచ్చికం సెప్పేడు. స [illegible] అయిదేళ్ళు జైల్లో వుండమ [illegible]

పెళ్ళయి ఆర [illegible] ర్తికాలేదు రాధమ్మకి [illegible] యిదేటి అ [illegible] రు.

"నేనెంత [illegible] పాయించానో సూద్దామని నొ క [illegible] దరగా వున్నట్టుంది" అని ఆస్సెం ఆడేడు నాయుడు బాబు డబ్బున్నోడు ఆస్సెం ఆడితే వూరంతా నవ్వద్ది ఆ ఆస్సేనికి బందువులంతా నవ్వేరు.


రాదమ్మకి కొడుకు పుట్టేడు


ఆ గొప్పదనమంతా తినదేనను కున్నాడు నాయుడుబాబు. ఆ బాబు సంబరానికి పట్టపగ్గాల్లేవు. ఆకాశమంత పందిరేయించాడు. ఊరంతా భోజనాలెట్టించాడు.

రాధమ్మ నాయుడు బాబును పెళ్ళిచేసుకుందనీ, తనకి కొడుకు పుట్టేడనీ, నలభై లచ్చలాత్తికి ఓరసుడయ్యేడనీ [illegible]బాకి తెలిసింది. తెలీగానే రెక్కలు గట్టుకుని ఒచ్చేసేడు. తన్ని క్షమించమని రాధమ్మ కాళ్ళ మీద పడ్డాడు. నువ్వు లేకుండా నేను బతకలేనన్నాడు

రాదమ్మ ఆలోసించింది ఆలోసించి ఓ సంవత్సరం ఆగమంది.

నాయుడుబాబు ఓరసుల్లేకముందు బెంగెట్టేసుకుని, యిసారంగ కూకుంటే జబ్బు మనిసిలాగుండేవాడు. యీ ముసిలాడు ఇవ్వేళో, రేపో కునికేత్తాడురా అనిపించేది. ఓరసునొచ్చింతర్వాత ఆ బాబుకి రెండింతలబలం ఒచ్చింది. ముప్పయ్యేళ్ళ యువకుల్లా చకచకా పనిచేత్తా





వుంటే యీ బాబు ఇంకో ఒందేళ్ళు బతికే లాగున్నాడనిపిత్తుంది.

ఓయేడు ఓపిక పట్టింది రాధమ్మ. కొడుకు పెరిగి కేరింతాలు కొట్టీ కొద్దీ యీ ముసిలాడి ఆయుస్సు పెరిగీలా కన్పించింది. యేణు బాబూ బరించలేక పోయీవోడు "యింకా ఎంత కాలం తపస్సు సేయను రాధా'' అని బతిమలాడీవోడు

''నన్నేటి సేయమంటావు యేణూ। నాకేటీ దారి కన్పించడం లేదు. నిన్నెప్పుడు పెళ్ళి చేసుకుందామా, నీ గుండెల మీద ఎప్పుడు ఓలిపోదామా అనిసెంద్రుడి కోసం సెకోరంలా సూత్తున్నాను యీ ముసిలోడు యిప్పట్లో సచ్చేట్టులేడు మన కేటి దారి॰'' అని యేడిసింది రాధమ్మ.

ఆడది యేడిత్తే, సేవున్న మగోడూరుకుంటాడా॰ రాధమ్మ కళ్లు తుడిసీడు. సెంప మీద ముద్దెట్టుకున్నాడు. "నువ్వేటీ ఇసార పడకు. యీ ముసిలాడి పని నేన్చూసుకుంటాను.'' అన్నాడు.

అప్పుడు యేణూ బాబు యేటి సేసీడనుకున్నావ్?

ఓ సక్కని సాయంత్రం—సేలో సింత సెట్టుకింద కూకున్నాడు తళతళలాడే కత్తి మొల్లో దోపుకుని నాయుడి కోసం కాసీడు.

కూనిరాగా త్తీసుకుంటూ, ఇరక్కాసిన సేను సూసుకుంటూ బుజంమీద కఱ్ఱేసుకుని ఒచ్చీడు నాయుడుబాబు.

''ఓరసుడు బాగున్నాడా తాతా?'' అని పలకరించేడు యేణూ.

నాయుడు బాబుకి యీ కొత్త మొహం యెవరో, తన సేలో కెందుకొచ్చేడో అర్ధం కాలేదు.


"సేను సూసుకోడానికి నేనున్నాను గందా, యింత కట్టబడి యింత దూరం ఎందు కొచ్చేవు తాతా।" అని అడిగేడు యేణూ.

యేణూ మొగం సూడగానే, యిదేదో దొంగ మొకంలా తోచింది నాయుడు బాబుకి.

"ఎవుడువురా నువ్వు నాసేలో కొచ్చీవూ?'' అన్నాడు కోపంగా.

"ఎవుణ్ణా॰ నీ మూడో పెళ్ళాం రాధ మొదటి మొగుణ్ణి. ఓరసుడికి తండ్రిని. నువు సచ్చింతర్వాత రాధకి మొగుణ్ణి. నీ ఆస్తికి ఓరసుణ్ణి." అన్నాడు యేణూ యెటకారంగా కవ్వింపుగా.

ఆ మాటలకి నాయుడి కళ్ళు చింత నిప్పుల్లామండేయి "యేత్రా పేల్తన్నావ్!"



అని సెప్పి బుజం మీద కఱ్ఱ తిప్పి యేణూ బుఱ్ఱమీద కొట్టేడు.

ఆ దెబ్బ తగిలితే యేణూ బుఱ్ర పది చెక్కలై పోయేది. ఒడుపుగా తప్పించుకున్నాడు. పెద్దపులిలా మీద కెగిరి నాయుడి గుండె మీద తన్నేడు.

నాయుడు వెల్లకిలా పడిపోయేడు.

యేణూ మొల్లోంచి కత్తి దూసి, కసుక్కుమని గుండెల్లో పొడిచేడు. "యాభయ్యేళ్ళు అనుభవించేవు గందా ఈ ఆస్తిని యింక రాధకీ, నాకూ ఒగ్గెయ్" అని కసిగా యింకో రెండు పోట్లు పొడిచేడు——"అని కథ ఆపేడు రంగన్నతాత.

రైలు యేదో స్టేషనులో ఆగింది. అప్పటిదాకా కథ వింటూ కుత కుత వుడికి పోతున్న యెంకటరెడ్డి, చిరాగ్గా పరుగుల్ని చూసినట్లు చూసాడు రంగన్నతాతానీ, కొండయ్యనీ "స్సీ నీతీ జాతీలేని మనుషులు. రారా అప్పలసామీ" అని కోపంగా దిగిపోయి ప్రక్క పెట్టెలోకి మారి పోయేడు.

"యీ బాబు గోత్రం, మా నాయుడి బాబు గోత్రం ఒకేలాగుంది" అనుకుని రంగన్న తాత ఆశ్చర్యంతో నవ్వుకున్నాడు.

వెంకటరెడ్డి లేచి పోగానే, కొండయ్య సంతోషంగా బెంచీ మీద కూర్చున్నాడు. దర్జాగా కాళ్ళు చాపుకుని, సుట్ట అంటించుకున్నాడు.

"అయితే రంగన్నతాతా, నివరికి యేణూ, రాదమ్మ పెళ్ళి సేసుకుని ఆ వూళ్ళోనే వున్నారా" అన్నాడు వాళ్ళను చూసి తీరాలన్నంత వుత్సాహంగా.

ఆ తెలివి తక్కువ ప్రశ్నకి రంగన్న తాత గయ్యిన లేచాడు కోపంగా "ఏనుగు తలకాయంత తలకాయ వుండగానే సరిగా దొరే! నీమ తలకాయంతైనా తెలివుండాలి. రామాయణం అంతా యిని రాముడికి సీతేమవుద్ది అని అడిగినట్లా టోడే! డబ్బు మహత్తిమంతా అరటి పండొలిచి పెట్టినట్టు సెప్తె, యేణూ, రాధా పెళ్ళి సేసుకున్నారా అని అడుగుతావా?

నలభై లచ్చలాత్తికి ఓరసురాలు రాదమ్మ! దమ్మిడీ లేని బికారి యెదవ యేణూని యేం సూసి సేసుకుంటది?

నా మొగుణ్ణి సేలో ఎవరో సంపేసేరని కేసెట్టింది.

పోలీసులొచ్చేరు, యినస్పెట్రు బాబొచ్చేడు.

ఎవరు సంపీరంటే, ఎవరు సంపీరన్నారు.

నాయుడుబాబు పంచాయితీ పెసిడెంటు కాబట్టి, యిట్టంలేని ఎగస్పార్టీ వాళ్ళు పొడిచీసేరని, యినస్పెట్రు బాబు రిపోర్టు యిచ్చేడు.

"స్సీ స్సీ!" అంది రాధమ్మ.

యేణూ పొడిచీసేడంది.

యేణూ తన్ను పేమించేడని. తను

నాయుడు బాబును పేమించి పెళ్ళి చేసు కున్నానని, అంచేత యేణూ ఓర్వలేక తన దేవుడు నాయుడు బాబును పొడిచేసేడని గోలు గోలున యేడ్చింది. యేణూని వురి తీస్తేనేగాని మొగుడి మనసుకు శాంతి కలగదంది.

గుర్నాదం అవునన్నాడు.

ఊరంతా అవునంది.

యేణూకి యేడేళ్ళు జైలు పడింది.

ఆ తర్వాత మూణ్ణెళ్ళు తిరక్కుండా, యిల్లూ సేనూ బేరం పెట్టేరు. పెంకుల మిల్లు, సినీమాహాలు అమ్మేసేరు. సగ్గు బియ్యం పేక్టరీ కూడా అమ్మేసేరు. మొత్తం ముప్పయి, నలబై లచ్చలొచ్చేయి ఓ రాత్రి మూటా, ముల్లే సర్దుకుని గుర్నాదం బాబూ, రాదమ్మా మద్రాసు సక్కాపోయేరు'' అని ముగించేడు రంగన్నతాత.

కొండయ్య ఆశ్చర్యంగా నోరు తెరిచాడు.

"ఒరే కొండా, నీకింకా డబ్బు మహాత్తిం అర్దం కాకపోతే బెజవాడలో దిగిపోయి సరకార్ ఎక్స్‌ప్రెస్‌లో కూచో; ఆ బండి తిన్నగా మదరాసు ఎల్లిపోద్ది. టికెట్టు కలెక్టరుబాబుకి ఓ రొండ్రూపాయలిచ్చి సేవంటే నువు మదరాసులో దిగిపోవచ్చు. రాదమ్మ కాళ్ళు కడిగి నెత్తిన చల్లుకో—డబ్బు మహత్తిం యిట్టే అర్దమయిపోద్ది." అని నవ్వేడు రంగన్నతాత

కొండయ్య మొహం చూస్తే మదరాసు వెళ్ళేలాగే వుంది. ★

సీరియల్

స్నేహమంగళ

ఎ. శ్యామలారాణి

జరిగిన కథ: చిన్నతనంలోనే తల్లి దండ్రుల్ని పోగొట్టుకున్న మంగళకు అండగా నిలిచి ఆమె ఆస్తిపాస్తుల్ని సంరక్షించి ఆదరించాడు చౌదరి రామం కుటుంబంలో దాదాపు ఒక మనిషిగా మసలేది మంగళ. రామం భార్య గౌరి అంటే ఎంతో అభిమానం. రామం తమ్ముడు రాజంటే ఎంతో అనురాగం ఆమెకు. రాజు చదువుకు డబ్బు సాయం చెయ్యాడానికి తనకున్న ఒక్క ఆధారమూ అయిన యిల్లు అమ్మేసింది మంగళ. పట్నంలో పెరిగి చదువుకున్న గౌరి, మురళిబాబును ప్రేమించీ అతన్ని పొందలేక పోయిందన్న విషయం ఒక సందర్భంలో గౌరే చెప్పింది మంగళకు. ఇల్లు అమ్మిన మంగళని తన యింట్లోనే వుండమన్నాడు రామం. మురళిబాబు వచ్చి గౌరిని కలుసుకొన్నాడు. గౌరి పిన్ని ఆడిన దుర్మార్గపు నాటకం కారణంగా మురళీబాబు తనను చేసుకోలేక పోయాడని తెలిసిన గౌరి కలత చెందింది. తన స్నేహితురాలు కృష్ణవేణిని పడుపువృత్తిలోకి దింప ప్రయత్నిస్తున్న ఆమె తల్లికి నచ్చచెప్పి కాపాడింది మంగళ. కృష్ణవేణిని పొందాలని చూసిన రంగనాధానికి బుద్ధి చెప్పింది మంగళ. హఠాత్తుగా రామం మరణించాడు. ఆ బాధ తట్టుకోలేని రాజు మనశ్శాంతికోసమని చెప్పి గమ్యం లేని యాత్రకు బయల్దేరాడు. రంగనాథం మంగళపై పగబట్టాడు. డబ్బు చిక్కులు ఎక్కువై సతమత మవసాగారు మంగళ, గౌరి. పరిస్థితి చక్కదిద్దేందుకు తీవ్రంగా ప్రయత్నించ సాగింది మంగళ. మంగళపై గౌరికి దురభిప్రాయం ఏర్పరచేందుకు ప్రయత్నించిన రంగనాధానికి శృంగభంగమయింది. కన్నుకు ప్రమాదకరమైన జబ్బు చేస్తే మురళిబాబు వైద్యంచేసి ఆదుకొన్నాడు.

"మురళీ!" పిచ్చిగా అరచి, బలమంతా ఉపయోగించి చేయి విదుల్చుకుని మస్తకం తుడిచేసుకుంది. జరిగినదానికామె వణికిపోతూంది.

"ఏం గౌరీ! ఆ అబ్బాయన్నదాన్లో తప్పేముంది? ఆ ముక్కే నేనొకనాడంటే నువ్వెగిరిపడ్డావుగాని — అవున్లే — ఎవరి ముఖ పిరేమిటో!" ఉలికిపడి, ఆ మాటలు వచ్చినవేపు తిరిగారిద్దరూ. రంగనాథం వెటకారం మిళాయించి, పిశాచంలా నవ్వుతున్నాడు.

వేటగాడిని చూసిన లేడిలా బెదిరిపోయింది గౌరి. ఏమిటో మైకం కమ్ముతూన్నట్టనిపించింది. అతనొక్కడే కాదు, ఆ వెనుక ఎవరెవరో ఉన్నారు. అంతా మసకమసకగా అయిపోతూందామెకు. రంగనాథం వెనుకగా నడుస్తూన్న చిన్న గుంపులో అప్పుడే రకరకాల చర్చలు బయలుదేరుతున్నాయి

మంగళ కన్నగాడిని తీసుకుని అక్కడికి చేరేసరికి అప్పుడే వాతావరణం తీవ్రతరమౌతూంది. మండపం మెట్లమీద అపరాధుల్లా నిల్చునున్నారు గౌరీ, మురళిబాబూ. క్షణాలమీద ఊళ్లోకి ప్రాకిపోయిందీ సంగతి.

"గౌరీ! ఏం జరిగింది?" కంగారుగా అడిగింది మంగళ.

"అంతా నా ఖర్మ మంగళా! నా ఖర్మ" ఏడుస్తూ స్తంభానికేసి తల బాదుకుంది గౌరి.

"నే చెప్తా వినవే కోడలా!" అంటూ ఆప్యాయంగా ముందుకొచ్చాడు రంగనాథం. "ఆవిడగారు తెలిసే పెట్టుకుందో, తెలియకే పెట్టుకుందో పాపం పుణ్యం మన కెందుకుగాని- ఆవిడ నుదుటిని కాసంత కుంకుం బొట్టు మాత్రం ఉంది. అది చూసి పాపం, సంతోషం కొద్దీ ఏమేమో అన్నాడీ పెద్దమనిషి. తప్పేముంది? ఆ వయసు కుర్రాడాడవలసిన మాటాడేడు! పాపం, తనకి మాత్రం మొగుడంటే పోయాడు కాని, పొంగులెత్తే వయసు, కోరికలో మూల కాల్చి చంపుతూంటే నిగ్రహించుకోవడమంత తేలికా? ఏదో పాపం సరసమో, సరాగమో జరిగుంటుం దిద్దరిమధ్య! నేనయితే నా కెందుకొచ్చిన గొడవని కళ్లు మూసుకుపోయేవాడినే! కాని, ఇదిగో వీళ్ళందరి కళ్ళు కూడా పడ్డాయి మరి. నేనూరుకున్నా వాళ్ళూరుకోవద్దూ!" చమత్కారంగా కథ నల్లుతూ చుట్టూ ఉన్నవాళ్ళని గొడవ లేవదియ్యమన్నట్టుగా చెప్పకనే చెప్పేడు.



"అవును మునసబ్బాబూ! ఈ యవ్వారమేటో ఇయ్యాల తేలిపోవాల్సిందే — ముసుగులో గుద్దులాట యాపారం మనూర్లో సాగటానికీల్లేదు." వెంటనే అందిపుచ్చుకున్నాడు రంగనాథానికి కుడిభుజంలాంటి కోటయ్య

అప్పటికే గుంపు పెద్దదైంది. గుసగుసలెక్కువయ్యాయి. ఆడంగులు కూడా చేరి 'ఓలమ్మ' అంటూ బుగ్గలు నొక్కుకుంటున్నారు. కోటయ్య గొంతు ఒకమారు పైకి లేవగానే, దానికి మరి నాలుగు కంఠాలు కూడా జోడు కూడేయి.

"అవునవును. అదేదో తేల్తేనేకాని, అల్లని కదల్నియ్యడానికీల్లేదు!"



"అవును రంగనాదం బాబూ! మనూరి పెతిష్టకి మచ్చ రాకుండా మీరే సూడాలి."

"ఎవరు మీరంతా? ఏమిటిక్కడీ గొడవ? వెళ్ళండి ముందు." అంత సేపూ అసహనంగా వాళ్ళందరి మాటలూ వింటూన్న మురళి బాబు కంఠం ఖంగుమంది.

"ఒల్లకోవోయ్' నీ యవ్వారమేందో తేల్తేగాని మావెల్లం!" చుట్ట నోట్లోంచి తీసి సమాధానం చెప్పేడో బుచ్చిరెడ్డి.

"పద గౌరీ! ఈ మూర్ఖపు మాటలకి బాధపడకు." అన్నాడు మురళిబాబు. చేపాటి కఱ్ఱ చేతపుచ్చుకుని, వాళ్ళకి అడ్డుగా ముందుకొచ్చాడు కోటయ్య యమ భటుడిలా చూస్తూ.

వ్యవహారం శ్రుతి మించిపోయిందని మంగళకర్థమైంది. ఏం చెయ్యాలో పాలు పోలేదు. బింకమంతా ఎటో ఎగిరి పోయింది. చివరికి చౌదరన్నమాటే నిజ మయింది. గౌరిని చూస్తూంటే మతి పోతూంది. అలనాడు అయోధ్య ప్రజల ముందు అగ్నిపరీక్షకు నిలబడితే, సీతమ్మ ఇలాగే ఉండేది అన్పిస్తూంది. కన్న ఈ సందోహాన్నంతటినీ బితుకుబితుకుగా చూస్తూ మంగళ గుండెలకతుక్కు పోయాడు.

"మామయ్యా!" అంటూ రంగనాథం దగ్గరగా వచ్చింది మంగళ. "నీకు దండం పెడతాను. ఈ గొడవాపించు. నేనెప్పుడేనా తెలిసీ, తెలియక ఏమైనా పొరపాట్లు చేసివుంటే క్షమించు!" అని ప్రాధేయ పూర్వకంగా అడుక్కుంటున్నట్టున్నాయా చూపులు రంగనాథానికి. మంగళని అలాంటి స్థితిలో రంగనాథం ఎప్పుడూ చూసి ఉండలేదు. 'ఇప్పటికి పొగరు దిగిందన్నమాట'' గర్వంగా మనసులోనే అనుకున్నాడు.


"ఓసి పిచ్చిపిల్లా! నేనేంజెయ్యనే? ప్రజాబలమే తల్లీ ప్రజాబలం! వాళ్ళ కళ్ళతో వాళ్ళు చూస్తున్నారంతా. ఎంత మునసబునయితే మాత్రం ఇందరి నోళ్ళు నొక్కగల సాహసం నేను చెయ్యగలనా?" తారస్థాయిలో అందరికీ వినపడేలా అరిచాడు రంగనాధం. రంగనాధం ఆడిన ప్రతి మాటా అక్కడి జనాన్ని రేకెత్తించేదిగానే ఉంది,

"మామయ్యా!" అంది మరోమారు మంగళ.

'నీ కాళ్ళు పట్టుకుంటాను' అని జాలిగా అడిగినట్టనిపించిందతనికి. రోగం కుదర్చాలన్నట్టు బెల్లంకొట్టిన రాయిలా నిల్చున్నాడు.

"మంగమ్మా' ఈ మీటింగులో ఏదో ఒకటి తేలాల్సిందే. నువ్వు పక్కకి తప్పుకో. నీకేటీ తెలీదు" అన్నాడు కోటయ్య. రంగనాధం విషపు నవ్వొకటి నవ్వేడు. దాని అర్థం మంగళకు బాగా బోధపడింది.

ఇక తమకెవరు దిక్కు? ఎవరు రక్షించేవారు? ఎదురుగా గర్భగుడిలో సర్వమంగళాదేవి విగ్రహం, జరుగుతూన్నవాటితో ఏమీ నిమిత్తం లేకుండా చిరునవ్వులొలికిస్తూ, నిశ్చలంగా, నిర్మ



లంగా ఉంది. అవును మరి, ఆమె ద్వంద్వాతీతురాలు ఇదంతా ఆమె లీలా విలాసం. దీనంగా చేతులు మోడ్చి, మనసులోనే పరిపరివిధాల వేడుకుంది మంగళ. ఆ వేడికోలులో తనకు తెలియకుండానే ఏమో కోరుకుంది మంగళ. ఆ కోరిక సాకారం కావాలన్న నిశ్చయం చోటు చేసుకుందామె మనస్సులో.

ఊళ్ళో ప్రముఖులన్నవాళ్ళు, ముష్కరపు సరుకు మూఢజనం అంతా చేరారక్కడ.

"ఏమిటీ గొడవ? నన్నడ్డడానికి మీరెవరు మధ్యన? మర్యాదగా వెళ్తారా? పోలీస్ కంప్లయింట్ ఇమ్మన్నారా?" కోపంగా అడిగాడు మురళిబాబు.


"అయ్యోరబ్బ' పోలీసోడి పేరింటే జడిసిపోతావనుకుంటున్నావు గావాలః మా దగ్గరా పప్పులేం ఉడకవ్. ముందు మాకు సమాధానం చెప్పు నువ్వు. నువ్వెవరసలు? ఎక్కడ్నించొచ్చినావు? నీకూ, గౌరమ్మకీ ఏటి సంబంధం?" నిలదీసి అడిగాడు బుచ్చిరెడ్డి.

"హుఁ సంబంధం! మీకర్థంకానిది" ఛీత్కరించుకున్నాడు మురళిబాబు.

మంగళ నెమ్మదినెమ్మదిగా రంగనాథం గుంపులో చేరిపోయింది. రంగనాథం ప్రక్కనే నిలబడి, నడుంమీద చెయ్యేసుకుని, అందరిలాగే ఏం జరుగుతుందో చూదాం చిత్రం అన్నట్టుగా నిలబడింది. రంగనాథం రవంత తికమకగా నాలుగైదు సార్లు ఓరగా మంగళని కనిపెట్టేడు. అతనికేమీ అంతుచిక్కలేదు. చివరికి మెల్లగా మొదలెట్టేడు కవ్వింపుగా "చూశావుటే మీ గౌరమ్మ సంగతి. ఇంకా బాగా చూడు. అవేళ నువ్వు కూడా నోటికొచ్చినట్టు మాటాడేవు జ్ఞాపకముందా?"

"అవున్లే నేనే తొందరపడ్డానావేళ. అయినా దీన్లో గౌరి ఒక్కర్తె తప్పేముంది? ఏదో డాక్టరుబాబు కదా వచ్చి వైద్యం చేసి వెళ్ళేడనుకున్నానుకాని, మీరంతా అంటూంటే నాకు ఇప్పుడు కాస్త ఎబ్బెట్టుగానే తోస్తూంది." అంది గోడమీద పిల్లివాటంగా.

రంగనాథం పుంజుకుని రెండడుగులు ముందుకేసి మురళిబాబు దగ్గరగా వచ్చాడు. "చూడు బాబూ! పెద్దవాడిని. ఊరికి మునసబుని. ఎందుకు చెప్తున్నానో వినుకో, మేం అడిగినదానికి నువ్వు తిన్నగా సమాధానాలు చెప్పకపోతే అసలే



మేం పల్లెటూరోళ్లం, మోటుమనుషులం·" తెలివితేటలన్నీ ఉపయోగించానను కుని మీసం మెలేసుకున్నాడు.

మురళీబాబు ఆవేశంగా జనం ముందు కొచ్చాడు. "బెదిరిస్తున్నారా నన్ను? ఈ బెదిరింపులకి లొంగవలసిన వాడిని కాను నేను. మంచి,మర్యాదా మరచిపోయిఈవాళ నన్నిన్ని చొప్పదంటు ప్రశ్నలు వేస్తున్న మీకు—ఒకనాడు తన పిల్లడు ఛస్తాడో, బతుకుతాడో అని విలవిల్లాడుతూన్న ఈ అమాయకురాలి యోగక్షేమం తెలుసు కోవాలన్న జ్ఞానం ఎందుకు లేకపోయింది· ఆవేళ మీరంతా ఏమయ్యారు· దిక్కు—మాలి ఉన్న వాళ్ళకి కనీసం అప్పుగానయినా సాయంజేద్దామన్న సద్బుద్ధి మీలో ఒక్క—డి కైనా కలగలేదే· ఈవాళ చిన్న విషయాని కింత రాద్ధాంతంచేసి, స్వప్రయోజనాల కోసం ఇంత నిప్పు పెడుతూన్న దౌర్భా గ్యుల నిజస్వరూపాలు తెలుసుకుందికి మీకు లేని ఆరాటం దాక్టరుగా, స్నేహితు డిగా ‹కర్తవ్యాన్ని నిర్వర్తించుకున్న నా విషయంలో ఎందుకొచ్చింది. లేదు. లేదు. ఇది మీ అందరికీ పుట్టిన బుద్ధికాదు— ఒకరు పచ్చగా ఉంటే చూడలేక, కళ్ళల్లో నిప్పులు పోసుకునే ఏ పశువో చెప్పిన మాటలు నమ్మి, గుడ్డెద్దు చేలో పడ్డట్టు వ్యవహరిస్తున్నారంతే."

ఆ మాటలు జనంమీద ఎటువంటి ప్రభావం తేకముందే విరుచుకుపడి ముందుకొచ్చాడు· రంగనాథం. అతని లోపలి భయాల్ని అదిమిపెట్టుకుని, శివ మెత్తినట్లుగా మెట్లెక్కి— నిల్చున్నాడు.

"విన్నారర్రా విన్నారా? నువ్వెందుకు తప్పుచేసావని మనం అడుగుతూంటే మనందరికీ తప్పులంటగడుతున్నాడీ కుర్ర డాక్టరు. ఎక్క—డ్నుంచో ఊడిపడొచ్చి మన పాలెం, పాలెం అంతటినీ దుయ్య బడుతున్నాడీ కుర్రనాగమ్మ. ఇంకాసేపా గితే ఇంకెన్నెన్ని కబుర్లేనా చెప్పి మనంద రినీ మాయ చెయ్యగలడు మనలో మనకి అన్నదమ్ముల్లాంటి వాళ్ళమధ్య తగువులు కూడా పెట్టగలడు కళ్ళు మూసి, జెల్ల కొట్టి తన దారిని తను పోగలడు—నా ఒక్క—డికీ ఏం నష్టంలేదు నేను మీ సేవ కుడ్ని మాత్రమే. మనూరి మంచిచెడ్డలు కాపాడ్డం పెద్దల విధి. వాళ్ళేలా చెప్తే నేనలాగే చేస్తాను" అన్నాడు చివరన 'పెద్దల' ఊసెత్తుతూన్నప్పుడు వినమ్రంగా తలవంచుకుని.

పెద్దలనేసరికి పొంగిపోయి ముసిలి శివారెడ్డి ముందుకొచ్చాడు "నువ్వు చెప్పిందే నిజం రంగనాథం ఈ యవ్వారం నువ్వే పైసలా చెయ్యి!" అన్నాడు వణుకుతూ. రంగనాథానికి రెట్టింపు బలం వచ్చింది.

"నీ అంతట నువ్వు ఒప్పుకోకపోతే, గౌరికీ, నీకూ అక్రమసంబంధం ఉందని నిర్ణయించవలసొస్తుంది." 'సక్రమసంబం



ఈ కాలం పిల్లలెలా ఉంటున్నారోగాని ఆ కాలానికీ ఈ కాలానికీ శృంగార నృత్యాల స్పెషలిస్టు జ్యోతిలక్ష్మి ప్రేక్షకుల హృదయాల స్పందన పెంచుతూనే ఉంది. ఆంధ్రదేశాన ప్రదర్శించబడుతున్న అనంతలక్ష్మి వారి 'ఈ కాలం పిల్లలు'లో ఇలా కన్పిస్తుంది జ్యోతిలక్ష్మి.

ధమేనని నిరూపించుకో మురళీబాబూ' అన్నట్టు చూస్తూంది మంగళ.

మురళీబాబు అచేతనంగా నిలబడ్డాడు.

"అంటే? ఒప్పుకున్నాడన్న మాటేగా?" అంటున్నాడు కోటయ్య.

"సిగ్గు, సెరమూ లేక చెడిపోయిన వాళ్ళు మన పాలెంలో ఉండకూడదు. మనూరికది మచ్చ." శివారెడ్డి తన పెద్దరికాన్ని వినియోగించుకుంటున్నాడు.

"పద గౌరీ! ఈ పాపిష్టి ఊళ్ళో ఒక్క క్షణమున్నా పాపమే! పద. వీళ్ళకి హృదయంలేదు. బాధపడకు గౌరీ!" అంటూ ఊరడించబోయాడు మురళీబాబు. గౌరి చెంగుతో ముఖం కప్పుకుని, గుడి స్తంభానికానుకుని వెక్కి వెక్కి ఏడుస్తూంది.

"నువ్వు కదలవయ్యా ముందిక్కడ్నుంచి. ఆ పిల్ల సంగతి మేం జూసుకుంటాం?" దమాయింపుగా అన్నాడు రంగనాథం, గౌరి కూడా ఎక్కడ చెయి జారిపోతుందోనన్న బెంగతో.

"నేను ఒక్కడినీ వెళ్ళను. వెళ్తే గౌరిని తీసుకునే వెళ్తాను." మురళీబాబు ఇలా అన్నాడో లేదో. గాలిలోకి లేచింది



కోటయ్య చేతిలో కర్ర.

మెరుపులా వచ్చి అడ్డుకుంది మంగళ. "ఆగు కోటయ్యా! కొట్టేమన్న అప్రతిష్ట మాత్రం మన పాలెం వాళ్ళకెందుకు మిగలాలి? అక్రమ సంబంధాలో, సక్రమ సంబంధాలో సరిగా తేలన్దీ మనం ఎందుకు తొందరపడాలి? నేం తేలుస్తనుండదేమిటో," అంటూ సింహప్పిల్లలా ముందుకొచ్చి నిలబడింది మంగళ. 'మంగమ్మ చాకులాంటి పిల్ల మరి.' అనుకుంటున్నారు కొందరు. కొందరు విచిత్రంగా చూస్తున్నారు రంగనాధం మతి చెడ్డట్టు చూస్తున్నాడు. గౌరి. మురళిబాబు కూడా మంగళలోని కొత్త రూపాన్ని తెల్లబోయి చూస్తున్నారు.

"మురళిబాబూ! గౌరిని నీతో తీసుకెళ్ళడానికి నీకు గౌరిమీదున్న హక్కేమిటో చెప్పు ముందు!"

"హక్కు— హక్కు— మంగళా! ఈ మాట నువ్వే అడుగుతున్నావా?" అతి ప్రయత్నంమీద అడిగాడు మురళి.

"ఆహా—నేనే. సాక్షాత్తు సర్వమంగళాదేవినే అడుగుతున్నాను. నేనూ ఈ పాలెంలో పుట్టినదాన్నే. పాలెం ప్రజలందరి తరపునా అడుగుతున్నాను. చెప్పు. చెప్పకుండా నువ్విక్కడినుంచి అడుగు కదపలేవు." మంగళ మాటలకు అందరూ తలలూపుతూంటే అంతా అయోమయంగా ఉంది రంగనాధానికి.

"హక్కు— నాకు గౌరీ మీద హక్కు—" మాటలకోసం తడుముకుంటున్నాడు మురళిబాబు.

"ఏమాత్రం లేదు. అవునా?"

నిస్తేజంగా చూస్తున్నాడు మురళిబాబు.

"మురళిబాబూ! ఇది నీకు రెండోసారి వచ్చిన అవకాశం. మొదటిసారి నీ చేజేతులా జారవిడుచుకున్నావు. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. ఇదుగో - ఇంతమంది మనుషులు నీ ఎదురుగా ఉన్నారీవాళ. 'గౌరి నా సొత్తు' అని చెప్పి అందరిముందు చెయ్యి పట్టుకు తీసుకుపో చూద్దాం! అదే నీకున్న హక్కని మేమంతా ఒప్పుకుంటాం."

ఆ మాటల వెనుక గాధ ఎవరికీ ఏమీ అర్థం కాకపోయినా మంగళ అడుగుతూన్న తీరు ఒప్పుదలగానే వుందందరికీ.


"మంగళా!" పూడుకుపోతున్న కంఠంతో కేకవేసింది గౌరి. మంగళ ఆమెను వినిపించుకోనేలేదు.

"లేదంటే - మా పాలెం వాళ్ళన్న 'అక్రమ సంబంధం' అన్న మాట ఋజువయితీరుతుంది. చెప్పు. ఎలా జరిగితే ఇష్టం నీకు!"

"ఏమైనా మంగమ్మ బలే అసాధ్యురాలు. దెబ్బతో అయ్యగారి పస బయట పడిపోతాది. ఇది పెల్లాడే ముకవేనేంటి?" ఒక్కొక్కళ్ళొక్కొక్క మాట అంటున్నారు.

మురళిబాబు చెమటతో తడిసి ముద్దయ్యాడు.

ప్రతి లిప్తనీ అతి ఆత్రంగా కనిపెడుతోంది మంగళ. అతని ముఖంలో సంఘర్షణ చూడడానికే శక్యం కాకుండా ఉంది.



అంతా ఒక్కసారి నిశ్శబ్దమయి పోయింది. మురళిబాబు గౌరికేసి సూటిగా చూశాడు. గౌరి వెక్కి వెక్కి ఏడుస్తూంది. ఆ రోదన తప్ప ఇంకే శబ్దం వినిపించడం లేదక్కడ.

"నేను గౌరిని పెళ్ళి చేసుకుంటున్నాను!" ఒక్కొక్క అక్షరం బలంగా నొక్కి నొక్కి పలికాడు మురళిబాబు.

"మురళీ!" అంటూ స్తంభానికి తల కొట్టుకుంది గౌరి అంతా తెల్లబోయారు. మంగళ చెవుల్లో సన్నాయి మోత వినిపిస్తూంది.

మురళిబాబు ఒక్కసారి కళ్ళు మూసుకుని తెరిచాడు. అతి నిర్మలంగా ఉందతని దృష్టి "అవును నేను గౌరిని పెళ్ళి చేసుకుంటున్నాను, అంతేకాదు ఏ బొట్టుకోసం ఇంత రభస జరిగిందో, ఆ బొట్టు గౌరి నుదుట నుంచి మరీ తీసుకు వెళ్ళగలను" అన్నాడు

"చెప్పడం కాదు, చేసి చూపించు" అంటూ ఛంగున లేడి పిల్లలా గర్భగుడి ముందుకి పోయి, అమ్మవారి సిందూరం ఉన్న పళ్లెం పట్టుకుని ఎదురొచ్చింది మంగళ.


గౌరి భయంగా చూస్తూంది. మురళి రెండు వేళ్లతో చిటికెడు సిందూరం తీసి అమ్మవారి విగ్రహం కేసి తిరిగి క్షణం కళ్లు మూసుకు ధ్యానించి, చట్టున వెను తిరిగి నిస్తేజంగా చూస్తున్న గౌరి నుదుట నుంచాడు.

"మురళీ ఏమిటీ సాహసం?" గౌరి కళ్లంట జలజల నీళ్లు కారిపోతున్నాయి.

"సాహసం కాదు గౌరీ ఇది నా కర్తవ్యం. ఈ క్షణం నుంచి నువ్వు నా భార్యవి. ఇదే మన పెళ్ళి. పవిత్రమైన ఈ దేవాలయం ముందు గుమిగూడిన జనమే ఇందుకు సాక్ష్యం. ఏదో లోకంలో ఉన్నట్టుగా చెప్తున్నాడు మురళిబాబు.

మంగళ ఆనందం వర్ణనాతీతంగా ఉంది. ఆ ఆనందాన్ని ఏ విధంగానూ బయటకు వ్యక్త్యం చేయలేక గొంతుక్కదే అడ్డు పడినట్టు గింజుకుంది.

"పోన్లే—అది మాత్రం వింత కాదు- ఇంత మంది జనం ముందు అమ్మోరిగుళ్లో ఒప్పుకున్నాడు కదా।" శివారెడ్డికి రంగనాధం లాంటి కుయుక్తులు లేవు మరి. అందుకే ఆమాటన గలిగాడు. శివారెడ్డి మాట అక్కడి వారందరికీ సమంజసంగానే తోచింది. జనమంతా ఈ వింత కబురు పట్టుకుని ఎవరి మానానా వాళ్లు



పోయారు.

విధిలేక రంగనాధం కూడా కదిలా డక్కడినుండి, 'అమ్మామ్మా! ఎంత జాణ ఇది!' అని మంగళను తలచుకుని గుండె బాదుకుంటూ.

13

ఇల్లు చేరుతూనే కుప్పకూలిపోయిన గౌరిని "గౌరీ!" అని పిలిచాడు మురళి బాబు, అనునయంగా

"ఏం మురళీ! వాళ్ళందరు చేసిన అవ మానం సరిపోలేదనా నువ్వాపనిచేసింది!" చివ్వున వెనుతిరిగి,కన్నీళ్ళమధ్యవెక్కుతూ నిష్ఠూరంగా అడిగింది గౌరి

"మురళిబాబు తప్పేంలేదు గౌరీ!" అంటూ అడ్డొచ్చింది మంగళ.

"అవున్లే! ఆ సలహా ఇచ్చింది నువ్వేగా అసలు. ఇలాగకాక ఇంకెలా అంటావు మరి! ఇప్పటికే సగం చచ్చి బతుకుతూన్న నన్ను ఎలా తలెత్తుకు తిరగ మని చేశారు మంగళా! రేపు రాజువచ్చి 'వదినా!' అంటే ఏ ముఖం పెట్టుకుని అతని ముందుకి వెళ్ళమన్నావు!" ఆవేశంగా అంటూంది గౌరి.

"చదువు సంధ్యలు లేని నాలాంటి మొద్దుకే అర్ధమైనవిషయం రాజుకి-చదువు కుని, నాగరికంగా పట్నంలో మెసలిన వాడికి-అర్ధం కాకపోతుందా గౌరీ! నువ్వు నవసరంగా దేనికీ భయపడకు. ఇందులో నీ తప్పేమీ లేదు. నువ్వు ముఖం చాటు చేసుకు తిరగవలసిన పని అంతకంటే కాదు. మురళిబాబు తప్పూలేదు. నిన్నవ మానించబోయిన వాళ్ళకి చెంపపెట్టుగా జవాబిచ్చేడు. అయితే సలహానిచ్చిన నాది తప్పంటావు నువ్వు. కాని నా తప్పు అంత కంటే లేదు. ఆ సలహా ఇచ్చినది నేను కాదు. ఇంత అన్యాయాన్ని చూసి సహించ లేక, సాక్షాత్తు సర్వమంగళాదేవి ఇచ్చిన సలహాయే అది నాకు దిక్కుతోడని సమ యంలో 'సర్వభారాలూ నీవేన'ని ఆవిడ కప్పగించేశాను నేను నేను నిమిత్త మాత్రురాలిని. ఆవిడే నన్నా వహించి అలా పలికి ఉంటుంది ఇది ఆ తల్లి సంకల్పమే కాని, నేనెంత మాత్రం కారణం కాను గౌరీ!" అని మంగళ చెప్తూంటే నిశ్చేష్టురాలై వింటూ నిల్చుండి పోయింది గౌరి.

"అవును గౌరీ! ఇది దైవసంకల్పమే! రూపం లేని నా భావాలకు, సర్వమంగళా దేవే, ఈ మంగళరూపంలో వచ్చి, రూప మిచ్చి, ప్రాణంపోసింది నన్నొక 'నవశక్తి' ఆవరించింది ఒకనాడు, నాలో పేరుకు పోయిన జంకు, భయాన్ని దూరంచేసి, నాకు కర్తవ్యాన్ని బోధించింది. ఇది దైవ ప్రేరణే గౌరీ! ఎలాంటి సందేహాలూ, చింతలూ పెట్టుకోకుండా నిశ్చలంగా ఉండ డానికి ప్రయత్నించు" మురళిబాబు ముఖం ఎంత ప్రశాంతంగా ఉందో కంఠంకూడా అంత నిశ్చలంగా, నిర్మలంగా ఉంది

ఇంకా ఉంది

"కాని నేను నేను నీకు తగను మురళీ నేను నువ్వొకనాడు మన స్ఫూర్తిగా కోరుకున్న కన్నెపిల్ల గౌరిని కాను నేను విధవరాలిని."

"గౌరీ!" బిగ్గరగా అరిచాడు మురళి. "నేను బ్రతికే ఉన్నాను!"

గౌరి ముఖం పాలిపోయింది. ఘోరాపరాధమైన మాటాడేవన్నట్లుంది అతని మందలింపు స్వరం. తప్పుచేసినట్లుగా తల వంచుకుంది.

అతని హృదయాన్ని గాయపరచే మాటాడినందుకు తన పశ్చాత్తాపాన్ని ఎలా వ్యక్తం చేయాలో తెలియడం లేదు.

నోట్లో వేలు పెట్టుకుని, బితుకుగా, అమాయకంగా ఓమూల నిల్చున్న కన్నకేసి దృష్టి తిప్పింది ఆమె కళ్ళంట మళ్ళీ చివ్వున నీరు చిమ్మింది. మురళిబాబు ఒక్క ఉదుటన వెళ్ళి వాడిని ఎత్తి ఎగరేసి పట్టుకున్నాడు. తన భయాలూ, అనుమానాలూ అతను చదివేసాడని అతనిచూపుతో అర్థమైంది గౌరికి 'కన్నీరు రానివ్వకూడద'న్నట్లు తల అడ్డుగా తిప్పేడు మురళిబాబు.

"నువ్వు ఆశవదులుకున్న వీడిని, నేను బ్రతికించుకున్నాను గౌరీ! వీడు నావాడు! చిన్నప్పుడు నీకు కథలు చెప్పేవాడిని జ్ఞాపకముందా? రాజకుమారుడ్ని ప్రాణాపాయం నుండి కాపాడిన మునీశ్వరుడిని 'ఏం కావాలో కోరుకోండి స్వామీ!' అని రాజుగారడిగితే. రాకుమారుడినే నాకు కానుకగా ఇమ్మని కోరుకుంటాడు. మరి డాక్టరుగా నేను వీడికి వైద్యం చేసినందుకు 'నీకేమి ఫీజు ఇవ్వగలను?' అని పది మార్లన్నావు. గుర్తుందా? నేను వీడినే ఫీజు క్రిందతీసుకుంటున్నాను!"




అంటూ అంత గంభీరమైన వాతావరణాన్ని ఒక్కసారి తేలికగా చేసేశాడు మురళిబాబు. గౌరి నోట మాటరాలేదు. కాని, ఆమె చూపులలోని కృతజ్ఞతాభావం మురళిబాబుకీ, మంగళకీ కూడా ఆనందం కలిగించింది.

మురళిబాబు బాహ్యసౌందర్యానికి మించిన మనఃసౌందర్యంతో చందమామలా వెలిగిపోతూంటే, తన మెచ్చికోలును అందంగా తెలియజేసే భాషైనా రాని పల్లెటూరి మొద్దునికదా! అని తిట్టుకుంటూనే అతన్ని కళ్ళింతింత చేసుకుని చూసింది మంగళ

తూర్పున అప్పుడప్పుడే తెల్లవారబోతూంది. తొలి రోజు మురళిబాబు వక్కడితో వచ్చిన పడవలాంటి కారు, ఇప్పుడు ముగ్గురితో బయలుదేరటానికి సిద్ధంగా ఉంది

"మురళిబాబూ! మాగౌరి అభం, శుభం తెలియని అమాయకురాలు. నాలాంటి మొండిఘటం, తోడుండబట్టి ఇన్నాళ్ళూ ఈ పల్లెలో ఎలాగో రోజులు వెళ్ళబుచ్చిందిగానీ, వంటిగా వదిలేస్తే ఈ వెధవ ప్రపంచాన్ని ఎదురించి ఒక్కమాట కూడా మాట్లాడలేని పిచ్చిపిల్ల! ఇక నువ్వెంత పదిలంగా, ఎంత అపురూపంగా చూసుకుంటావో.నీ చేతికో పెడుతున్నాను. ఇది నాకు మా రామం బావ అప్పగించిన బాధ్యత. నా బాధ్యత నేను సక్రమంగా నెరవేర్చుతున్నాననే సంతృప్తి నాకుంది. ఇక



హీరో కృష్ణంరాజు, రంగుల్లో నిర్మించిన 'భక్త కన్నప్ప' బాపు - దర్శకత్వంలో అత్యంతాకర్షణీయంగా రూపొందించబడింది. ఆ చిత్రంలోని కీలకమైన ఓ సన్నివేశానికి రూపకల్పన చేస్తున్న కృష్ణంరాజు, రావు గోపాలరావు యీ చిత్రంలో ఉన్నారు.


నీ బాధ్యత...." అంటూంటే మంగళ కంఠం పూడుకుపోయింది.


గౌరి పసిపిల్లలా మంగళను చుట్టేసుకుంది. ఒకప్రక్క వియోగంతో, ఒక ప్రక్క ఆనందంతో ధారలు కడుతూన్న కన్నీరు మంగళ భుజాల నభిషేకిస్తూంది. అతి పదిలంగా, ఆప్యాయతగా తనను మురళిబాబు చేతిలో అప్పగింతలు పెడుతూన్న మంగళలో తల్లి, తండ్రి, సహోదరులు,ఆత్మీయవర్గంమంతా గోచరిస్తూంటే, అప్రయత్నంగా రెండు చేతులూ జోడించింది గౌరి.

"గౌరీ!" ప్రేమగా వారించి కౌగలించుకుంది మంగళ.

"నేను.... నేను.... నీలోని.... సర్వమంగళాదేవికి నమస్కరిస్తున్నాను. మంగళా" అంది గౌరి ఆపేక్షగా.

"అవునమ్మా! నువ్వు సార్థక నామధేయురాలివి. నిన్ను కన్నవాళ్ళు చాలా అదృష్టవంతులు. నీలాంటి వాళ్ళు నూటికొకరున్నా చాలు. పనికిమాలిన డిగ్రీలు కాదమ్మా 'విద్య' అంటే. నువ్వు చదువుకోకపోతేనేం,పట్నాల్లో మెలగకపోతేనేం చదువు సంస్కారాలు నేను నీలో చూడ





గలుగుతున్నాను. నువ్వప్పగించిన బాధ్యతను, నువ్విచ్చిన విలువైన కానుకను ప్రాణపదంగా, కంటికి రెప్పలా చూసుకుంటాను. కాని నిన్ను వంటరిగా వదలివెళ్ళడానికి మా కాళ్లాడటంలేదు. నువ్వు పట్టిన పట్టు విడవటంలేదు. ఇది నాకు చాలా బాధగా ఉందమ్మా!" అన్నాడు మురళీబాబు.

"నేనెప్పుడూ వంటరిదాన్నే మురళీ బాబూ! కాని, అందరూ నా వాళ్ళే! నువ్వేం బాధపడకు బాబూ. ఈ జనాల మధ్య పుట్టి పెరిగినదాన్నే నేను. నాకు భయాలంటూ ఏవైనా ఉంటే, అవన్నీ ఇప్పుడు తీరిపోయాయి. నేను చాలా తేలికగా ఆనందంగా ఉన్నానిప్పుడు-ఇక ఎడబాటా? అది తప్పనిసరి. మీమాట కాదన్నానని ఏమీ అనుకోకండి మారాజు వస్తాడు. అతనికోసం. నేనుండాలి - నేను కూడా కనిపించకపోతే రాజు వట్టి పిచ్చివాడైపోతాడు" మొదటిసారిగా మురళీబాబు ముందు రాజు గురించి తనకు తాను చెప్పుకుంటూన్నందుకు సిగ్గుతో జేవురించింది, మంగళ ముఖం.

కన్న నిద్రలో ఉన్నాడు. లేకుంటే వాడిని పట్టడమే కష్టం.

గౌరి, మురళీ బాబు కార్లో కూచున్నారు.మంగళ హృదయానికి కొక్కెం తగిల్చి, ఎవరో గట్టిగా లాక్కుపోతునట్లు విలవిల్లాడుతూనే గౌరి చేతిని గట్టిగా తన చేతితో అదిమి పట్టింది. గౌరి కళ్లు తడితో మెరుస్తున్నాయి. రామం బావ రామంతో గౌరి పెళ్ళి, అతని చావు ఆమె వైధవ్యం అవన్నీ ఏవో కలలో చూసిన దృశ్యాల్లో అన్పిస్తున్నాయి.

'కల—అంత ఒక కల! అంతే గౌరీ-ఆ కలలో ఇదొక భాగం!' నుదుట కుంకుమతో నూరు వెలుగులు సంతరించుకున్న గౌరి ముఖమండలాన్ని కన్నార్పకుండా చూస్తూ వేదాంతిలా నవ్వుతూ అంది మంగళ.

బాల సూర్యుని బంగారు కిరణాలు రత్న దీపాల్లా వెలుగులు విరజిమ్ముతున్నాయి. కారు కదిలిపోయింది.

ఎరుపురంగు కాస్తా, తెల్లగా మారి, ఎండ రూపు దాల్చింది. అలా ఎంత సేపటినుంచో కదల కుండా నిల్చునే ఉన్న మంగళ బుగ్గల మీద చేయివేసి చూసుకుంది-తడిగా తగిలింది. దూరాన సర్వమంగళా దేవి ఆలయ గోపురం, ధ్వజస్తంభపు చిరు గంటలూ కన్పిస్తున్నాయి. రామం ఆత్మ చాలా సంతోషిస్తూనట్టని



పించింది నవ్వుకుంటూ ఓణీ చెంగుతో కన్నీరు తుడిచేసుకుని "జై మంగళా" అంటూ కాలి మువ్వల పట్టీలు ఘల్లు ఘల్లుమనిపించుకుంటూ, సంధించి వదలి పెట్టిన బాణంలా పరుగు తీసింది సర్వ మంగళా దేవి గుడికేసి

* * *

రాజు తనలోకంలో తానున్నాడు అన్నీ అతనికి మరుపు రావటంలేదు. అశాంతి అంతకంటే వదలటం లేదు. ఒంట్లో ఓపిక, చేతిలో డబ్బు ఉన్నంత వరకూ ఎక్కడెక్కడో తిరిగాడు గుళ్లూ, గోపురాలూ అతనికి ప్రశాంతిని ప్రసాదించలేక పోయాయి. చివరికి అన్నిటిపైనా అతనికి విరక్తి భావనకూడా కలిగింది.

అలాంటి తరుణంలో స్నేహితుడెవరో కనుపించి ఓ వార్త చెప్పేడు ఎక్కడో మారుమూల పల్లెలో ఆశ్రమం స్థాపించుకుని ఒక స్వాములవారున్నారట ఆయన గురించి ప్రజల్లో చాలా భక్తి శ్రద్ధలున్నాయి. నీ అశాంతి పోయే మార్గమదొక్కటే అన్నాడతను. వినడమే తడవుగా ప్రయాణమయ్యాడు రాజు.

అదొక కుగ్రామం. అయినా ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి జనం తండోపతండాలుగా వచ్చి వెళ్తూనే ఉన్నారు. బవిరి గడ్డంతో, దుమ్ముకొట్టుకున్న బట్టలతో ఆ ఆశ్రమంలో అడుగు పెట్టేడు రాజు .

స్వామివారు కనిపించారు.వచ్చినవారందరినీ దీవించి వెళ్ళిపోయారు. ఆ చూపులో ఏదో శక్తి గోచరించింది రాజుకు. ఆయన తన ముఖంలోకి చూస్తున్నంత సేపూ తనను తానే మరచిపోయాడు. ఆయన ఆ ప్రాంగణం దాటి లోనికి వెళ్ళిపోగానే పెన్నిధి దూరమైపోయినట్టు విలవిల్లాడిందతని హృదయం. మొదటి చూపులోనే ఆయన మీద ఎనలేని నమ్మకం కుదిరింది తన నావరించిన జాడ్యాన్ని వదల్చడానికి ఆయనకి తప్ప లోకంలో ఇంకెవరికీ శక్తి లేదనిపించింది. మాట్లాడే అవకాశం ఎప్పటికి వస్తుందా, తన గోడంతా చెప్పుకుని ఆయన నుండి ఊరట పొందుతానా, అని తహతహ లాడసాగేడు

ఒకటి-రెండు-మూడు రోజులు గడిచి పోయాయి. ఆయన తనకేసి చూడటం, నవ్వటమేగాని ఒక్కసారైనా పెదవి కదపలేదు. తనకు మాట్లాడే అవకాశమివ్వలేదు.

వారం రోజు లయింది. ఈ వారం రోజుల్లోనూ తనలో చాలా మార్పు వచ్చినట్లనిపించింది రాజుకి. ఆ రోజు ఆదివారం. ఆ ఒక్కరోజే స్వామి ఎవరితోనైనా మాట్లాడతారని తెలిసింది. ఉదయంనుంచి ఆయన కుటీరం ముందే తిష్టవేసు కూర్చున్నాడు రాజు.

ఎనిమిది గంటల వేళప్పు డాయన బయట కొచ్చారు. "ఏమిటి నాయనా నీ

బాధ?" అని ప్రశ్నిస్తూ ప్రక్కనే ఉన్న రావిచెట్టు తిన్నెమీద కూర్చున్నారు. రాజుకి అలా అడగ్గానే ముందు కళ్ళంట గిర్రున నీరు తిరిగింది. క్రమంగా తన వేదనంతా వెళ్ళబుచ్చాడు. స్వామి ముఖం అన్నీ విన్న తర్వాత కూడా చిరునవ్వు లొలుకుతూనే ఉంది.

"నాకు శాంతి కావాలి స్వామీ! అది ఎక్కడ లభిస్తుంది? ఎలా లభిస్తుందో చెప్పండి" అన్నాడు చివరన రెండు కాళ్ళూ పట్టుకుని.

"అంటే ఇంత వరకూ నువ్వు తిరిగిన ప్రదేశాల్లో ఎక్కడా లభించలేదన్నమాట!" నవ్వేరాయన.

"లేదు స్వామీ!"

"పిచ్చివాడా! కొండ తలకింద పెట్టుకుని నీలాంటి వాళ్ళే రాళ్ళ కోసం వెతుక్కుంటూంటారు. అది వెతికితే దొరికేవస్తువు కాదు నాయనా! అది వెలుగు - నీలో నుండే బయలుదేరాలి. నువ్వొక గదిలో కూచుని చదువుకుంటూన్నప్పుడు హఠాత్తుగా కరెంటు పోయిందనుకో. నువ్వు చాలా చికాకు పడతావు. ఎంతట వెలుగు వస్తుందానని ఎదురు చూస్తావు - చీకటిని చీదరించుకుంటావు. అలాంటప్పుడు 'చీకటి నువ్వు ముందిక్కడి నుంచి పోతావా? పోవా? అని భయపెట్టి అరిస్తే చీకటిపోతుందా? ఏడిస్తేపోతుందా?' 'చీకటీ! నన్ను దయతలచి వెళ్ళమ్మా' అని ప్రార్థిస్తే పోతుందా వెర్రెత్తినట్లు ఇంటి చుట్టూ పరుగెత్తితే పోతుందా? కాదు కదా! వెంటనే అగ్గిపెట్టి వెతికి వెలిగించి దానితో ఒక నూనె దీపాన్నో, కొవ్వొత్తినో వెలిగించుకున్నావంటే మటుమాయమైపోతుంది చీకటి. ఆ చీకటే అశాంతి. ఆ వెలుగే ప్రశాంతి. దానికి నీ ప్రయత్నం కావాలి."



"నేనేం చెయ్యాలి స్వామీ?"

"ఏం చెయ్యాలా? నీ స్వాభావికతను గుర్తించాలి. నేను ఆనంద స్వరూపుడినని అనుక్షణం గుర్తు చేసుకుంటూ ఉండాలి. దుఃఖం ఆగంతుకం, సంతోషం నిత్యం. రోజూ నువ్వు తినే తెల్లని అన్నం ఒక రోజు ఏ కారణం చేతనయినా బాగా మాడిపోయిందనుకో వెంటనే ఏం చేస్తావు నువ్వు? తీసుకెళ్ళి గోతిలోపోసి మళ్ళీ చక్కగా వండుకు తింటావు. ఎంచేత? అది అన్నానికి ఉండవలసిన రూపు కాదు — వాసన కాదు, రుచికాదు. అస్వాభావిక మన్న మాట. ఇదీ అంతే నాయనా! నిత్యము, సత్యము అయిన ఆనందమనే తెల్లని పదార్థానికిపట్టిన మకిలే ఈ దుఃఖం. అది అస్వాభావికమని తెలిసికొని దాన్ని వదలగొట్టుకోవటమే విజ్ఞత." స్వామి ముఖంలో ప్రశాంతత శీతల కిరణాలు వెదజల్లుతూంది.

"అదే నాకు తెలియడంలేదు స్వామీ! దానిని నేనెలా వదిలించుకోగలను?"

"మరొకరికి ఆనందాన్ని, సంతృప్తిని కలిగించే ఒక చిన్న పనైనా నువ్వు చెయ్యగలిగితే దానంతటదే అంతర్ధాన మవుతుంది బాబూ!"

"నేనీస్థితిలో ఏం చెయ్యగలను? ఎవరికేమి సంతోషాన్ని కలిగించగలను?"

గద్గదికంగా తనలో తను గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు రాజు.

"నే చెప్తాను నాయనా! చూడు నీ నోటితో నువ్వే చెప్పేవు. ఇల్లు వదిలి ఎన్నో నెలలయిందని. ఇన్నాళ్లుగా నీవాళ్లు నీ కోసం ఎదురు చూస్తూంటారే! నువ్వేమయిపోయావో, ఎలా ఉన్నావోనని బెంగ పడుతూ, ఆత్రంగా కాచుకుని ఉంటారే! వాళ్ళ ఆరాటాన్ని ఆవేదనని అంతం చెయ్యగల శక్తి నీకుందికదా. తక్షణమే బయలుదేరి నీ ఇంటికి చేరుకో బాబూ— నీ వాళ్ళంతా నిన్ను చూసి ఆనందిస్తారు. అప్పుడు నీ మనోదర్పణం కూడా ఆనందాన్నే ప్రతిబింబిస్తుంది. నీ అశాంతి తీరుతుంది. వెళ్ళిరా నాయనా!" అంటూ స్వామి వెనుతిరిగి చూడకుండా పూల తోటకేసి వెళ్ళిపోయారు.

రాజు వంటరిగా మిగిలిపోయాడు. ఒక్కసారి నీరస మావరించిందతనిని— ఆయన చెప్పిన మాటలు వింటూన్నంత సేపూ మబ్బులు విడిపోయినట్లయి ఆహ్లాదంగా ఉన్నా, తిరిగి తలచుకుంటూన్న కొద్దీ నిస్పృహ కలిగిందతనికి.

ఆ రాత్రి ఆరుబయట పడుకొని నీలాకాశంలో చుక్కల్నీ చందమామనీ చూస్తూ ఆలోచించడం ప్రారంభించాడు తను ఇల్లు కదలిన నాటి నుండి అంతా నెమరు వేసుకున్నాడు. దగ్గరున్న డబ్బయిపోయి, ఏం చెయ్యాలని దిక్కుతోచక అవస్థ పడుతూన్న ఒక రోజున ఎందుకో పెట్టె పెల్లగిస్తూంటే మూడు వందల రూపాయల నోట్ల కట్ట బయట పడింది. అది దాన్లో ఎవరు పెట్టి ఉంటారు? మంగళా? వదినా? ఏమో, ఇద్దరికీ తన మీద అభిమానమే— ఒక్కొక్కరి దొక్కొక్క రకం అంతే. తను దారిలో ఏమి అవస్థపడతాడోనని ముందు నుంచే వాళ్ళు తన కోసం తాపత్రయ పడ్డారన్నమాట! మరి తనేం చేసాడు? అలాంటి వాళ్ళని వాళ్ళ కర్మానికి వదిలి, ఇంటికి ఓ ఉత్తరం ముక్కైనా రాయకుండా, దగ్గరున్నది ఖర్చుపెట్టుకుని తిరుగుతున్నాడు. ఎంత కృతఘ్నత! దుఃఖం తన ఒక్కడిదేనా? వాళ్ళకి లేదూ? వాళ్ళ కోసం తనేం చేసాడు? ఛీ—ఛీ— ఎంత తెలివి హీనపు పని! స్వామి చెప్పినది అక్షరాలా నిజం. వాళ్లు వచ్చిన కష్టం చాలక తన కోసం ఎంత కుమిలి పోతున్నారో. తన వలన మరికొన్ని జీవాలు దుఃఖపడుతూంటే తనకి మాత్రం శాంతి ఎలా లభిస్తుంది? వెంటనే వెళ్ళాలి. వాళ్లెలా ఉన్నారో చూడాలి—" ఇలాంటి నిశ్చయానికి వచ్చేక చాలా రోజుల తర్వాత రాజుకి ఒళ్లెరుగని నిద్రపట్టింది.

ఉదయాన తేలిక పడ్డ మనసుతో లేచి పెట్టెచేత పుచ్చుకుని చకచక నడక సాగించాడు.

14

మూడోనాడు సంజ దీపాల వేళకి ఒంటెద్దుబండి కట్టించుకుని రామాయపాలెంలో తన ఇంటి ముందు దిగి తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు రాజు. 'అరె' మన రాజుబాబొచ్చాడు' అనుకుంటూ ఇరుగు పొరుగూ నలుగురాడంగులు గుమిగూడి, చెవులు కొరుక్కుంటున్నారు దూరంగా.

వీధి గుమ్మానికి గొళ్ళెం తగిల్చిఉంది.

అది తీసుకుని లోపల ప్రవేశించాడు. అంతా ఏమయ్యారోనని ఆశ్చర్యంగా చూసాడు. ఎడంప్రక్క సపోటా చెట్టు పక్కనున్న పశువులు రాజుని గుర్తించినట్టు ఆనందంగా తల లూపుతూ, తోకలు విసురుతున్నాయి. లోగుమ్మానికి తగిల్చి ఉన్న తాళం కప్పని చూడగానే రకరకాల భయాలు ముసురుకుంటూండగా "రంగమ్మత్తా!" అంటూ పొరుగింట్లోకి కేక వేసాడు రాజు.

"మావాళ్ళంతా ఏరీ?" కంగారుగా అడిగాడు. వాళ్ళంతా నసుగుతూ, నసుగుతూ, ప్రస్తుతానికి మంగళ ఎదురుగా లేదనికాస్త ధైర్యం తెచ్చుకుంటూ "గౌరమ్మే-మరే-గౌరమ్మే" అనుకుంటూ ఏదో చెప్పేరు. రాజు ముఖంలో రక్తమంతా ఒక్కసారి లాగి పారేసినట్లు తెల్లబడిపోయింది

అంతకి కొంచెం సేపటి క్రిందటే మంగళ చౌదరిగారింటికి వెళ్ళింది. ఎక్కడున్నా, ఏం చేస్తున్నా గౌరి, కన్నగాడే జ్ఞాపకం వస్తారు ఆమెకు.

మూడు రోజుల క్రిందటే వసుమతి పట్నం నుంచొచ్చింది. ఆ ఊళ్ళో వాళ్ళందరిలోకీ బాగా చదువుకున్నదీ, తెలివైనదీ నాగరికతగలదీ వసుమతేనని మంగళకి గర్వం.

ఆ రోజు గుడిముందర జరిగిన గొడవంతా పూస గుచ్చినట్టు ఏకరువు పెడితే, వసుమతి ఎగిరి గంతేసి, గట్టిగా భుజం చరిచి "బ్రేవో మంగళా!" అంది. అంటే ఏమిటో తెలియక మంగళ వెర్రి ముఖం వేసింది.

"ఒసేయ్ మంగళా! ఏమైనా నువ్వు సాధ్యురాలివే! నీ ఖర్మకాలి ఈ పాలెంలో పుట్టేవుగాని పట్నంలోనే పెరిగి నాలుగు ముక్కలు నేర్చి ఉంటే ఖచ్చితంగా పైప్రిమ్మినిష్టరయిపోయేదానివే" అంటూ పట్టుకుని గుంజాయించేసింది, "నిజంగా గౌరి, ఆ మురళిబాబు ఎదురుగా ఉంటే కంగ్రాచులేట్ చెయ్యవలసిందే. అయినా ప్రస్తుతానికీ అభినందనలన్నీ నువ్వే అందుకుని నోరు తీపి చేసుకో!" అంటూ కబోర్డులోంచి కాడ్‌బరీస్ చాక్‌లెట్ తీసి మంగళ నోట్లో కుక్కింది.

ఏదెలా, ఎందుకు జరిగినా మంగళ అసాధ్యురాలన్న విషయాన్ని మటుకు కొట్టి పారేయలేక లోలోనే ఉబ్బిపోయాడు చౌదరి

'ఆదేమిటో పులిపిల్లే ఈ అడివిలో పడింది కాని!' అనుకుని, 'అవునుమరి-పులిపిల్ల అడివిలోనే కదా ఉండేది' అని కూడా అనుకొని మీసం మెలేసుకున్న సంగతి మంగళకిగాని, వసుమతికిగాని, ఊళ్ళో ఏ పిట్ట మనిషికి కానీ తెలియదు.

"మా గొప్ప ఘనకార్యం చేసాననుకుని మురిసిపోతున్నావేమోనని ఇప్పటికిలా విధిలేక సద్దుమణిగినట్టున్నా, రంగనాథం నీ మీదో కన్ను వేసి ఉంచుతాడన్న సంగతి మరచిపోకు!" అని గట్టిగా కసిరి మాత్రం పంపించేశాడు, తరువాత మంగళ కలిసినప్పుడు

'ఏడిశాడు!' అని మనసులో పెంకెగా అనుకుంటున్నా, పైకి వట్టి భయస్తురాలిలా ముఖం పెట్టి, అలాగే అన్నట్టు తలాడించి తప్పుకుంది మంగళ.

(సశేషం)

పృథక్కృక్పథాలు

—శ్రీ తిలక్

ఆకాశం లోని చుక్కలు
ప్రేయసి నల్లని వాల్జడ లోని మల్లెల్లా
కనిపించాయట ఒక కవికి—
అవే చుక్కలను చూస్తుంటే
సిఫిలిస్ మచ్చలు గుర్తొచ్చాయట మరో కవికి—

పశ్చిమాద్రిలో అస్తమిస్తున్న సూర్యుడు
నిశీథి ప్రేయసి కౌగిలిలో కరగిపోతున్న
అరుణారుణ రంజిత వదనుడయిన ప్రియునిలా
దర్శన మయ్యాడట ఒక కవికి —
పడమర దిక్కులోని అదే సూర్యబింబం
రొమ్ము చీల్చుకొని బయటకు వచ్చి
నెత్తురు మడువుల్లో నానుతున్న
దౌర్భాగ్యుని గుండె కాయలా
కనిపించిందట మరో కవికి—


సముద్రుని ఘోష సన్నని సంగీతంలా
పసందయిన ప్రియురాలు చెప్తున్న
స్వీట్ నథింగ్స్‌లా
శ్రవణానందకరంగా వినిపించిందట ఒక కవికి—
అదే ఘోష కడుపులోని బడబానిలాన్ని దాచుకోలేక
సాగరుడు పెడుతున్న భయంకరమయిన ఆక్రందనల్లా
వినిపించాయట మరో కవికి—


నిరుపహతి స్థలంబు
రమణీ ప్రియదూతిక నిచ్చు కప్పురంబు
వగైరా వగైరా మాత్రమే
కావ్యోద్దీపకాలని భావించాడట ఒక కవి—
ఆకలి అరుపుల్లోనుండి
అసహాయ ఆక్రందనల్లో నుండి
వెలువడేదే అసలయిన కవిత్వం
అన్నాడు మరో కవి—

★

పురాణ హాస్యవృక్షం!







ముసుగు మనిషి

పాలకోడేటి సత్యనారాయణ రావు

చలపతి కథలు రాస్తుంటాడు. అందరి లాగా అతను ప్రేమకథలు రాయడు; ఓ అబ్బాయి మరో అమ్మాయి అతని కథల్లో ఎపుడూ కలుసుకోరు. డబ్బుండే హీరో తన నల్ల కళ్ళజోడులోంచో, కాడిలాక్ కారులోంచో, ఇంపాలాలోంచో అందంగా ఆనందంగా తారు రోడ్డుకేసో, కాకపోతే పక్కనే నడుస్తున్న మరో మహిళామణి వైపో అతని కథల్లోంచి చూడనే చూడడు.

చలపతి స్వతహాగా డబున్నమనిషే- ఎందుకంటే అతని హాబీలన్నీ కొంచెం డబ్బున్న మనిషికి ఉండేవే' హాబీ డబ్బుండేదే అయితే ఆహాబీ ఓనరూడబున్నవాడే!

కానీ చలపతి రాసే కథల్లో డబ్బు కనబడదు డబ్బు కనపడకపోవటం వల్ల కలిగే కష్టాలన్నీ చలపతి కథల్లో కాపురం ఉంటుంటాయి.

చలపతి రాసే కథలన్నీ ఈ సంఘపు అట్టడుగు మనిషి గురించి. ఆ మనిషి కోసమే తన కథలు. తన కథలన్నీ ఆ మనిషిని మరో అడుగు పైకి తీసుకెళ్ళ గలిగితే, అంతకన్న తను కానీ, తన కథలు కానీ సాధించగలిగేది ఏదీ ఉండదు- అనే ఊహలో ఉంటాడు చలపతి.

—ఇంత చలపతి గురించి చెప్పా నంటే దానికి కారణం అతనంటే నాకున్న మంచి అభిప్రాయమే!

నాకూ కొంచెం కథలు రాసే అలవాటు ఉంది. ఎంత ఆలోచించినా నా కథలు మాత్రం అబ్బాయి అమ్మాయిల సంకెళ్ళ లోంచి బయటపడలేవు. అందుకే నేను రాయలేని కథలు,చలపతి రాయటంవల్లనే, అతను రాయగలగటం వల్లనే, చలపతి అంటే అభిమానం పెంచుకొన్నాను.

* * *

"ఎవరికీ ఇవ్వని వస్తువు మీకు ఇస్తున్నాను. జాగ్రత్తగా చూసుకోండి సుమా!" అన్నాడు చలపతి కెమేరా అందిస్తూ.

"ఫర్వాలేదండి, జాగ్రత్తగానే తెస్తా! అక్కడ మా ఫ్రెండ్ ఫోటో స్టూడియో ఉంది. కానీ అతనికి వీల్లేకపోవటంవల్లనే మీ కెమెరా తీసుకెడుతున్నాను." అన్నాను నేను కెమెరాను చూసుకొంటూ

కెమెరా చూస్తోంటే ముచ్చటగా ఉంది. వెలుతురులో, చీకట్లో మనుషుల స్వభావాల్ని, మనుషుల్ని శాశ్వతంగా దాచగలిగే సాధ్యం! నా చుట్టూ ఉన్న ప్రపంచంలో ఓ చిన్న భాగం కెమెరా అద్దంలోంచి కనిపిస్తూ ఉంది.

కెమెరాలో ఉన్న భాగాలన్నీ జాగ్రత్తగా చూపించి, అవి ఎలా ఎలా పని చేస్తాయో చెప్పాడు చలపతి. అతను చెప్పినవన్నీ మళ్ళీ మర్చిపోతాననే భయం ఉండటంవల్ల, అన్నీ కాగితం మీద రాసుకొన్నాను.

చలపతి ఎవ్వరికీ ఇవ్వని కెమెరా నాకు ఇచ్చాడు. ఆ అమూల్యమైన వస్తువును జాగ్రత్తగా పట్టుకొని ఆ ఇంటిలోంచి బయటపడ్డాను.

* * *

వారం గడిచింది. చలపతికి చెప్పిన దాన్ని బట్టి ఆ రోజు నేను కెమెరా తిరిగి ఇచ్చేయాలి. సాయంత్రం వరకూ ఏవేవో పనులు చేసుకొన్న తర్వాత వీధి దీపాలు వెలిగాక, చలపతి ఇంటికేసి నడిచాను. నేను వెళ్ళినపుడు చలపతి ఇంట్లోనే ఉన్నాడు. నవ్వుతూ పలకరించాడు

"ఎలా వచ్చాయి ఫొటోలు''

నాకు నవ్వొచ్చింది. ఏం చెప్పను? మంచి కెమెరాతో తీసిన ఫోటోలు బాగా వచ్చాయి అని అబద్ధం చెప్పనా? లేకపోతే ఆ కెమెరా సరిగ్గా ఉపయోగించుకోలేక పోయాము, ఫోటోలు ఒక్కటీ రాలేదు అని నిజం చెప్పనా??


ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాను.

"చెప్పండి, ఎలావచ్చాయి ఫొటోలు?" అనడిగాడు చలపతి.

నవ్వలేక, ఏడ్వలేక చెప్పాను— ఫోటోలు ఏమీ రాలేదని. నెగటివ్ అంతా తెల్లగా ఏ విధమైనా మచ్చా లేకుండా వచ్చింది.

నొచ్చుకుంటూ అన్నాడు చలపతి— "సారీ—ఇలాటి సొఫిస్టికేటెడ్ కెమెరాతో ఇదే బాధ. వస్తే చాల బాగా వస్తాయి, లేకపోతేఅంతే.అయినా మీకిది కొత్తకదా! సారీ- కెమెరా ఉపయోగపడలేదు కదా!"

చలపతి అనునయం నాకు బాధను ఎక్కువ చేసింది.



"పోనీండి. మీరు మాత్రం ఏం చేస్తారు? " అన్నాను నేను.

చలపతి కెమెరా అందుకొని, పైన ఉండే లెదర్ కవర్‌తీసి చూశాడు. అటూ ఇటూ తిప్పి చూశాడు. ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు చలపతి—"ఇదేమిటి, ఇలా అయిపోయింది?"

అటుకేసి చూశాను—అక్కడ అలా ఏం జరిగిందో నాకు తెలీదు.

"ఏం జరిగింది?

"ఇదుగో—" అంటూ ఓ చిన్న

స్క్రూ దగ్గర చెయ్యిపెట్టి అన్నాడు—

"ఇక్కడ! ఈ స్క్రూ లూజ్ అయిపోయిందే!"

చూశాను. నిజమే! చలపతి చెప్పినట్లుగా ఆ స్క్రూ లూజ్‌అయిపోయింది. ఆ విషయం నేనూ ఇపుడే గమనించాను. అది అలాగే ఉందో, నా దగ్గరే అలా అయిందో తెలీలేదు—

"నిజమే. సారీ వేరే స్క్రూ వేయించి ఇస్తాలెండి" అన్నాను నేను.

చలపతి నాకేసి ఒకసారి ఆశ్చర్యంగా చూశాడు "అంటే?"—

"దీన్ని తీసుకెళ్ళి వేరే స్క్రూ వేయించి తీసుకొస్తా" అన్నాను మళ్ళీ. చలపతి నేనన్నది అర్థం కానట్లుగా అన్నాడు "అలా కుదరదండీ. ఎంత కొత్త స్క్రూ వేసినా, దాని ఒరిజినల్ వాల్యూ పోయినట్లేగదా!"

"ఒక్క స్క్రూ వల్ల!"


"ఆ, ఒక్క స్క్రూవల్లనే!—ఓ పని చెయ్యండి. ఈ కెమెరా ఎలాగూ పాడయిపోయింది!'"

షాక్ తినేశాను నేను.

"ఒక్క స్క్రూ లేకపోతే— అదీ లూజయిపోగానే కేమెరా పాడయిపోయినట్లేనా?"

"ఆ—ఆ స్క్రూబదులు వేరేదివేయించినా, దాని విలువ తగ్గిపోయినట్లే గదా!"

"విలువ తగ్గచ్చునేమోగానీ, పాడయి



'సోగ్గాడు'గా తెలుగు ప్రేక్షకుల హృదయాలు దోచిన శోభన్‌బాబు ఇప్పుడు 'పొగరుబోతు'గా రాబోతున్నాడు. నిర్మాత దర్శకుడు తాతినేని ప్రకాశరావు తమ అనిల్ ప్రొడక్షన్స్ పతాకం క్రింద నిర్మిస్తున్న కలర్ చిత్రం 'పొగరుబోతు'.

నట్లు కాదు గదా!"

"నాకు విలువ తగ్గటం ఎంతో పాడవటమూ అంతే!" చలపతి కంఠం కొంచెం తీవ్రంగా ఉంది.

పరిస్థితి విషమిస్తున్నట్లుగా తెలుస్తూనే ఉంది అయినా తప్పు నాది. అందుకే అన్నాను "సరే, ఏంచెయ్యమంటారుమరి?"

"అదే చెబుతున్నా ఈ కెమెరా మీరు తీసుకోండి. నేను వేరేది కొనుక్కుంటా!"

చలపతి అన్నది బాగానే ఉంది ఎలాగూ కొత్త కెమెరా కొనే ఊహలోనే ఉన్నాను. పోనీ, ఇదే తీసుకొంటే

"సర్లెండి అయితే కానీ, ఒక్క— అనటం ఏమీ బాగలేదు."

దానికి చలపతి ఏమీ అనలేదు. క్షణం తర్వాత అన్నాడు "చెప్పండి - ఓ వెయ్యి రూపాయలు ఇచ్చేసి "

"ఎంత?" విన్నది రైటేనా అనే అనుమానంతో అడిగాను.

నేను విన్నది నిజమే! చలపతి అంటున్నది 'వెయ్యిరూపాయలు!'

పక్కున నవ్వేశాను.

"మీరుకొన్నదిఅయిదువందలకేగదా!"

"అవును!"

'మరి వెయ్యిరూపాయలు అంటారేం?'

'అవును!'అన్నాడు చలపతి దృఢంగా.

అయిదు వందలకు మూడేళ్ల క్రిందట! ఇపుడు దాని విలువ తగ్గాలే గానీ ఇలా పెరగటం ఏమిటి?"

చలపతి నాకేసి చూస్తూ అన్నాడు—"నేను కొన్నది అయిదొందలకే, కాదనను. అదీ మూడేళ్ళ కిందటే! కాదనను కానీ ఇపుడు నేను కొనుక్కోవాలంటే ఇలా టిదే మూడొందలకు రాదు వచ్చేది, వెయ్యి రూపాయలు అవుతుంది. అందుకని వెయ్యి రూపాయలు ఇమ్మంటున్నాను.''

చలపతి అంటోంది వింటోంటే నాకు నవ్వొచ్చింది "అంటే ఆఫ్టార్ల్ ఆ స్క్రూ కోసం నాకు మీరు వేస్తున్న ఫైన్ వెయ్యి రూపాయలా? అన్యాయం!"

"కెమెరా మీకు ఇచ్చినందుకు పాడు చేసి ఇవ్వటం మీరు నాకు ఇచ్చే బహుమతి కాబోలు! అది అన్యాయం కాదూ!"

"పొరబాటున పాడయిపోయింది కాబోలు!"

"కాబోలు ఎందుకు మళ్ళీ! పాడయి పోయింది. స్పష్టంగా కనిపిస్తూంటే."

"అవును పాడయిపోయింది. కానీ, అందుకు వెయ్యిరూపాయలు "

"అవును పాడుచేయటం మీరు చేశారు. ఇపుడది బాగుపడ్డా దాని విలువ పోయినట్లే. అందుకే నేను కొత్తది కొనుక్కోవాలనుకొంటున్నా "

"మీ కొత్తది రెండు వేలు అయితే."

"మీరు రెండు వేలే ఇవ్వాల్సి ఉంటుంది. అయినా కొత్తదాని విలువ వెయ్యికన్నా కొంచెం ఎక్కువ. వెయ్యి మీరు ఇవ్వండి ఆ మిగిలింది, మీకు ఈ కెమెరా ఇచ్చినందుకు నాకు శిక్ష అనుకొని నేను వేసుకొంటాను!" చలపతి అన్నాడు.

తప్పు చేశాను. ఎరువు సొమ్ము బరువు చేటు అని తెలిసీ తీసుకోవటం తెలివి తక్కువ పని. కానీ ఇంత ఘోరంగా వలలో పడిపోవటం

కానీ నేనుఇది నేర్చుకోవాల్సిన పాఠం. వెయ్యి రూపాయల జుల్మానాతో నేర్చుకోవాల్సిన అగత్యం రావటమే కొంచెం దురదృష్టం—

చలపతికి ఆ తర్వాత వాయిదాల మీద వెయ్యి రూపాయలు ఇచ్చేశాను

రెండు నెలలు గడిచాయి ఇంట్లో ఏదో పత్రిక తిరగేస్తోంటే చలపతి కథ కనబడింది. చదివాను. మధ్య తరగతి మనుషుల్నీ, అట్టడుగు మనుషుల్నీ, తమను దోచుకొంటున్న వారిమీద తిరగబడమని ప్రబోధించే కథ.

నాకు నవ్వొచ్చింది—

చలపతి ముసుగులో ఉన్న మనిషి. పైకి కనిపించడానికి వేసుకొన్న రంగులు వేరు, మనిషి వేరు— అవకాశం వస్తే అందర్నీ దోచుకోవడానికి కాచుకుని కూర్చున్న వ్యక్తి చలపతి. ఇన్నాళ్ళూ అవకాశం రాలేదు కాబట్టి మడి కట్టుకొని కూర్చున్నాడు ఆ 'మడి టైంలో దోపిడీదారులను ఎదుర్కోమని ప్రబోధించే కథలు రాస్తాడు. అవకాశం రాగానే

నాకూ కొంచెం జ్ఞానోదయంఅయింది. ఇపుడు నేను చలపతి నేర్పిన పాఠాలవల్ల ప్రేమ కథలు రాయటం మానేసాను. దోపిడీ కథలు, దోపిడీదార్ల కథలు, తిరుగుబాటు కథలూ ఇవే రాయగలుగుతున్నాను.

చలపతికి వచ్చిన అవకాశం నాకు ఇంకా రాలేదు—అందుకే కథలు పుష్కలంగా రాసేస్తున్నాను ★

తాటికింద పాలు

'వ్రెయిన్‌రోడ్డు ఆకాశం పందిరికింద పెళ్ళిమంటపంలా వుంది' — అనుకున్నాడు సుబ్బారావు ప్రకృతి అందాల్ని కళ్ళతోనూ, సిగరెట్ పొగని నోటితోనూ ఆస్వాదిస్తూ.

అతనా వూరికి వుద్యోగరీత్యా బదిలీ అయి వచ్చి రెండు రోజు లయింది. హోటల్‌లో దిగి, రూంకోసం అష్టకష్టాలు పడి గాలించగా, ఇరవయి రూపాయిల కెలాగో ఓ చిన్న గది దొరికింది 'ఆఫీసు గంటలుపోను మిగతా టైమంతా బస వెదుక్కునేసరికే సరిపోయింది, ఈ రెండ్రోజులూను' ఓ సినిమా లేదు, తిరగడం లేదు, ఏం లేదని విసుక్కుంటూంటే చప్పున సుబ్బారావుకి తనతో తమ వూళ్ళో చదుకున్న రాజారామ్ ఈ వూళ్ళోనే వుద్యోగం చేస్తున్నట్టు జ్ఞాపకం వచ్చింది.

రాజారామ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. అతను గత నెలలో పెళ్ళి చేసుకొంటున్నట్టు రాస్తూ, 'పెళ్ళికి ఏదో కారణం చెప్పి రావడం ఎగెయ్యకుండా తప్పక రావల్సిందే'ని ఆజ్ఞాపిస్తూ రాశాడు! అదేమో! తను ఎంత ప్రయత్నించినా శలవుదొరకడం కష్టమయి, వెళ్ళలేక పోయాడు. ఆఫీసర్ని తిట్టుకున్నాడు ఇంక చేసేదిలేక. ఎలా వుంటుంది రాజారామ్ భార్య? చాలా అందంగా, స్టయిల్‌గా, ఎట్రాక్టివ్‌గా వుంటుందా? లేక సాధారణంగా, సంసారపక్షంగా వుంటుందా?.. ఏమో! రాజారామ్‌ది గొప్ప రసిక హృదయం. నిజానికి తమ ఇద్దరిదీ ఒకటే మనస్తత్వం. దేవుడు మనిషికి ఇచ్చే అపురూపమైన వరాల్లో అందం అతి ముఖ్యమైనది. అంత అపురూపమైన వరాన్ని హస్తగతం చేసుకోలేని మనిషిజన్మ వృధా! వృధా'

సుబ్బారావు ఆలోచనల్ని అంతం చేస్తూ చేతివ్రేళ్ళమధ్య సిగరెట్ చివరంటా కాలి, వేళ్ళని ముద్దెట్టుకుంది. గభాల్న అది పారేశాడు. క్రొత్త స్కూటరు మీద కొత్త దంపతులు కాబోలు—అతుక్కుపోయి కూచుని ఝామ్మని వెళ్ళిపోతున్నారు. ఒకమ్మాయి మినీస్కర్ట్, బుష్‌కోటు వేసుకుని వెళుతోంటే—బహిర్గత మౌతోన్న ఆమె యవ్వనపొంగుల్ని అక్కడ బీట్లుకొట్టే కుర్రాళ్ళు కళ్ళతో అవుపోశన పట్టేస్తున్నారు. సుబ్బారావు కళ్ళూ ఆమె కనుమరుగయ్యేదాకా వెంటాడుతోనే వున్నాయి.

సడెన్‌గా ఓ పోలీస్‌వేన్ వచ్చి సుబ్బారావు ముందు ఆగింది, సుబ్బారావు త్రుళ్ళి పడి రెండడుగులు వెనక్కివేశాడు. వేన్ తలుపుతీసుకుని రాజారామ్ "హల్లో సుబ్బారావ్! ఎప్పుడు వచ్చేవ్? ఎక్కడ దిగావు? ఆ‹? " అంటూ ప్రశ్నల్తో వుక్కిరిబిక్కిరి చేసేశాడు.

సుబ్బారావు రాజారామ్ ప్రశ్నలకి జవాబులు చెప్పి, వేన్‌లో ఆడవాళ్ళవంక

శివల జగన్నాధరావు

వింతగా చూస్తూ "ఏమిటి? వాళ్ళంతా అంటూ సందేహంలో ఆగిపోగా—

"రెయిడింగ్ జరిపాం వాళ్ళు పట్టుబడ్డారు " జవాబిచ్చాడు రాజారామ్.

సుబ్బారావు వాళ్ళని చూస్తూ జాలిపడబోయాడు. జాలి కలగలేదెందుకో ఏదో క్యూరియాసిటీ కల్గుతోంది! వాళ్ళల్లో కొందరు సామాన్యంగా వున్నారు కొందరు అందంగా వున్నారు. మొత్తంమీద అందర్లో అలంకరణలతో ఏర్పడే ఆకర్షణ వ్యక్త మౌతోంది. వారి ముఖాలలో ఏ భావమూ వ్యక్తమవడం లేదు.

అతనికి స్నేహితుణ్ణి చూస్తే హుషారు పుట్టుకు వచ్చింది. రాజారామ్‌కీ అలాగే వున్నట్టుంది. "ఇక్కడున్నావేం? బస్ కోసమా?" అడిగాడు.

"వుఁహు! ఇప్పుడే కొత్త తీరుబడి చిక్కితే ఇలా వీధిలోకి వచ్చినించున్నారా! ఇదిగో ఈ వీధిలో నేవున్నాను. రాపోదాం!"

"ఇప్పుడా?! చూసేవుగద నా డ్యూటీ.. నువ్వేరా రేపు మా ఇంటికి."

సుబ్బారావు హుషారుగా ఈలేసి "వాళ్ళల్లో ఆ అమ్మాయి చూడు, మాంఛి పదునుమీదుందిగదూ?" అన్నాడు.

రాజారామ్ నవ్వి, ముందుకు వొంగి, నెమ్మదిగా అన్నాడు. "సరే అయితే నీ సంగతి కానియ్యి గురూ' మనసంగతి చూసుకున్నాకే తర్వాత జరిగేది "

సుబ్బారావు వులిక్కిపడ్డాడు. తర్వాత నవ్వి "అయితే గ్రంధసాంగుడివేనే!" అన్నాడు.

"నువ్వు కానట్టు! "

"ఇలాంటి పన్లు చెయ్యలేదు నేను."

"అవకాశం వస్తే ఇస్తే. చేయక పోవు."

సుబ్బారావు నవ్వేశాడు. లోపలేదో కదుల్తోంది వుధృతంగా. ఒక్కసారి రాజారామ్ ప్రోత్సాహం ఇస్తుంటే యేం? రాజారామ్ కొంటెగా నవ్వుతున్నాడు. సుబ్బారావు చుట్టూ చూశాడు. ఆ పరిసరాల్లో వున్నవాళ్ళంతా పని కట్టుకుని తన కేసి చూసి నవ్వుతూన్నట్టనిపించింది.

సిగ్గావరించగా తల వొంచుకున్నాడు. రాజారామ్ భుజమ్మీద చెయ్యివేశాడు. "మజావెయ్యి గురూ! వొంటిగాడివసలే' వాళ్ళు తేలికవుతుంది "

"రాజారామ్' దయచేసి టాపిక్ మార్చు"

"ఏమిటి? అభిప్రాయాన్ని మార్చేసుకున్నావా?"

తలాడించాడు నవ్వేసి.


రాజారామ్ వేన్ ఎక్కి వెళ్ళిపోయాడు. 'రాజారామ్ ఎప్పుడూ దేవాంతకుడే' అనుకున్నాడు సుబ్బారావు వెడుతోన్న వేన్ వంక చూస్తూ.

*   *   *

త్రుళ్ళిపడి పక్కకి గంతేశాడు సుబ్బారావు. తనని రాచుకున్నంత దగ్గరగా ఆ కారు రాగానే' "హల్లో సుబ్రావ్!"

ఆశ్చర్యంగా తలెత్తాడు కారు కాదది. వేన్! రాజారామ్ పోలీస్‌వేన్.

అప్రయత్నంగానే వేన్‌లో మిగతా మనుషుల్ని చూశాడు. ఐదుగురు అమ్మాయిలున్నారు. అంతా ఒకటి రెండు సంవత్సరాలు తేడాగా పాతిక సంవత్సరాలలోపు వయసువాళ్ళే సుబ్బారావు కళ్ళు రాజారామ్ ప్రక్కనే కూచున్న



జగపతి ఫిలింస్ పతాకం క్రింద కృష్ణప్రసాద్ తెలుగు ప్రేక్షకుల కందిస్తున్న రంగుల పౌరాణికం 'దశావతారములు'లో యస్. వరలక్ష్మి.

యువతిమీంచి చెదరలేక పోతున్నాయి. కళ్ళు మరల్చుకోలేని సౌందర్యం! మోహంతో మత్తెక్కించి, మతి భ్రమింప జేసే చక్కదనం.

సుబ్బారావు రాజారామ్ అదృష్టానికి అసూయపడ్డాడు. విస్తుపోయాడుకూడా. నేరుగా తన ప్రక్కనే కూచోబెట్టుకుని.... ఎంత ధైర్యం రాజారామ్‌కి!? ఇతని చర్యల్ని చూసి వూరుకుంటారా వాళ్ళ డిపార్టుమెంట్ వాళ్ళు? ఏక్షన్ తీసుకోరా?

ఎంత రసికుడైనా, సాహసి అయినా మరీ ఇంత తెగింపా?!

ఆ యువతిని చూస్తోంటే మాత్రం మనసు వుండబట్టడంలేదు. జ్వాల రగుల్తోంది లోపల.

నిన్న రాజారామ్ తనకెలాగూ 'అభయం' ఇవ్వనే ఇచ్చేడుగద. ఒక్కసారి....ఆ సౌందర్యాన్ని తన స్వంతం చేసుకోవాలి. కావాలి! కావాలి! గుండె.... నరాలు .... నెత్తురు ఘోషిస్తున్నయ్.... కావాలి!

తనని తేరిపార అదోలా చూస్తోన్న

రాజారామ్ ఎందుకో నిన్నటంత చొరవగా మాట్లాడలేదు.

"నేను వెళతానోయ్. నువ్వు రేపు మా ఇంటికిరా!" అని వెళ్ళిపోయాడు.

సుబ్బారావు ఏదో చెబుదామనుకుని.... అడుగుదా మనుకుని....అవకాశం లేక నోరువెళ్ళబెట్టి వుండిపోయాడు. రాజారామ్ రావడం.... వెళ్ళడం అంతా కొన్ని నిము షాల్లో జరిగిపోయింది. తను ఆ సౌందర్య లహరిలో మునగడంలో ఎంతో సమ యంగా ఫీలయ్యాడు కాని....

మర్నాడు రాజారామ్ ఇచ్చిన అడ్రస్ పట్టుకుని అతనింటికి వెళ్ళాడు సుబ్బారావు. "అమ్మయ్య! ఇప్పటికి నీకు వీలైనందన్న



'నిజం నిద్రపోదు'లో మమత

మాట." అంటూ ఆహ్వానించాడు రాజా రామ్. ఇద్దరూ ముందుగదిలో కూచున్నారు.

లోపలి ద్వారానికున్న కర్టెన్ తీసుకుని "మీ స్నేహితుడ్ని కబుర్లతోనే కడుపు నింపి పంపేసేట్టున్నారు....భోజనానికుండ మని చెప్పండి" అంటూ వచ్చిన స్త్రీని చూసి వులిక్కిపడ్డాడు సుబ్బారావు. నిన్న రాజారామ్ ప్రక్కన పేస్‌లో కూచున్న యువతి!

రాజారామ్ తన భార్యని పరిచయం చేస్తూ, నిన్న తను భార్యతో, మరదళ్ళతో సింహాచలం వెళ్ళివస్తున్నానని చెప్పాడు. తన భార్యని అప్పుడే ఎందుకు పరిచయం చేయలేదని అడగబోయి వూరుకున్నాడు సుబ్బారావు. రాజారామ్ ప్రక్కన వున్న ఆమెని తను అదోలా చూడటాన, రాజా రామ్ ఆమెని పరిచయం చేద్దామనుకునీ ఆ విషయం విస్మరించవచ్చు. 'తన చూపు' రాజారామ్‌ని అయోమయస్థితిలో పెట్టేసి వుంటుంది. ప్చ్! తను నీచంగా ప్రవర్తిం చేడు. అయినా రాజారామ్‌కీ, తనకీ వున్న ప్రగాఢస్నేహం,చనువూ, అంతకుమునుపు రాజారామ్ ప్రవర్తనా తనని ఆ విధంగా ప్రవర్తింపజేసేయి. తాటిక్రిందకి చేరడమే తప్పు. చేరి, అక్కడ పాలుతాగినా కల్లు తాగినట్టే సమాజం భావిస్తుందని అను కోడం ఎందుకు? తను, రాజారామ్ అవి నీతిపరంగా ప్రవర్తించబోయేరు గనుకే తను రాజారామ్ భార్యని 'తప్పుదృష్టి'తో చూసేడు. తాము ఎప్పుడూ స్వచ్ఛంగా, నిర్మలంగా వుండుంటే 'ఆ చెడుభావానికే' తావుండేదికాదు గదా?!....

సుబ్బారావు దీర్ఘంగా నిట్టూర్చాడు.★

గుర్తు

కావ్యావిష్కరణ మహోత్సవం జరుగుతోంది. కవి వుత్సాహంతో వూగిపోతూ తన 'సామాన్యుడి శపథం' నించీ కొన్ని కవితలు వినిపిస్తున్నాడు. కవిత్వం చాలా ఉద్రేకంగా నడిచింది. ఆయన గొప్ప కవిగా ఆంధ్ర దేశంలో పేరు మోసినవాడు. బిరుదులూ, సన్మానాలూ, అందుకున్నాడు. కనుక జనం యెక్కువ సంఖ్యలో హాజరయ్యారు. కవి తన కవితా ప్రతిభతో, తన చదివే పద్ధతితో తనకిదివరకే వున్న కీర్తితో జనాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

అందంగా అలంకరించబడిన వేదిక మీద వేయబడిన మూడు మెత్తని కుర్చీల్లో రెండు ఆక్రమించబడి వున్నాయి. అందులో వున్నవారు కుడి నించీ యెడమకు (రేపు పత్రికల్లో ఇలాగే వస్తుంది) కృతిభర్త శ్రీ కృష్ణంరాజుగారు (ఫలానా శాఖమంత్రిగారు) స్థానిక యెమ్మెల్యే స్వామి నాయుడుగారు. వీళ్ళిద్దర్ని గురించీ కవి యింతకుముందు తనకున్న పరిచయం ద్వారా వివరించాడు. తన 'సామాన్యుడిశపథం' కావ్యానికి మంత్రి కృష్ణంరాజుగారిని సరైన భర్తగా ఎంచుకోడాని క్కారణం,ఆయన సాహిత్య పిపాస అన్నారు. అంతేకాదు సామాన్యుడి శ్రేయస్సుకోసం తహతహపడుతున్న మా ఇద్దరి లక్ష్యమూ వొక్కటే! 'ఇదే ఇదే మన యిద్దరి పథం. ఇదే ఇదే సామాన్యుడి శపథం' అని అంకితం పేరవున్న కవిత చదివాడు.

తన కలం, గగనాన్నీ, భూమినీ కలిపి వర్గాల్లేని స్వర్గం నిర్మిస్తుందని వొక కవిత!

కాంతి ద్వారాలు తెరిచాను, రండి మీరంతా నా వెంట! అని ఆర్డర్ జారీ చేస్తూ వొక్కవిత! తన కవిత్వం పేదవాడికంకితమనీ, తన కలంహాలం కష్టపడి సాహిత్య పొలాన్ని దున్ని పండించిన అక్షరాల మెతుకులన్నీ ఆకలి కడుపులకే అందిస్తానన్నదొకటీ! ఈ ఆఖరి కవిత జనాన్ని చాలా కదిలించినట్లుంది అర నిమిషం పాటు చప్పట్లు మోగాయి.

కవి చిరునవ్వులు చిందిస్తూనే, కొంచెంగా తలవంచి తన వినమ్రతను తెలియజేస్తోన్నాడు కవిత్వం నాకూ నచ్చింది. చప్పట్లు కొట్టడానికి మాత్రం చేతులు కదల్లేదు, యెందుకో బిగుసుకుంటున్నాయి. కళ్లు తెరుచుకుని సూటిగ్గా కవిని చూస్తోన్నాను. ఇదే దృశ్యం ఇంతకు ముందెన్నడో చూసినట్లు జ్ఞాపకం! ఈ బార్ లైట్ వెలుగులాగే ఫెళ్ళున కాస్తోన్న యెండ. పలకా, పుస్తకం వున్న సంచీ భుజాన తగిలించుకుని బడికిపోతూ పోతూ బురుజుకాడ... అవునవును'ఖాళీ సంచిలోంచీ పిల్లవాన్ని జుట్టు పట్టుకుని బైటికిలాగాడు. పెద్ద బండరాయిని ఒక్క గుద్దుకు వక్కలు చేశాడు. చొక్కా, నిక్కరు జేబుల్నించీ డబ్బులు రాల్చాడు, గలగలా. పిల్లవాని గొంతుకోసేసి మళ్ళా అతికించి అప్పుడూ చూస్తోన్న జనం ఇప్పట్లాగే చప్పట్లు కొట్టారు. అప్పుడతను యీ కవిలాగే గర్వంగానవ్వుతూ, తలవంచాడు. అప్పుడూ తన చేతులు యిప్పట్లాగే బిగుసుకున్నాయి.

'[illegible]'

మిస్టర్ సంపత్ ఎం.ఏ

మాదిరెడ్డి సులోచన

జరిగిన కథ

ఆదర్శాలకూ, అవసరాలకూ జరుగుతున్న పోరాటంలో అవసరాలదే పైచేయి అని భావించక తప్పని పరిస్థితులలో చిక్కుకున్నాడు సంపత్ కుమార్. ప్రేమించిన సునీతి అపార్థం చేసుకుంది. సునీతి తండ్రి శివరాజు గారి బాకీ వెంటనే కట్టవలసి వచ్చింది. తల్లి అనారోగ్యం ఆందోళన కలిగిస్తూంది. న్యాయమార్గాన సంపాదన కోసం ప్రయత్నించి పరాజితుడవుతున్నాడు సంపత్. శివరాజుగారు పక్షవాతంతో మంచాన పడ్డారు. ఆయన కుటుంబం హఠాత్తుగా సంక్షోభానికి లోనైంది. అవసరాలకు లొంగాడు సంపత్. 'మేల్ ప్రాస్టిట్యూట్'గా తయారయేందుకూడా సిద్ధమై అస్తానా దగ్గర ఉద్యోగానికి చేరాడు. ఒకరోజు చాలామంది హైసొసైటీ యువతుల కోర్కె తీర్చేందుకు వారిముందు నగ్నంగా నిలబడేందుకు సిద్ధమయ్యాడు. ఆ దుస్థితినుండి సీత కాపాడింది. సంపత్ తల్లి మరణించింది. సీత అండగా నిలిచిందతనిక. సునీతికీ సంపత్ కూ మధ్య దూరం పెరిగిపోతోంది. తన మాట కాదన్నందుకు అస్తానా సంపత్ ను బెదిరించాడు. సీత సహకారంతో పెద్ద బిజినెస్ మాన్ అయ్యాడుసంపత్. సీత భర్త గుప్తాకు కంటిగింపుగా వుంది సంపత్ ను చూస్తేనే సునీతి కుటుంబం ఆర్థికంగా అస్తవ్యస్థమైన స్థితిలో పడింది. సంపత్ తెలివితేటలతో వ్యాపారాన్ని అమిత వేగంగా వృద్ధిపరచాడు. గుప్తా స్వంత ప్రయోజనాలకోసం తమ వ్యాపారసంస్థను అప్రతిష్టపాలు చెయ్యడం సహించలేక అతన్ని వ్యాపార బాధ్యతల నుంచి తొలగించాడు సంపత్. గుప్త సీత దగ్గర మండిపడ్డాడు.

"భయ్యా! మీరిద్దరూ నాకున్నా ఉపయోగం లేనివారే. ప్రత్యేకంగా ఎవర్నో ఒకర్ని కోరుకుని ఏం చేసుకోను?"

"నీకు నవ్వులాటగా ఉందా? ఆఫ్టరాల్ నౌకర్ల ముందు నన్ను ఎంత అవమాన పరిచావని!"

"ఎంత? కిలో అవమానమా, రెండు కిలోలా? నేను కనుక్కుంటానుగాని నువ్వెళ్ళి విశ్రాంతితీసుకో భయ్యా."

"సీతా!"

"ప్లీజ్! నా మాట విను. నిన్ను అవ మానపరిస్తే నన్ను పరిచినట్టేకాదా!" అన్నది గుప్త మాట్లాడలేనట్టు వెళ్ళి పోయాడు సంపత్‌ను అప్పుడు మాట్లా డించడం మంచిదికాదని లోపలికి వెళ్ళి పోయింది. హైద్రాబాద్‌లో బీబికి అన్ని పనులు తెలుసు కాబట్టి పెద్దగా పని ఉండేదికాదు. ఇక్కడ నాయర్ ఒక వంట మాత్రమే చేస్తాడు. పై పనులకో అమ్మాయిని పెట్టుకున్నా, సీతకు పని తప్పదు. ఆమె కూడా పనులుంటే మనసు కోతిలా తిరగదని గ్రహించింది.

రాత్రి భోజనాలు అయ్యాక, తనే వద్దా మని బయలుదేరుతుండగానే ఆమె గదికి సంపత్ వచ్చాడు.

"అంకల్ అంకల్ మమ్మల్ని బీచ్‌కి తీసుకువెడతానన్నావు " డాలీ వచ్చి అతన్ని వాటేసుకుంది.

"వచ్చే వారం తీసుకువెడతాను."

"అంకల్! నాకు జూ చూపించాలి." టిల్లు అడిగాడు.

"అలాగే." ఇద్దరితో ఓ పది నిమి షాలు ఆటలాడి, వారు నిదురబోయేవరకు వాళ్ళ దగ్గరే గడిపాడు. వారు నిదుర బోయాక దుప్పటి సరిగ్గా కప్పి బయటికి వచ్చాడు.

"సీతా! నా మాటపై నమ్మకం ఉందా?"

"ఆ అనుమానం నీకెందుకు వచ్చింది?"

"గుప్తాగారు ఓడలో నల్లమందు, మరి కొన్ని మత్తు కల్గించే పదార్థాలు బయటికి పంపుతున్నాడు. అది ఎంత అవమాన కరం? ఒక విధంగా మోసంచేసి డబ్బు పెట్టుబడి పెట్టించావనే అనుకో. వారికి వాటా ఇవ్వాలా, వద్దా? అప్పుడే మన కంపెనీ గురించి చెడు వార్తలు వస్తే ఎలా?"


"సంపత్! గుప్తాగారే చేస్తున్నారని నీకు కచ్చితంగా తెలుసా?"

"నేను స్వయంగా విన్నాను. అతను సైడ్ బిజినెస్‌తో కోటీశ్వరుడవుదామని కలలు కంటున్నాడు. అందుకే అతన్ని అక్కడనుండి తొలగించాను. పిల్లల బాగోగులు చూచుకొమ్మని చెప్పాను." అన్నాడు.

సీత మాట్లాడలేదు. తమకేం తక్కు వని గుప్తా అడ్డదార్లు తొక్కుతున్నాడు. సంపాదనకు! అన్ని వ్యసనాలలాగే సంపా దన కూడా ఓ వ్యసనమేనేమో!

"కోపం వచ్చిందా సీతా?"

"లేదు. మంచి పని చేశావు అంటు న్నాను. అతనిదంతా మేకపోతు గాంభీ



ర్యములే ”

“నువ్వు వెళ్ళి హాయిగా పిల్లలతో హైద్రాబాద్‌లో ఉండు సీతా, వాళ్ళకు మంచి, చెడు తెలుస్తున్నాయి.”

“ఆ అమ్మాయి విషయం ” మిస్ విస్కీ విషయం ప్రస్తావించింది సీత.

“ఆ విషయం మరిచిపో సీతా! ఆ అమ్మాయిని భరించాలంటే మరికొంత నాగరికత కావాలి.” అన్నాడు లేస్తూ.

“అది కాదు సంపత్, ఒకరు పైకి వస్తున్నారంటే ఓర్చలేరీ జనము. నీ కంటూ ఓ అండ కావాలి. రావుగారు అర్థబలం, అంగబలం గల వ్యక్తి. అమ్మాయిని రెండు రోజుల్లో మార్చి వేస్తాను.” అన్నది.

సంపత్ హృదయం ఆర్ద్రమయింది. ఎన్ని జన్మల బంధమో. సినిమాల్లో చూపి నట్టు ఎవరో వచ్చి సీత తన అక్కేనని చెబితే ఎంత బావుండును, ఏ అక్కా చెయ్యని త్యాగం తనకోసం చేసింది. తన సుఖశాంతులను గూర్చి తాపత్రయపడు తుంది స్వంతవారు ఈమాత్రం చేస్తారా?

“సీతా, నా కిప్పుడప్పుడే ఆ వాదర బందీ పెట్టుకోవాలని లేదు. అలాంటి కోర్కె కల్గితే ముందే నీకు చెబుతాను ”

“నిన్ను ఒంటరిగా వదిలిపోవటం కుదరదు, మరి.”

“బీబికి ఉత్తరం రాయి. ఆమె భర్తకు ఇక్కడే ఉద్యోగం ఇస్తాను ” అని లేచాడు.

“నా వాటా కూడా పెద్దదయితే ఇన్‌కమ్ టాక్స్‌వారి గోల, అందుకే అందరిని

హాస్యవృక్షం



షేర్‌హోల్డర్స్‌గా చేయాలని ఉంది." అన్నాడు.

"అవన్నీ నువ్వే చూసుకో." ఆవులించింది సీత.

సంపత్ కృషి సీత విషయంలో కూడా ఫలించింది. ఆమెకు మంచి మంచి గ్రంథాలు ఎంచి తెచ్చేవాడు. అవి చదివి ఆమె కొంతయినా మంచి, చెడులు తర్కించి, తనలాంటివారు కోకొల్లలని గ్రహిస్తే చాలు అనుకున్నాడు. అతని ఆశయం ఫలించినట్టే. మొదట, మొదట ఏం పుస్తకాలు అంటూ నిర్లక్ష్యం చేసిన మనిషి, ఇప్పుడు శ్రద్ధగా చదివి, వాటి మంచిచెడులు చర్చిస్తుంది సమయం దొరికితే.

"నా జీవితం గురించే ఆలోచించాను సంపత్! అనాకెరినినా చదువుతుంటే కళ్ళనీళ్ళొచ్చాయి.

నిర్మల చదివి ఏడ్చేశాను. ప్రతి చోట స్త్రీ ఎందుకిలా పావురాయి అవుతుందో! ప్రేమ్‌చంద్ పాత భావాలు కలవాడు అంటారుగాని, ఆయన జీవితాన్ని క్షుణ్ణంగా చదివాడు

నాకన్నీ ఏరి కోరి ఇలాంటివి తెస్తున్నావేమిటి? మేయర్ ఆఫ్ కాస్టర్ బ్రిడ్జి చదివి, సూసన్ గురించే ఆలోచించాను."

ఆమె ఆలోచనలు అటువైపు మళ్ళాయి. అతను నిశ్చింతగా నిట్టూర్చేవాడు. మెల్లగా తన గదికి వచ్చేశాడు. జరిగిందానికి ఒక్కసారి గుప్తా ముందు విచారన వ్యక్తపరచాలని ఉన్నా, ఎందుకో అతనికి మనస్కరించలేదు.

27

పేపర్ చదువుతున్న సునీతి మతి పోయింది. మొదటి పేజీలో పెద్దపెద్ద ఫొటోలున్నాయి. మెడలో పూలదండ లతో రీవిగా సంపత్ నిలబడి వున్నాడు. అతని ప్రక్కనే ప్రముఖులు. మరోప్రక్క సీత, భర్త, పిల్లలున్నారు.

"ఇదో నాటకం!" పళ్ళు పటపట కొరికింది.

'ప్రముఖ వ్యాపారవేత్త, సంపత్ షిప్పింగ్ కంపెనీ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీ సంపత్‌కుమార్ ఎం.ఏ గారు, బిజి నెస్ టూర్, యు కె. వెడుతున్నారు. అనతికాలంలో అతి వ్యయప్రయాసల కోర్చి స్వంత నౌక సంపాదించినవారు వీరే. అతనికి ఆయురారోగ్యాలు ప్రసా దించమని, ఆయన శ్రేయోభిలాషులు పూజలు జరిపించారు. ప్రముఖ వ్యాపార సంస్థలన్నీ ఘనమైన వీడ్కోలు ఇచ్చాయి .'ఆపైన చదవలేకపోయింది

"సునీ! అవినీతి, అక్రమ మార్గాలే త్వరగా లక్షాధికారులు కావడానికి సోపా నాలు." అనే మాటలు చెవుల్లో గింగురు మన్నాయి. డబ్బుకోసం అవినీతి మార్గం త్రొక్కక తప్పటంలేదన్నమాట. అతను ఏదో చేస్తే తనకేం? ఈనాడు దిక్కులేని వాడుగా తన తండ్రి చార్‌మీనార్ ఆస్ప త్రిలో ఉంటున్నాడు. సంపతే గనక తమ వెంటపడకపోతే? ఆలోచించలేక మరో సారి పేపర్ తిప్పింది. చిరునవ్వుతో నిల్చున్న ముఖం తనను హేళనచేస్తున్నట్టు భావించింది. విసురుగా పేపర్ బయటికి గిరాటువేసింది.

"హే భగవాన్! డబ్బు అడగడానికి వస్తే ఈ సన్మానమా?"

వచ్చిన వ్యక్తిని చూచి చటుక్కున లేచి నిలబడింది.

"మీరా మీర్‌చందాని సాబ్! నేనేదో కోపంతో పేపర్ పడేశాను. మీరు వస్తున్నారని తెలియదు."

"నా పేరు కుమార్‌చందాని " అతను సునీతివంక తేరిపారచూచాడు.

"మా ఆడవారికి పనేం లేక గున్న ఏనుగుల్లా అవుతారు సలాకిలా ఎంత బావుందో " అనుకున్నాడు.

"కూర్చోండి"అన్నది కుర్చీ చూపిస్తూ.

"మీ నాన్న ఆరోగ్యం ఎలా ఉంది?"

"మామూలే." అన్నది నిరాశగా

"నా మాట విని ఈ ఇల్లు అమ్మేయి. వడ్డీలు పెరిగిపోతున్నాయి. మీ నాన్న బాగయితే మళ్ళీ కొనుక్కుందురుగాని."

"ఇంకొక్క అవకాశం యివ్వండి చందానీ సాబ్. మా అక్క స్టేట్స్‌లో ఉంది. తనకు పరిస్థితులు వివరిస్తూ ఉత్తరం రాశాను."

"సరే. మరో నెల గడువిస్తున్నాను. మా వ్యాపారమే వడ్డీలతో నడుస్తుంది. అసలు, వడ్డీ లేకపోతే ఎలా?"

"మీ విషయం అర్థం అయింది." అన్నది ఏమీ అనలేక.

"ఎవరే అమ్మాయీ! త్వరగా నడవా లంటే ఈ కాళ్ళు పీక్కుపోతాయి."

"కుమార్ చందాని మన షావు కారులే." అన్నది. అతను వెళ్ళిపోయాడు. ఇష్టం లేకపోయినా ఇల్లు అద్దెకు ఇవ్వక తప్పలేదు. ఇంటి అద్దె, తనకు ట్యూష న్లపై వచ్చే ఆదాయముతో ఇల్లు గడపటం

కష్టంగా ఉంది. ఆడపిల్లలు మొగపిల్ల లంత కఠినంగా ఉండరు. అక్క వస్తే ఏదయినా సాయం చేస్తుందన్న నమ్మకం ఉంది. ఆశ చాలా చెడ్డది. కొన్నిసార్లు జీవితాలకు పట్టుకొమ్మ కూడాను.

"సునీతీ!" సుశీలమ్మ వచ్చింది. ఆమె చేతిలో ప్లేటుంది. దానినిండా తినుబండారా లున్నాయి.

"ఎందుకక్కా! ప్రతి సారి నాకిస్తావు? పిల్లలకు పెట్టు."

"వాళ్ళకు పెట్టకుండా ఒక్క పిసరు బయటికి రానిస్తారా? మీ బావగారింటికి తిరిగి వచ్చి కుదురుగా ఉంటున్నారని, గుడికి వెళ్ళొచ్చాను." అన్నది ప్రసాదం ఇస్తూ.

అవన్నీ తీసుకుంది. సావిత్రమ్మ వచ్చింది ఆమె తన మామూలు ధోరణిలో తనకు వచ్చిన రోగాల లిస్ట్ ఏకరువు పెట్టింది.

"సంపత్ విషయాలు తెలుస్తున్నాయా సుశీలమ్మా? ఏదో ఆ అనసూయమ్మను మరిచిపోలేకుండా వున్నాను. బంగారం లాంటి మనసు. ఆయన మాత్రం తులసి వనంలో గంజాయి మొక్క అంటారే, అలా వారి కడుపున పుట్టాడు"

"ఎవరి పాపం వారిదే బాబాయి గార్ని చూచి రావాలి. నేను వద్దాం అను కుంటున్నాను"

"అలాగే వెడదాం అమ్మా. మాకున్న నాడు అంతా చుట్టూ చేరినవారే. ఇప్పుడు కనిపిస్తే కరిచేస్తామేమోనని భయపడ తారు."

"ఇది మానవ నైజం."

"మీ ఆయన ఉద్యోగం పోయిం దేమో."

"ఇంకా ధర్మప్రభువులున్నారు ఈ లోకంలో. పిలిచి ఉద్యోగం ఇచ్చారు." అన్నది.

"అలాగా! ఇప్పుడే కాదు. మీ ఆయన కుదురుకున్నాక మా సునీతికేదయినా ఉద్యోగం చూపించు"

"అలాగే పిన్నిగారూ!" అన్నది.

"మా అనిత వస్తే ఏమంటుందో. చిన్నదానికి ఉద్యోగం ఎందుకంటే? కట్న మిచ్చి చెల్లెలి పెళ్ళి చేస్తుందో." ఆమె ముఖంలోకి కాంతి వచ్చింది.


"ఏదయినా మనకు సంతోషమే. వస్తాను సునీతీ!" ఆమె ప్లేటు అక్కడే పెట్టి వెళ్ళిపోయింది. ఇల్లంతా బోసిగా కనిపించింది. సామాన్లు ఒక్కటొక్కటే అమ్మేసుకున్నారు. అక్క, బావ వస్తే ఎలా? వారికి మాత్రం తెలియదా తమ పరిస్థితి! సునీతి ఆశగా ఎదురుచూచిన రోజు రానే వచ్చింది. అనిత చెల్లిని, తల్లిని చూచి బావురుమంది అయిదు నిమిషాలు అలాగే వుండిపోయారు. ఆ తరువాత సునీతే తేరుకుని, టిఫిన్, కాఫీ ఇచ్చింది.

"నువ్వేం శ్రమపడకు సునీతీ! నేనేం కొత్తవాడినా?"

"శ్రమా! ఎవరికి చేస్తున్నాం బావా? నాన్న ఆస్పత్రిలో వుంటాడు. తమ్ముడు హాస్టల్లో వుంటున్నాడు. అన్నయ్య రానే రాడు." అన్నది దిగులుగా.

"సంపత్ పేరు బయట కూడా చాలా పాపులర్ అయిందమ్మా."

"అతని పేరు నేను ఎప్పుడో మరిచి పోయాను బావా! మీరు చాలా మారి



పోయారు, ఆరోగ్యం బాగుపడింది. మీ రిద్దరూ ఉద్యోగాలు చేస్తారు. పాపాయిని నా దగ్గర వదిలిపెట్టి వెళ్ళకూడదూ?"

"అదే ఆలోచించాము మీ అక్క ఏమంటుందో."

"చేసేవి చేస్తూనే, నన్ను ఆడిపోసుకుంటారేం? టాక్సీని పిలిపించండి. నాన్నను చూచి, అలాగే మీవారింటికి వెడదాము."

"బావకేం తెలుస్తుందక్కా? నేను పిలిపిస్తాను." సునీతి వెళ్ళి సుశీలమ్మ కొడుకును పిలిచి పంపింది.

బయటికి వెళ్ళిన అనిత హోటల్లో గది కుదుర్చుకుని వచ్చింది. సునీతి ఆశ్చర్యపోయింది

"అదేమిటక్కా! ఇంత పెద్ద ఇల్లుండగా "


"సునీ! నీకు తెలియదు. మీ బావ వైపువారు వాళ్ళింట్లో వుండలేదని గొడవ చేస్తారు అదీకాక మాకోసం వచ్చేవారుంటారు సరియైన సదుపాయాలు లేవు మనింట్లో "

"అవునే అమ్మాయ్! మీకు మంచి చెడు ఉంటాయిగా." అనగల్గింది సావిత్రమ్మ. ఆమె మాటల్లో కొంత నిష్ఠూరత, కొంత ఆప్యాయత వున్నాయి.

"అమ్మా! అంత దేశంనుండి వచ్చింది మీ నిష్ఠూరాలు వినటానికి కాదు ఆస్పత్రిలో ఉన్నంతసేపు నాన్న అదే ధోరణి. ఇక్కడివారి కాలికి ముల్లు గుచ్చుకుందనగానే పరుగెత్తుకురావటానికి విజయవాడా, విశాఖపట్నమా!" విసుగ్గా అంది.

ఆమె సామాన్లు టాక్సీలో సర్దుకోబోతూ ఒక సూట్‌కేసు తీసి సునీతికో

హాస్యవృక్షం



షిఫాన్ చీర, తమ్ముడికి షర్టు ఇచ్చింది.

"సునీతీ' అమ్మ మానసికంగా, శారీరకంగా బాగా దెబ్బతిన్నది. ఇక్కడే ఉంటే ఆమె బ్రతుకదు. నాతో తీసుకు వెడతాను. పాస్‌పోర్ట్‌కోసం అప్లయి చేస్తున్నాను "

"నాన్నను తీసుకువెడితే "

"లాభం లేదు." మధ్యలోనే త్రుంచింది ఆమె.

"హిఈజ్ దగెస్ట్ ఆఫ్ ప్యూడేస్ " అన్నది నిర్వికారంగా.

"అక్కా'"

"అవును. అమ్మ ఆరోగ్యం కుదుట పడ్డాక మళ్ళీ వస్తుంది. ఇంటి అద్దె మీ ఇద్దరికీ చాలు. తమ్ముడికి సైనిక్ స్కూలు వాళ్ళే మూడొంతులు ఫీజు ఇస్తున్నారట కదా" అన్నది. ఆ తరువాత సునీతి ఒక్క మాట మాట్లాడలేక పోయింది.

"నేను వస్తే అది ఒక్కర్తి యెలా ఉంటుందే?'' తల్లే అడిగింది,

"అద్దెకున్నవారు తోడుంటారు. ఇంత ఇల్లు తనకెందుకు' యెక్కడయినా ఉద్యోగం దొరికితే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఉంటుందిలే'' అన్నది. తండ్రి ఏదో అని ఉంటాడు. అందుకే అక్కకు కోపం వచ్చిందని సమాధాన పడింది. వాళ్ళు వెళ్ళి పోయారు.

"సునీ! వెళ్ళమంటావుటే'" నువ్వు అనుమతి ఇస్తే వెడతానన్న భావము స్పష్టంగా కనిపిస్తుందా కన్నులలో. ఇక్కడ తనకు తోడని తప్పితే ఉండి మాత్రం చేస్తుంది? ఈ బాదర బందీనుండి

గతము తాలూకు స్మృతుల నుండి ఆమెను తప్పిస్తే అంతే చాలు.

"వెళ్ళిరా అమ్మా. ఆ దేశం చూచి నట్టు ఉంటుంది. కొంత మనసుకు విశ్రాంతిగా కూడా ఉంటుంది" అన్నది. ఆ రోజు నుండి రోజూ యెప్పుడో ఒకసారి హోటల్‌కు వెళ్ళి పాపాయితో గడిపి, వాళ్ళ క్రొత్తవారిని, తెలిసిన వారిని చూడటానికి వెడితే పాపాయిని తెచ్చుకునేవారు. అక్కతో సినిమాలకీ, షికార్లకి వెడుతుంది. కుమార్ చందాని అప్పు గురించి ప్రస్తావించాలని ఉన్నా, మొహమాటం అడ్డువస్తుంది. ఆ రోజు హోటల్‌కు బయలుదేరుతుంటే కుమార్ చందాని మనిషి వచ్చాడు. ఏది ఏమయినా ఆ రోజు తేలుస్తానని అనుకుని, వారం రోజుల గడువు కోరింది. హోటల్ గదిలో అడుగు పెట్టి అక్కను, బావను మార్చి మార్చి చూచింది. ఇద్దరూ తీవ్రంగా ఏవో వాదించు కున్నారని తెలిసిపోయింది.

"ఏమిటక్కా ఏమయింది?"

"చూడు సునీ! వాళ్ళకంటే అర్థం కాదు. సంపాదించి నోట్లు తింటామని మా అత్తగారి వైపు వాళ్ళు అనుకుంటారు. తెలియజెప్పే బాధ్యత ఈయన పైన లేదా?"

"ఊఁ చాల్లే తెలివి. వారికన్న యెక్కువ సంపాదిస్తామని ఆశిస్తారు. వారు అడిగినవి అన్నీ ఇస్తున్నామా?''

"చెల్లికి పెళ్ళి చేశారు. తమ్ముడిని చదివిస్తున్నారు. నన్ను వేలం వేసి మీ వాళ్ళకు పంపండి."

''చూడు సునీతీ! మీరు కష్టాల్లో ఉన్నారు. రాము ఆదుకోకపోతే వాధ పడటం లేదా? అలాగే మా వాళ్ళు ఏదో ఆశిస్తారు."అన్నాడు అతను. అది నిజమే.

''కాదని యెవరంటున్నారు మన దగ్గ రుండాలి కదా వెళ్ళిన దగ్గరనుండి ఇల్లు కారు అమర్చుకోవటానికే డబ్బంతా సరి పోయింది. మధ్య మధ్యన వీళ్ళకు పంపుతూనే ఉన్నాము. దానికో హద్దూ, పద్దూ ఉండదా?"

"వాళ్ళు అనగానే నేను పంపుతున్నానా?"

"మీరు పంపుతామన్నా నేనూరుకోను. ప్లేన్ చార్జీలు మా అమ్మకు పెడుతున్నామని మీ అమ్మ అంటే నువ్వు జవాబు ఇవ్వలేదేం? మా అమ్మను తీసుకుపోయే పర్పస్ చెప్పలేదేం?"

"అనితా!" అతను అసహనంగా లేచాడు.

"కోపం యెందుకు! బేబీ సిట్టింగ్‌కు యెంత ఖర్చు అవుతుందో లెక్కేలేదు. మా అమ్మకు కొన్న టికెట్టు డబ్బులు రేపు మనకు మిగలవూ?" ఆ మాటే వినిపించింది సునీతికి. ఆ తరువాత వారి వాదం, గొడవ ఏం వినిపించలేదు. అలాగే కలలో నడిచినట్టు, నడిచి వెళ్ళి సోఫాలో కూర్చుంది. తనూహించింది అంతా అబద్ధం అని తేలిపోయింది పాపాయి కోసం తల్లిని తీసుకు వెడుతున్నారన్న మాట!ఇంత ప్రాక్టికల్‌గా ఆలోచించేవారు తనకేం సహాయము చేస్తారు?

"సునీతి సునీ " విసుగ్గా అనిత పిలిస్తే తేరుకుంది.

''ఇవి యెప్పుడూ ఉండేవేలే మాకు. నువ్వెళ్ళి ఇదిగో ఈ రంగుల బ్లౌజుపీసులు



పెళ్ళంటే నూరేళ్ళ పంట' చిత్రం ద్వారా ప్రతిభగల కొత్త తారల నెందరినో తెలుగు ప్రేక్షకలోకానికి పరిచయం చేస్తున్నాడు ఉత్సాహవంతుడైన యువనిర్మాత 'ఎన్. వి. సుబ్బరాజు. పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో తయారవుతున్న యీ చిత్రంలో పరిచయం కాబడే ఓ తార భవానికి నిర్మాత, దర్శకులందిస్తున్న సూచనలను మీరు చూస్తున్నారు.

కొని దర్జీకిచ్చిరా" అన్నది విసుగ్గా.

"నువ్వు రావా?"

"వాళ్ళ అత్తకూతురు టీకి పిలిచింది." అని పర్స్ తీసి డబ్బు ఇచ్చింది. తను అడగ దలుచుకున్న మాట నోట్లోనే ఉండి పోయింది. డబ్బు అవసరము లేనిది యెవరికి? ఎవరి కష్టాలు వారికి ఉంటాయి. సునీతి బజారు వెళ్ళి బ్లౌజుపీసులు కొని టైలర్‌కిచ్చి వచ్చింది. ఆమెకు మరో ఆలోచన వచ్చింది. త్వరగా హోటల్ చేరుకుంది. అక్క, బావ వచ్చారు.

"మరి నేను వస్తానే" లేచింది. అక్కను బయటికి రమ్మన్నట్టు సైగ చేసింది.

"సునీతిని పంపించివస్తాను. పాపాయిని ఉండనియ్యవే. రాత్రికి మీ బావగారి బంధువులు వస్తారట." అని చెప్పులు వేసుకుని చెల్లెలు వెంట నడిచింది.

లిఫ్ట్ దగ్గర ఆగారు ఇద్దరూ.

"అక్కా! మీరు ఇండియాకు తిరిగి వస్తే ఇల్లు కావాలి కదా."



"కావాలి. ఆయనకు ఆ సంగతి అక్కరలేదు. తన ఊర్లో వచ్చే రెండు దూలాల ఇల్లు కోసం కాచుకుని కూర్చున్నారు" అన్నది కసిగా

"అక్కా! మీరు ప్లాటు కొని ఇల్లు కట్టాలన్నా బోలెడు అవుతుంది మీరు దగ్గర లేకపోతే ఎవరూ కట్టరు. అందుకే మన పరువు కాపాడినట్టూ ఉంటుంది. ఇల్లు మీకుంటుంది, ఒక సహాయం చెయ్యండక్కా "

"ఏమిటే?"

''మన ఇల్లు మీ పేర రాయించుకోండి. ఇప్పుడున్న అప్పు కొంచమే అయినా వడ్డీలకు వడ్డీలు కట్టుకుంటున్నాడు. ఆ అప్పు తీర్చి, ఇంటికి సరసమైన ధర కట్టి, వీలు వెంట డబ్బు ఇస్తే తమ్ముడి చదువు అయిపోతుంది.''


"ఇంట్లో మరీ అంతలేసి ఖర్చులేమొచ్చాయే.''

క్లుప్తంగా అన్నీ చెప్పింది. అనిత కనుబొమలు ముడిచింది.

''బావగారితో ఆలోచించు అక్కా! నాన్నగారు స్వయంగా దగ్గర నిలబడి మరీ కట్టించారు. అమ్మటం నాకిష్టం లేదు."

''మంచిది రేపు చెబుతాను" అన్నది. సునీతికి ఓ సమస్య తీరినట్టు నిశ్చింతగా ఉంది.

రాత్రి పడుకోబోయే ముందు తల్లితో చెబుదాం అనుకుంది. కాని సునీతికి కొన్ని విషయాలలో కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ఏ విషయమయినా పూర్తిగా జరుగుతుందని తెలియనిదే చెప్పుకోలేదు.



"సునీ! మీ నాన్న వెళ్ళమన్నారు కాని యెందుకో బాధపడ్డారే. ఆయనకెలా ఉంటుందో." దిగులుగా చూచింది.

"ఫరవాలేదు వెళ్ళిరామ్మా. సీరియస్‌గా ఉంటే కబురు చేస్తాను." అన్నది.

"వెంటనే చేయాలి సుమా! నీకు తిండి గుర్తుండదు. యెలా ఉంటావో " అంటూనే నిదరలోకి జారిపోయింది సావిత్రమ్మ.

అనిత ప్రయాణం, రోజుల్లో నుండి గంటల్లోకి మారినా ఇంటి విషయము కదపలేదు. అభిమానము అవతలకు నెట్టి తనే అడిగింది.

"సునీ! ఈ జాయింట్ ప్రాపర్టీకి డబ్బు తగలేసి, రేపు విచారించడము నా కిష్టం లేదు. అందరూ ఇష్టపడుతున్నప్పుడు అమ్మ. అప్పులు పోగా ఏదయినా ఉంటే నీ పెళ్ళి కోసం దాచు." అనిత మాటలు విని రాయిలా నిలబడి పోయింది సునీతి.

28

ఉదయము నుండి ఆరాటంగా ఊగిసలాడిన మనసును అదుపులో పెట్టింది సునీతి. ఏదయితే అదే అవుతుందిలే అనుకుంది రాము నోటీసులు అందుకోలేదు. తనకు ఆ ఇంటితో యెలాంటి సంబంధ బాంధవ్యాలు లేవని అనౌన్స్ చేశాడు. తండ్రి హక్కు కూతురికే ఇచ్చాడు. నల్గురికి చెప్పి అమ్మదామనే లోపలే డిక్రీ వచ్చింది. ఒంటరి తనముతో పాటు క్షీణ దశలో ఉన్న తండ్రి ఆరోగ్యము సునీతిని పూర్తిగా కృంగదీశాయి అందుకే ఇంట్లో ఒక మూల నిల్చుండి పోయింది. తన తండ్రిని అరెస్ట్ చేసిన నాడే పరువు పోయింది. ఇంకేం పరువు అనుకుంది.

"ఎనభై వేలు ఎనభై వేలు . "

అతని గొంతు మామూలుగా వున్నా కర్ణకఠోరంగా వినిపించింది.

"యెనభై అయిదు . " యెవరో పలికారు

"యెనభై అయిదు యెనభై అయిదు, ఒక్కసారి మంచి అవకాశము మళ్ళీ రాదు. రెండు సార్లు "

యెనభై అయిదు పలికినతని ముఖము వికసించింది. అంత మంచి ఇల్లు చవకగా రావటం తన అదృష్టం.

"ఒక్కసారి రెండుసార్లు యెనభై అయిదు వేలు రెండుసార్లు " ఆక్షనీర్ మట్టూ కలయజూ వాడు. హాల్లో నిశ్శబ్దంగా ఉంది.

"లక్ష! "గంభీరమైన కంఠము వినిపించింది సునీతితో పాటు అక్కడున్న వారంతా అటు తిరిగారు. ఇద్దరు ముగ్గురు పెద్ద మనుషులు హడావుడిగా అతనికి యెదురు వెళ్ళారు.

"నమస్తే!" వినయంగా ఆగంతకుడికి నమస్కరించారు.

"యెవరు?" కొందరు కుతూహలంగా అడిగారు.

సునీతి ముఖం దోరగా మాగిన టమోటా పండులా ఎఱ్ఱగా మారింది

"సంపత్ షిప్పింగ్ ఏజెన్సీస్ ప్రొప్రయిటర్ " యెవరో సన్నగా గొణిగారు.

"లక్ష ఒక్కసారి రెండవసారి లక్ష ఒక్కసారి రెండవసారి మూడవసారి "

ఊపిరి బిగబట్టి చూస్తుంది సునీతి. యెవరయినా వస్తే బాగుండును, బిడ్ పెంచితే బాగుండును. యెట్టి పరిస్థితిలోను ఇల్లు తన ప్రత్యర్థికి దక్కకూడదు. కాని ఆమె ఆశ నెరవేరలేదు. సంపత్ పరమయింది ఇల్లు.

ఫార్మాలిటీస్ పూర్తి అవుతున్నాయి. కొందరు వెళ్ళిపోతున్నారు. మరి కొందరు సంపత్‌తో మాట్లాడితే చాలు అన్నట్టు చూస్తున్నారు. వీటన్నిటికి అతీతంగా యెటో చూస్తూ నిరాసక్తగా నిలబడి పోయింది సునీతి ఆమె ఆశలు అడుగంటి పోయాయి, పునాదులు లేని గోడల్లా కూలిపోయాయి. ఇదంతా సంపత్ పన్నాగము కాదు కదా!

'ఈ జన్మలో ఇలాంటిఇల్లు కట్టగలనా?'

సంపత్ మాటలు చెవుల్లో గింగురుమన్నాయి, సంపత్ నువ్వే గెలిచావు, అన్నింటా నువ్వే గెలిచావు నేను చిత్తుగా ఓడిపోయాను. ఒకప్పుడు ఆడదానికి అందము ఓ వరము అనేవారు. ఇప్పుడది మొగవారిపట్ల నిజమయింది. అన్నీ పోగా మిగిలిన పదకొండు వేలు ఆమె చేతిలో పెట్టారు. అవి తీసుకుంది.

"మాఫ్ కర్నా సునీతిజీ." కుమార్ చందాని యెంతో ఇదిగా చెప్పాడు.

"మీరేం చేశారు! మేము చేసిన తప్పులేమిటోగాని భగవంతుడే క్షమించలేదు." అన్నది మెల్లగా.

"వస్తాను " అతను వెళ్ళిపోయాడు. సునీతి ఇల్లంతా కలయ తిరిగింది. నిశ్శబ్దంగా ఉంది. ఒక్క మనిషి లేడు. సంపత్ గంగారావు ఇంటికి వెళ్ళాడేమో. ఏ క్షణంలోనయినా రావచ్చు. ఇల్లు అతను స్వాధీన పరుచుకుంటాడు. తను ఖాళీ చేయక తప్పదు. మొదట యెక్కడయినా ఇల్లు చూచుకోవాలి.

"లక్ష్మీ!" గంగారావు అమ్మాయిని కేక వేసింది.

"ఏమక్కా!"

"ఇదిగో ఈ ఇల్లు మీ సంపత్



విరిసిన పుష్పాల్లా నవ్వులు రువ్వుతున్న జయసుధ, రోజారమణిల మధ్యన నిలచిన 'మొనగాడు' శోభన్‌బాబు. రంగుల చిత్రం 'మొనగాడు'లోనిదీ దృశ్యం.

చిన్నాన్నది. నేను సాయంత్రం లోగా ఖాళీ చేస్తానని చెప్పమ్మా" అన్నది.

అర్థం కానట్టు చూచిందా అమ్మాయి.

"ఆక్షన్‌లో కొన్నారమ్మా. తాళం వేశాను. అవసరమయితే తాళం చెవి ఇదిగో"

"అది కాదు అక్కయ్యా...." ఎన్నో అడగాలని ఉంది.

"నేను ఇల్లు చూచుకుని వస్తాను." అన్నది.బయటికి వచ్చి తదేకంగా సంపత్ కారు వంక చూచింది. విమానంలా, రెక్కలు చాచుకున్నట్టుందాకారు. పిల్ల లంతా చుట్టు మూగి చూస్తున్నారు.

లోపలి నుండి సంపత్, సుశీలమ్మ మాటలు వినిపించాయి. ఏం జరిగిందో గాని సంపత్ పక్కున నవ్వాడు.

'ఉహుం! నయవంచకుడు. ఆడవారిని బోల్తా కొట్టించడములో ఘనుడు!' అనుకుంది. చక, చక ముందుకు సాగింది.

తండ్రి ఉన్ననాడు సాయం పొందిన వారు తిరిగయినా చూడటం లేదు. డబ్బు బ్యాంకులో కట్టింది. ఆ వీధి చివర 'లల్లూరామ్ అండ్ కంపెనీ' అన్న బోర్డ్ ఉన్న ఇంటి ముందుకు వెళ్ళి నిల్చుంది. లల్లూరామ్ చూస్తున్న అకవుంట్ పుస్తకం బల్లమీద పెట్టి హడావుడిగా వచ్చాడు.

"ఏం బీబీ ఇల్లు అమ్మాలా?"

"లేదు లల్లూరామ్‌గారూ! హర్రాజు అయిపోయింది. నాకు అద్దెకు ఇల్లుకావాలి" అన్నది. అతను ఇల్లు అమ్మాలన్నా,

కొనాలన్నా, అద్దెకు కావాలన్నా సాయ పడుతుంటాడు. అతను బ్రోకర్ అని అందరికీ తెలుసు.

"యెంతలోగావాలి బీబీ?"

"యాభై రూపాయలకంటే ఇచ్చుకో లేను" అన్నది.

"హేరామ్! ఏమీ కాలం వచ్చింది. భగవాన్ నీకు సహాయపడతాడు బీబీ. రేపు ప్రొద్దుట ఇల్లు తయార్."

"నేను వేరే ప్రయత్నం చెయ్య నక్కర లేదు కదా?"

"యెంతమాట! మా మెంబర్‌షిప్ ఫీజు " నసిగాడు చేతులు నులుము కుంటూ.

"అద్దెలో కొంత పర్సంటేజి "

"అమ్మమ్మ యెంత మాట. అది మామూలు. ఇది నాకు కాదు. సైకిల్ తీసు కుని ఇళ్ళు వెతికే కుర్రవాళ్ళకు "

పది రూపాయలు తీసిచ్చింది. అతను రసీదు వ్రాసిచ్చాడు మెల్లిగా వెనక్కు తిరిగింది. ఆమెకు నీరసంగా అనిపించింది. ప్రొద్దుటి నుండి వచ్చి మంచినీళ్ళయినా ముట్టలేదన్న సంగతి గుర్తుకు వచ్చింది. వంట చేసే ఓపిక లేదని బ్రెడ్డు, జామ్ కొనుక్కుని వచ్చింది. ఇంట్లోకి వెళ్ళాలని పించలేదు ఇంటి ప్రక్కగా ఉన్న చెట్టు క్రింద కూర్చుంది కాల గమనము తెలి యటమే లేదు ఆమె కళ్ళ ముందు తండ్రి రూపం కదులుతుంది. ఆయన యెంతో శ్రద్ధగా యెంత ఆరాట పడి ఆ ఇల్లు కట్టాడని అంతా భ్రాంతిగానే మిగిలి పోయింది. తనప్పుడు చాలా చిన్నది.

"సావిత్రీ!" అరుస్తూ వచ్చాడు తండ్రి.

"ఏమండీ!" సావిత్రమ్మ భయపడుతూ వచ్చింది.

"నీ గొడవే నీదిగాని, బయటి విష యాలు పట్టించుకోవేం! ఆ ప్రక్క గోడ లకు నీళ్ళు పొయ్యలేదు కూలీలు. నువ్వు చూడలేదా?"

"లేదండీ, పిల్లలతో " నసిగింది.

"ఏం మాట్లాడినా పిల్లలను ముందేసు కుంటావు. ఒరేయ్ రామూ, అనితా, సునీత రండమ్మా " అందరూ చిన్న చిన్న చెంబులతో నీళ్ళందిస్తే శివరాజు గోడలు తడిపిన దృశ్యం సునీత హృద యంలో ఇప్పటికి చెరగనంతగా ముద్రింప బడింది. ఏదీ శాశ్వతం కాదని తెలిసి మనిషి ఎందుకు ఇంత ఆశపడతాడో, శ్రమ పడతాడో. ఇంటి ముందున్న ఒక్కొక్క మొక్కకు స్వయంగా నీళ్ళు పోశాడు. ఆ ఇంటిని తీర్చిదిద్దటంలో ఆయన పడే ఆనందం తను ఎరగంది కాదు కొట్టుమిట్టలాడుతున్న ప్రాణం తట్టుకోగలదా ఈ బాధ! బంధాలు, బాంధ వ్యాలు అంతా మిధ్యగా తోచిందామెకా క్షణంలో


"సునీతీ!"

కళ్ళు విప్పింది. చిక్కటి చీకటి ప్రకృతి కాటుక పులుముకున్నట్టున్నది. ఒక ఆకారం లీలగా కనిపించింది

"సునీతీ!"

"నాన్నా! మీరెలా వచ్చారు?" ఆశ్చ ర్యంగా చీకటిని చీల్చుకుని ఒక్కసారి తండ్రిని చూడాలని తహతహలాడిందామె హృదయం. అంత ఆత్మీయంగా, మృదు వుగా పిలిచేది తండ్రే.

"లోపలికి పద సునీ " అతను చేయి చాపాడు. ఆ చేతిని అందుకుని



లేచింది. అతను అలాగే ఆమెను దగ్గరకు తీసుకుని నుదురు చుంబించాడు.

"మన ఇల్లు వేలం పాడారు."

"మన ఇల్లు మనకే వుంది" అతని ఆసరాతో ముందుకి నడిచింది. ఇంట్లోకి వెళ్ళగానే అతను లైటు వేశాడు. అప్పటికే సునీతి నిద్రావస్థనుండి జాగ్రదావస్థకు వచ్చింది ఆమెకు దగ్గరగా మృదు మధురమైన పారిస్ సెంటు వాసన గుప్పుమన్నది. తను పట్టుకున్న చేయి వదిలేసింది అప్రయత్నంగా కళ్ళు పెద్దవి చేసుకుని చూచింది సంపత్ ఉదయము వేసుకున్న సూటు మార్చి, సాధారణమయిన దుస్తులు వేసుకున్నాడు.

"సునీ" అతను దూరం జరిగిన సునీతి దగ్గరకు వచ్చాడు.

"నా పేరు సునీతి" కంపరంగా చూచింది. ఒక్క నిముషం ఒక్కటే నిముషం ఆమె తనను తాను మరిచిపోయింది. లేవలేని తండ్రి ఎలా వసాదన్న ఇంగితమెలా లేకపోయిందని తనను తాను తిట్టుకుంది.

"సునీతి అనే పిలుస్తాను. గారూ అని కూడా చేర్చాలా? మిస్ అంటే చాలా?" అతను అడిగాడు. అతని కళ్ళల్లో కొంటెదనము కనిపించింది. సునీతిని కౌగిలించుకున్నది ఒక్క నిముషమయినా, కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన అశాంతి ద్రవీభవించి, శరీరమునుండి బయటపడినట్టు అనిపించింది.

"ఇక్కడేం పని నీకు?" చురచుర చూచింది. అతన్ని చూపులతోనే భస్మం చేయాలన్న కోర్కె సఫలీకృతం కాదని తెలుసు, అందుకే అసహాయత కనిపించిందా కళ్ళలో.

"తెలివిగలదానివి. నాకేం పనో తెలియదా?"

"ఓహో! ఈ ఇంటికి యజమానివి కాబోలు, నువ్వు ఎంత గింజుకున్నా నేను రేపు ఉదయము ఖాళీ చేసా...

రాత్రి ఇక్కడే వుంటాను."

అతని కళ్ళల్లో బాధ రెపరెపలాడింది. ఆ ఇల్లంటే వారికెంత ప్రాణమో తను ఎరగనిది కాదు సునీతిని ఆటలు పట్టించా లన్న కోర్కె అడుగంటింది.

"సునీతీ! ఈ రాత్రే కాదు, ఎప్పటికీ ఇక్కడే వుండాలని నా కోరిక. ఈ ఇల్లు నీది సునీ!"

"ఓహో! ఏం ఉదారత! ఏం ఉపకార బుద్ధి! 'పిర్ర గిల్లి జోల పాడారని' మీలాంటివారినే చూచి అన్నారు కాబోలు" అన్నది రోషంగా.

"నీ మాటలకు నేను ఆగ్రహపడటం లేదు సునీతీ! ఒక్కటే ఒక్క మాట. మీ విషయాలు బయటపెట్టింది నేను కాదని ఎలానిన్ను నమ్మించను!"

"అంత శ్రమ నీకు అక్కరలేదులే. ఇప్పటికే నీ జీవితం అబద్ధాలతో, అక్రమాలతో సాగుతుంది"

"సునీతీ!" దెబ్బతిన్నట్టు చూచాడు.

"సునీతి ఇంకా నీ తీయని మాట లకు మైమరిచిపోయే స్థితిలో లేదు"

"పోనీ అమ్మమీద ప్రమాణంచేసి చెప్పనా?"

"అమ్మ పేరెత్తే అర్హత కూడా లేదు ఆమె అదృష్టవంతురాలు కాబట్టి త్వరగా కన్నుమూసింది. తల్లి చావుబ్రతుకుల్లో ఉంటే ప్రియురాలి సరసన హాయిగా గడిపావు ఇది నీ ఒక్కడి ప్రవర్తన కాదు. మొగవాడి బలహీనత!"

"సునీతీ! నువ్వు కారాలు, మిరియాలు నూరటం మానేస్తే ఒక్క అరగంట మనసులు విప్పి మాట్లాడుకుందాం నీకు వచ్చిన సందేహాలన్నింటికి సమాధానం చెబుతాను." ఆమె చెయ్యి అందుకుని

ఆమె తలయెత్తి చూచింది కాని తన చెయ్యి విడిపించుకోలేదు. అతనికి కొంత ధైర్యం వచ్చింది.

"ఈ ఇల్లు మామయ్య పేర రిజిస్టర్ చేయించాను నువ్విక్కడే ఉండు. నీ అంతట నువ్వు వచ్చి పిలిచేవరకు మళ్ళీ ఈ ఛాయలకు రాను సరా!"

"జాలి చూపుతున్నావా?"

"కాదు నాబాధ్యత నెరవేరుస్తున్నాను."

"సంపత్! వేలంలో ఇల్లు అమ్ముడయింది కాని మా అభిమానం కాదు." ఈసారి విసురుగా చెయ్యి లాక్కుంది.

"సునీతీ!"

"సునీతినే చెబుతున్నాను విను. నేనంటూ మళ్ళీ నీ దగ్గరకు రావటం జరిగితే నీ అంతం దగ్గర పడిందని గుర్తుంచుకో. నీ పరువు బజార్లోకి ఎక్కిందని తెలుసుకో" రోషంగా అనింది. అతను చిన్నగా నవ్వాడు.

"అంత ధైర్యం వుండటం చాలా మంచిది స్త్రీ తన పిరికితనం, సెంటిమెంట్లతో బాధపడుతుందే తప్ప ఎవరూ అన్యాయం చెయ్యటం లేదు ఆ ధైర్యం, ఆత్మ విశ్వాసము ఉంటే సంతోషించే వాడిలో నేను మొదటివాడిని" అన్నాడు.

"ఊఁ " ఇంకా ఏదో విసురుగా అనబోయింది.

"ఇంకా తర్క, వితర్కాలతో మనసులు పాడు చేసుకోవద్దు. వస్తాను, నువ్వు యెప్పుడు వచ్చినా, యెలా వచ్చినా నేను సంతోషంగా ఆహ్వానిస్తాను" అని వర వర బయటికి వచ్చాడు వెళ్ళేటప్పుడు యెంత ఉత్సాహంగా వెళ్ళేడో వచ్చేటప్పుడు అంత నీరసంగా వచ్చాడు.

పాలపొంగు

రవికి ముచ్చెమటలు పోస్తున్నాయి.

శరీరమంతా క్రొత్త క్రొత్తగా వుంది.

లేచి ఫాను స్పీడు పెంచి వచ్చి పడు కున్నాడు. క్రింద కుషను బెడ్డు. పైన సీలింగు ఫాను. చల్లటి వాతావరణం చక్కటి గదిలో వంటరిగా తను అయినా రవి మనసు ప్రశాంతంగా లేదు. ఫాను గాలికి ఎగురుతున్న వుంగరాల జుట్టు. ఆ జుట్టులాగానే అతని మనసులో గూడా ఉవ్వెత్తున ఆలోచనలు. అలల్లాగా, ఎడతెరిపిలేని గాలి తరంగాల్లాగా, అల్లి బిల్లిగా, గజిబిజిగా ఆలోచనలు.

తను తొమ్మిదో తరగతి పరీక్షలు పూర్తిచేశాడు. తను బీదవాడు తండ్రి కష్టపడి చదివించాడు. ఆపైన చదివిం చడం సాధ్యపడలేదు తనకు చదవాలని ఆరాటం. ఆశానిరాశల మధ్య పోరాటం. చుట్టాల దెప్పిపొడుపులు. ఊరిపెద్దల యీసడింపులు.

అడుగడుగునా ఎదురుదెబ్బలు. అంధ కారంలో కొట్టుమిట్టాడుతున్న తన జీవి తంలో తళుక్కున కాంతిరేఖ. తన వూరికి ఐదుమైళ్ళ దూరంలోనే రామారావు. తనని అభిమానించి చదివిస్తానన్నాడు ఆయన బ్లాకు డెవలప్‌మెంటు వుద్యోగి. తన తండ్రి స్నేహితుడి కొడుకు. పెళ్ళయి రెండేళ్ళయింది. ఆయనలానే ఆయన భార్య సీతాదేవి గూడా ఎంతో ఆదరంతో చేరదీసింది తనని.

తను మొదట్లో నిరాకరించాడు. పరుల సహాయంతో చదువెందుకనుకున్నాడు. కాని రామారావు ఒప్పుకోలేదు.

"నువ్వు నాకు తమ్ముడులాటివాడివి. అపోహలు పెట్టుకొని చదువు పాడుచేసు కునే అవివేకివి కాకు. చక్కగా చదువు కుని మంచి మార్కులు సంపాదించు" అన్నాడు.

"అవునయ్యా' ఆర్థిక యిబ్బందులవల్ల చదువు పాడవరాదు. పరాయివాళ్ళమని మేమిచ్చే చేయూతని నిరాకరించరాదు. చక్కగా చదువుకో." అంది సీతాదేవి


తను అమాయకంగా తలాడించాడు. అలా క్రొత్త జీవితం ఆరంభమయింది.

తనపట్ల సీతాదేవి, రామారావుల ఆదరం. తనకి తలమునకలుగా ఆశ్చర్యం. మొదట్లో సిగ్గు, బింకం. క్రమంగా అల వాటు. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో' తన చదువు నిరాటంకంగా సాగసాగింది.

రామారావుగారి వూరు రామాపురం. ఆ వూరిలోని సెకండరీ స్కూలులో తను చేరాడు పదవ తరగతిలో. తన వయసు పధ్నాలుగు. రోజూ చదువుకుంటూ— రామారావుగారింటిలో తింటూ—రాత్రి పడుకునేందుకు మాత్రం ఐదు మైళ్ళు నడిచి స్వగ్రామం వెళ్ళేవాడు—కొంచెం కష్టమైనా తనకిష్టమే'

రవి బాధను రామారావు గుర్తిం చాడు. తన యింట్లోనే వుండమన్నాడు.

'ఆలపాటి'



అంతగా కావాలంటే నెలకో, పదిహేను రోజులకో ఒకసారి యింటికి వెళ్ళి రమ్మన్నాడు.

అప్పట్నుండి రవి రామారావు యింట్లోనే వుండసాగాడు.

పరాయి ఇల్లు. కొత్తచోటు. అయినా తనకే లోటు తెలియలేదు. క్రమంగా కలిసిపోయ్యాడు రామారావుతోనూ, సీతాదేవితోనూ.

సీతాదేవి "మరదిగారూ!" అని పిలిచేది. తను గర్వంగా ఫీలయ్యేవాడు. తను "ఏమండీ!" అని పిలుస్తుండేవాడు. అలా అంటే బాగులేదని, "వదినా!" అని పిలవమనీ చెప్పింది సీతాదేవి!

తన అలాగే చేయసాగాడు.

ఒక మాదిరి యిల్లు రామారావుది. రెండు పడక గదులూ, ఒక డ్రాయింగు రూమూ, వంటగదీ—ఇంటిముందు చిన్న వసారా, వెనుక షుమారైన దొడ్డి—శుభ్రంగా వుంటుంది యిల్లు.


ఒక పడకగదిని తనకు కేటాయించి, రామారావు, సీతాదేవి యింకో పడక గదిలో పడుకునేవాళ్ళు. వాళ్ళకి పిల్లలు లేరు.

ఉన్నట్టుండి రాత్రిపూట తనకి నవ్వులూ, గుసగుసలూ వినబడేవి. క్రమంగా సద్దుమణిగేది—మొదట్లో తను పట్టించుకునేవాడు కాదు—గట్టిగా మనసుని పుస్తకాలమీదకి మళ్ళించేవాడు—క్రమంగా పట్టు సడలింది. అలా వినబడినప్పుడల్లా తను శ్రద్ధగా చదవలేకపోయేవాడు.

అలా వినబడినప్పుడు గట్టిగా కళ్ళు మూసుకుని పడుకునేవాడు పుస్తకాలు మూసి.

క్రమంగా అదీ సాధ్యపడలేదు. ఏదో కుతూహలం అతని మనసులో కల్లోలం

దిగివస్తే...



కలిగించేది.

తనకు తెలియకుండానే తన కాళ్ళు వాళ్ళ బెడ్ రూంకేసి నడిచేవి. మసక వెలుతుర్లో వాళ్ళిద్దరినీ చూచేవాడు తను. ఎందుకోగాని తన గుండె బరువెక్కినట్లు ఫీలయ్యేవాడు.

ఏవేవో ఆలోచనలు. అర్థంలేని, అర్థం కాని వూహలు చుట్టుముట్టేవి.

రామారావు వుద్యోగం తమాషాగా వుంటుంది. అప్పుడప్పుడు ఆయన కేంపులకెళ్ళేవాడు. ఒకసారి రామారావు కేంపుకెళ్ళాడు. ఆ రోజు కుండపోతగా వర్షం స్కూలుకి సెలవిచ్చారు. తను ముద్దగా తడిసి వచ్చాడు. సీతాదేవి గాభరా పడింది గబగబ లోనికి తీసుకెళ్ళింది. టవలుతో శుభ్రంగా తుడిచింది స్టూలు మీద కూర్చోబెట్టి తనమీదకి వంగి తల తుడిచింది. మొదటిసారి తనకేమయిందో తెలియలేదు. ఆ రాత్రి నిద్రపోలేదు తను. సీతాదేవి నిద్రపోతున్నప్పుడు పిల్లిలాగా పోయి ఎన్నోసార్లు చూచాడు రహస్యంగా.

ఆ మర్నాడే రామారావు వచ్చాడు. స్కూలుకి సెలవుపెట్టి మరీ యింటికి వెళ్ళాడు తను. పది రోజులయినా తిరిగి రాకపోయేసరికి రామారావు వచ్చాడు.

"ఇలా సెలవు పుచ్చుకుని యింట్లో కూర్చుంటే ఎలాగోయ్? పరీక్షలు దగ్గర పడుతున్నాయి. బయల్దేరు పోదాం."

తండ్రి గూడా వెంటనే పంపించాడు. తనలో ఏదో మార్పు తనకే తెలియని మార్పు.

ఒకసారి తనకి సుస్తీచేసింది. ఇరవై రోజులపాటు జ్వరం విపరీతంగా కాసింది. రామారావు తెచ్చిన మందులు, సీతాదేవి శుశ్రూషలు తను మళ్ళీ మామూలు మనిషయ్యాడు. తను బాగా కోలుకున్నాడు.

ఒక రోజు ఆదివారం తనని తలంటి స్నానం చెయ్యమంది సీతాదేవి.

చిన్నప్పటనుండి తల్లిదండ్రుల గారాబం. తనకు కష్టపడటం ఏమాత్రం చేతకాదు. స్నానాలగదిలో తను అవస్థ పడడం చూచి రామారావు నవ్వసాగాడు.

"ఓయ్! సీతా! మనవాడి తలస్నానం చాలా తమాషాగా వుంది. ఇంకా పిల్ల వాడు. పాపం సాయం చెయ్యి. ఇలా చేస్తే వీడి స్నానం సాయంత్రానిగ్గాని పూర్తికాదు. నేను వస్తాను. ఆఫీసుకి టైమయింది." అని పురమాయించాడు.

సీతాదేవి వచ్చింది. తన అవస్థకు నవ్వుకుంది. పైట కొంగును నడుము వద్ద దోపి, తనవద్దకొచ్చింది.

ఆమె తల రుద్దుతుంటే, మధ్యమధ్య శరీరం తగలసాగింది. కాని తనకు మాత్రం గిలిగింతలు, చక్కిలిగింతలూ. ఏదోలా వుంది.

అలా కొంతకాలం గడిచింది. రోజులు గడిచే కొద్దీ తనలో మార్పు అధికం కాసాగింది. సీతాదేవిగానీ, రామారావు గానీ అదేం గమనించలేదు.

తను మాటిమాటికీ యింటికి వెళ్ళా లనేవాడు. వాళ్ళు ఒప్పుకోలేదు. అక్కడే వుండాలనీ, బాగా చదువుకోవాలనీ అనే వారు.

ఉన్నట్లుండి ఉలిక్కిపడ్డాడు రవి. ఎదురుగా సీతాదేవి!

"చదువుకోకుండా పడుకున్నావేమిటి? మరదిగారూ! పరీక్షలెప్పటినుండి?" అంది.

"ఆఁ ఇంకా నెలరోజుల్లో పరీక్షలు. ఏమిటో యివ్వాళ చదువుకోవాలనిపించ లేదు వదినా!" నసిగాడు రవి.

"సరే! అయితే పడుకో మరి!" అని లైటు తీసేసింది సీతాదేవి. చకచకా తన పడకగదికేసి వెళ్ళిపోయింది.

రవి చెమటలు యింకా పెరిగాయి. చెప్పలేని చేతకానితనం. తెలిసీతెలియని వుద్వేగం. ఏదో చెయ్యాలని, ఏమో కావా లని. ఎటూ తేల్చుకోలేని పరిస్థితి.

అప్పటికి రామారావు పట్నం వెళ్ళి వారం రోజులయింది. గవర్నమెంటువారి పిలుపున రెండు నెలలపాటు ట్రైనింగుకని వెళ్ళాడు.

ఈ వారం రోజులనుండీ తనకేదో బాధ. రాత్రిపూట వున్నట్లుండి మెళకువ వస్తుంది. గుండెనిండా గుబులు. వళ్ళంతా వెచ్చగా వుంటుంది. నుదురుమీద, మెడ కింద చెయ్యివేస్తే, కాలిపోయేది. కూజాలో చల్లని నీళ్ళు గడగడా తాగినా చల్లారేదికాదు. అలాగే మగత నిద్దర, మర్నాటి వుదయం వళ్ళంతా నొప్పులుగా, తిమ్మిరిగా తలదిమ్ముగా వుండేది. చిత్రం. తన గురించి తనకే తెలియని విచిత్రం.

రవి లేచాడు. లైటు వేశాడు. పుస్తకం తెరిచాడు. కాని చిక్కుబడిన దారాల్లా, అంతుచిక్కని ఆలోచనలు.

ఎంత కష్టపడినా పుస్తకంలోనిది అర్ధంకాలేదు. కళ్ళు చూస్తూనే వున్నాయి, కాని ఏమీ కనబడటంలేదు.

రవి పుస్తకం మూసేశాడు. లైటు తీసేశాడు.

మెల్లగా పిల్లిలాగా సీతాదేవి బెడ్‌రూం కేసి నడిచాడు. గుమ్మంవద్ద ఒకప్రక్కగా నక్కి నిలబడ్డాడు. కన్నార్పకుండా అలానే చూస్తూ వుండిపొయ్యాడు.

ఎగిరెగిరి పడుతూంది ఆమె ఒళ్ళు. రవి నిక్కరు కదిలింది.

మంచినీళ్ళకని లేచింది సీతాదేవి. చీకట్లో తప్పుకున్నాడు రవి. ప్రక్కనే వున్న కూజాలో నీళ్ళు వంచుకుంటుంది సీతాదేవి. రవి రహస్యంగా తొంగి చూచాడు. ఆమె ఛాతీ బరువుగా వంగింది. రవి వంటిమీద వెంట్రుకలు నిలబడ్డాయి. గుండెవేగం ఎక్కువయింది.

మంచినీళ్ళు తాగి, మళ్ళీ పడుకుంది సీతాదేవి లైటు తీసేసి.

తనకి నిద్దరేలేదు. సీతాదేవికి మత్తు నిద్దర. ఎందుకని?

ఉన్నట్లుండి రామారావు గుర్తు కొచ్చాడు. సీతాదేవి ప్రక్కనే ఆమె కాలు మీద తన కాలేసి...

తనూ అలాగే పడుకుంటే? తప్పా? ఏమో! తనని అంత ఆప్యాయంగా చూస్తుందిగా వదిన. తప్పులేదు.

రవి మెల్లగా లోనికి నడిచాడు. మంచం పక్కనే మోకాళ్ళమీద కూర్చున్నాడు. సీతాదేవిని చూచాడు. ఈ లోకమే తెలియకుండా నిద్రపోతూంది. అలాగే చూడాలనిపించింది.

సీతాదేవి నిద్దర్లోనే అటు తిరిగింది. రవి గూడా పిల్లిలాగా ఆ ప్రక్కకు వెళ్ళాడు. ఈసారి సీతాదేవి పైటకొంగు చెదిరింది. కళ్ళప్పగించి చూస్తూండి పోయాడు రవి.

సీతాదేవి కాళ్ళు కదిలాయి. రవి కళ్ళు కదిలాయి.

రవికేమిటో కొత్తకొత్తగా వుంది. అలాగే వుండిపోయాడు. తనకి తెలియకుండానే సీతాదేవిని తాకాయి రవి చేతి

వేళ్ళు.

సీతాదేవి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. చీర సర్దుకుని గబగబ లేచింది. లైటు వేసింది.

ఎదురుగా బిక్కమొగమేసుకుని రవి!

"నువ్వు ఇంత రాత్రిపూట యిక్కడ కెందుకొచ్చావు?"

"నేను మరి లేదు వదినా

మంచినీళ్లు ." రవి మాటలలో తడబాటు.

గ్లాసుతో నీళ్ళిచ్చింది సీతాదేవి. గట గట తాగసాగాడు రవి. ఆమె చూచింది. రవి వంటినిండా చెమటలు. నిక్కబొడుచు కున్న జుట్టు. ఆపాదమస్తకం రవిని పరిశీలించింది సీతాదేవి. రవి స్థితి లీలగా అర్ధమయింది.

"మంచినీళ్ళు నీ గదిలో లేవూ?"

"ఎంతసెపయింది యిక్కడికొచ్చి?"

"మరి ."

రవి నీళ్ళు నమలడం సీతాదేవి అభి ప్రాయాన్ని బలపరిచింది.

"మంచినీళ్ళు త్రాగావుగా! నీ గదికి వెళ్ళి పడుకో." ఆమె కంఠంలో కరుకు దనం తొంగిచూచింది.

కాళ్ళీడ్చుకుంటూ కదిలాడు రవి. అంతదాకా పోయి పూర్తిగా తిరగకనే దొంగతనంగా చూచాడు సీతాదేవిని. ఆమె చూపులతో తన చూపులు కలిసేసరికి అదిరిపడి పరుగెత్తాడు.

సీతాదేవికి మతిపోయినట్లయింది. తను రామారావును గురించి మధురంగా కలలు కంటూ మత్తుగా పడుకుంది. రవి తన గదిలోకి వచ్చి చాలాసేపు వుండి వుండాలి. లేకుంటే అలా బిత్తర పోలాడా?

ఎందుకు జరిగిందిలా?

"ఎందుకా? నీ తెలివితక్కువతనం వల్ల, నీ భర్త అవివేకంవల్ల. ఓ పిల్ల వాడిని చేరదీశామని తృప్తిపడ్డారు మీరు. కాని, అతని వయసు, దానికితగ్గ మనసు వీటిని గురించి ఆలోచించారా? మీ పరాచి కాలు, సరసాలు బాహాటంగా సాగించు కున్నారు. ఈ యింట్లో మీరిద్దరేకాక మరో ప్రాణి వుందన్న విషయం గుర్తుందా మీకు? ఇది ఎవరి తప్పు?"


అంతరాత్మ మాటలు విని గుండె పట్టుకుని కూర్చుండిపోయింది సీతాదేవి "నాదే !" అని నిట్టూరుస్తూ. ★



క్రొత్త ద్వారాలు

'విషయం కలిగి, విజయవంత మయ్యేలా తక్కువ బడ్జెట్‌తో నిర్మించబడే తెలుగు సినిమా' అనే క్రొత్త ద్వారాన్ని తెరిచిన దర్శకుడు దాసరి నారాయణరావు తనకూ క్రొత్త ద్వారాలేర్పరుచుకొన్నాడు. ఇటీవలనే స్వంతంగా ఏర్పరచుకొన్న భవన ప్రవేశం చేశారు దాసరి. ఆ సందర్భంలో ఆయనను అభినందించడానికి వచ్చిన చిత్రసీమకు సంబంధించిన వ్యక్తులలో చాలామంది నూతన తారలుండడం గమనించాడీ విలేఖరి క్రొత్తతరహా కథలతోపాటు, క్రొత్తతరహా చిత్రీకరణా, క్రొత్త తరం నటీనటులూ కూడా దాసరి తెలుగు ప్రేక్షకుల కందిస్తున్న కానుకలు మరి! తన తొలి చిత్రంతోనే విజయపతాకాన్నెగరేసిన (తాత-మనవడు—నిర్మాత కె. రాఘవ) యీ దర్శకుడు తదాదిగా తన విజయయాత్ర సాగిస్తూ, నూతన తారల ప్రయోగం 'స్వర్గం-నరకం'తో తెలుగు చిత్రసీమలో సంచలనంసృష్టించినసంగతి మీకు తెలుసు. ఈ సంచలన దర్శకుడి చేతిలో రూపుదిద్దుకొని ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రాలు ఇవి.

మద్రాసు హార్స్‌రేసెస్‌లో ప్రెసిడెంట్స్ కప్ గెలిచిన 'ఫేస్ ది ఫాక్ట్స్' గుఱ్ఱం యజమాని, ప్రఖ్యాత నిర్మాత దర్శకుడు వి. బి. రాజేంద్రప్రసాద్ ప్రెసిడెంట్ నుంచి బహుమతి నందుకొంటున్నారు.





'సోగ్గాడు' శతదినోత్సవ సభలో వాణిశ్రీనుంచి మెమెంటో నందుకుంటున్న నిమ్మగడ్డ రామప్రసాద్ ([illegible] కె. ఆర్. పబ్లిసిటీస్). సోగ్గాడు విజయసారధి డి. రామా నాయుడు కూడా చిత్రంలో ఉన్నారు.

ముద్దబంతి పువ్వు: మురళీ మోహన్, జయచిత్ర, సత్యనారాయణ ప్రధాన పాత్రలలో నటించే యీ చిత్రానికి నిర్మాతలు సుబ్బారావు, జగన్మోహనరావు.

పాడవోయి భారతీయుడా: డి. బి. నారాయణ, వడ్డె రమేష్ నిర్మిస్తున్న చిత్ర మిది. ఈ చిత్రంలో సత్యనారాయణ, మురళీమోహన్, త్యాగరాజు, ఈశ్వర రావు, శ్రీదేవి ముఖ్యపాత్రలలో నటిస్తు న్నారు.

తూర్పు-పడమర: కె. బాలచందర్ దర్శకత్వంలో తమిళంలో సంచలనం సృష్టించిన 'అపూర్వరాగంగళ్' చిత్రం మాతృకగా రూపొందించబడుతున్న ఈ చిత్రంలో నూతన తార మాధవి, నర సింహరాజు, శ్రీవిద్య, సత్యనారాయణ నటిస్తున్నారు. దాసరిని దర్శకుడిగా పరి చయం చేసిన కె. రాఘవ నిర్మిస్తున్న చిత్రమిది.

ఓ మనిషీ తిరిగిచూడు: దిడ్డి శ్రీహరిరావు నిర్మిస్తున్న ఈ చిత్రంలో మురళీమోహన్, ఈశ్వరరావు, మోహన్ బాబు కీలకమైన పాత్రలలో కన్పిస్తారు. ప్రధాని ఇందిర ఇరవై సూత్రాల పథకం అందించిన ఇన్స్పిరేషన్‌తో దాసరి రూపొందించిన కథకు చిత్రరూపమిది.

భానుమతి ఇంగ్లీషు పాట!

పాటలంటే చెవికోసుకోవడమన్న కేవలం పాటలపై ఇష్టాన్ని వ్య చేందుకు వాడే ప్రయోగమేగాక ని జరిగేదయితే భానుమతి పాటలున్న తె దేశంలో చాలామందికి చెవులుండే





'మనవూరి కథ' చిత్రంలో అందాల సుమనోహరి
జయప్రద, హీరోయినుజో.

కావు. నటిగా, రచయిత్రిగా, సంగీత దర్శకురాలిగా, దర్శకురాలిగా, గాయనిగా (ఇంకా ఏవైనే మరిస్తే పాఠకులు మన్నించాలి!) ప్రసిద్ధురాలైన భానుమతీ రామకృష్ణ పాడిన ఇంగ్లీషు పాటలను ఆమె నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మనవడికోసం'లో వినవచ్చు. భానుమతితోపాటు శ్రీధర్, విదుబాల, రోజారమణి, కాంతారావు, పద్మనాభం, జయమాలిని మొదలైనవారు నటిస్తున్నారు ఈ చిత్రంలో. నిర్మాణం పూర్తికావచ్చింది.

దొంగల దోపిడి!

త్రిమూర్తీ ప్రొడక్షన్స్ నిర్మించే కలర్ చిత్రం పేరిది. కృష్ణ కథానాయకుడుగా నటిస్తున్న యీ చిత్రంలో మంజుల, సత్యనారాయణ, నాగభూషణం, ప్రభాకర రెడ్డి మొదలైనవారు నటిస్తున్నారు. జి. సాంబశివరావు, పి. బాబ్జీలు నిర్మించే ఈ చిత్రానికి దర్శకత్వం కె.ఎస్.ఆర్. దాస్.

తారా

'మంచికి ... ...యి ... ...కృష్ణ చిత్రవారు నిర్మించే రంగుల చిత్రం పేరు. ప్రముఖ తారలెంతోమంది నటిస్తున్న ఈ మల్టీస్టారర్ భారీగా నిర్మిస్తున్నది యం. మనోహర్. భారీ చిత్రాలను రూపొందించడంలో స్పెషలిస్ట్ సి.యస్. రావు ఈ చిత్రానికి దర్శకుడు. ఎన్.టి. రామారావు, కృష్ణంరాజు, రామకృష్ణ, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, నాగభూషణం, అల్లురామలింగయ్య. శరత్ బాబు, పద్మప్రియ, ప్రభ, జయమాలిని నటిస్తున్నారీ చిత్రంలో.

మనవూరి అందాలు!

తెలుగు గ్రామసీమల అందాలను ఎంతో మంది సెల్యులాయిడ్ పైకి తీసుకొచ్చారు. కోనసీమ అందాలను మరింత సుందరంగా ప్రతిఫలింపజేస్తూ చిత్రీకరణ జరిగింది 'మనవూరి కథ' చిత్రంలో. అదీ రంగుల్లో.

'మగాడు'లో ఎన్. టి. రామారావు, జయమాలిని.



గుర్తింపు తెచ్చేందుకు చేయవలసిన కృషిని వివరించారు. భారతదేశంలో హిందీ, బెంగాలీ తప్ప వేరే భాషలలో నిర్మించబడే చిత్రాలున్నాయనే గుర్తింపుకూడా లేని స్థితినుండీ చాలా మార్పు వచ్చిందిప్పుడు. మళయాళచిత్రాలకు గుర్తింపు లభించింది. అలాగే కన్నడచిత్రాలూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. కేవలం మంచి చిత్రాలు తీయడంతోనే వాటికి జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ గుర్తింపురాదు. ఆ గుర్తింపు పొందేందుకు చిత్ర పరిశ్రమ ఓ ప్రణాళికా బద్ధమైన, న్యాయసమ్మతమైన పోరాటం సాగించాలి. తెలుగు చలనచిత్రాలు నిర్మించబడే కేంద్రాలు మద్రాసు, హైదరాబాదు లయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నెలకొనివున్న న్యూఢిల్లీలో మనకో వేదిక నేర్పరచుకోవడం అవసరం. ఆ వేదికనుంచీ చెప్పే మాటలు ప్రభుత్వానికీ త్వరగా విన్పిస్తాయన్నది నిజం.

ఈ విషయాలు వివరించిన చిత్రరంగానికి సంబంధించిన మరెన్నో ఆసక్తికరమైన విషయాలు వివరించారు. ఆ తరువాత ఆయన హోటల్‌రూంలో ఆయనతో రెండుగంటలు గడిపే అవకాశం లభించిందీ విలేఖరికి. సినిమాకు సంబంధించి ఏ విభాగం గురించయినా చక్కగా వివరించగల ఈసినిమా సర్వజ్ఞుడి సలహాసహకారాలను పొందవలసిన అవసరం తెలుగుచిత్ర పరిశ్రమకు, ఎంతేని వుంది

మరిన్ని విశేషాలు!

ఈ సందర్భంలో మాట్లాడిన నిర్మాత, దర్శకుడు విశ్వేశ్వరరావు తెలుగు చిత్ర పరిశ్రమపై నిశితమైన విమర్శలు చేశారు. 'చిత్తశుద్ధిలేక ' ముసుగేసుకొని 'హిపోక్రసీ'లో జీవిస్తున్నది మన చిత్రపరిశ్రమ' అన్నారాయన. చిత్ర పరిశ్రమను సన్మార్గానికి నడిపే ప్రయత్నం చేయడం పత్రికా రచయితల బాధ్యతనీ, ఆ బాధ్యత నిర్వర్తించని జర్నలిస్టును తాను గుర్తించనే లేననీ చెప్పారు విశ్వేశ్వరరావు. నటి జమునా రమణారావు మాట్లాడుతూ ఢిల్లీలోని తెలుగు ప్రజల ఉపయోగార్థం నిర్మించబోయే స్కూలు భవనాల ఫండ్స్ కొరకు తను తనతోటి నటీనటులు కొందరితో కలిసి అక్కడో ప్రదర్శన ఇచ్చి సహకరిస్తామని వాగ్దానం చేశారు.

'రాజు వెడలె'లో శోభన్‌బాబు, జయసుధ.



తెలుగు తెరకు జయప్రద



రచనాసక్తేగాక, రచించగలిగిన కనీస ప్రతిభా కలిగివున్న ఓ యువ రచయితకు వరుసగా గురజాడ, బాపిరాజు, కొడవటిగంటి, గోపీచంద్, బుచ్చిబాబు, రాచకొండ, బీనాదేవిల సూచనలూ, సలహాలూ పొందే అదృష్టం ఎంత గొప్పది. తెలుగు సినిమాకు కొత్త అందాన్ని సమకూర్చిన సుందరి జయప్రద అదృష్టమూ అంత గొప్పదే. నటనాసక్తి, నటించగలిగిన ప్రతిభ గల యీ యువ నటికి చిత్రసీమలో ప్రవేశించిన అతి త్వరలోనే ప్రముఖ దర్శకులు తిలక్, బాపు, దాసరి నారాయణరావు, విశ్వనాధ్, బాలచందర్‌ల దర్శకత్వంలో నటించే అవకాశం లభించింది. ఆ అవకాశం ఆమెలోని నటికి మెరుగులు పెట్టి అచిరకాలంలో ప్రజాదరణ పొందిన కథానాయికగా రూపొందించింది. రాజమండ్రిలో కాలేజి విద్య నభ్యసిస్తూ, నృత్యంలో కూడా ప్రావీణ్యం సంపాదించింది జయప్రద సినిమాలలోకి రాకముందు. "అంతులేని కథ"లో తన పాత్రపోషణను మెచ్చుకొన్న తన అభిమానులు జయప్రదను చూడగానే 'అదిగో రాక్షసి వస్తుందిరోయ్' అంటూ తనను సంబోధించడాన్ని నవ్వుతూనే, గర్వంగా చెప్పగలిగింది జయప్రద. మాంగల్యానికి మరోముడి, సిరిసిరిమువ్వ, సీతాకల్యాణం, రాజు వెడలె, మన వూరి కథ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న జయప్రద చిత్రాలు. ప్రముఖ హిందీ నిర్మాత, దర్శకుడు బి. ఆర్. చోప్రా తన హిందీ చిత్రంలో అవకాశం ఇవ్వబోయినా, తీరికలేని జయప్రద ఆ అవకాశం వినియోగించుకోలేక పోయింది. అయితే ఇప్పటికే తమిళ, మళయాళ చిత్రాల్లో నటించిన యీ పరువంలో వున్న ప్రతిభాశాలిని హిందీ చిత్ర నిర్మాతలు అవకాశం చూసి హిందీ ఫీల్డుకు లాక్కుపోయే ప్రమాదంతోపాటు నిమిషం తీరిక లేకుండా చేసి ఆ ప్రమాదాన్ని అరికట్టేలా తెలుగు సినిమా నిర్మాతలు ప్రయత్నించే అవకాశమూ ఉంది మరి! 'ఎక్స్‌ప్రెస్' వేగం[illegible]ంచిన జయప్రద

నూతన తరం

ఈశ్వరరావు



రంగస్థలంపై సంపాదించిన పసిడి అనుభవాన్ని సినిమా తెర ద్వారా తెలుగు ప్రేక్షకులకు చవి చూపిస్తున్న యువ నటుడు ఈశ్వరరావు. కుటుంబ బాధ్యతలు ఎన్నో ఉద్యోగాలు చేయవలసిన అవసరం కల్పించినా 'నా దృష్టి ఎప్పుడూ నటన పైనే ఉండేది' అన్నాడు ఈశ్వరరావు. నాటకాలలో నటుడిగా పెరుగుతున్న పేరుప్రఖ్యాతులతోపాటు సినిమా నటుడై తన ప్రతిభను ప్రదర్శించుకోవాలన్న తపననూ పెంచుకొన్న ఈశ్వరరావుకు తొలి అవకాశం కలుగజేసింది సంచలన దర్శకుడు దాసరి నారాయణరావు. తెలుగు ప్రేక్షకులు పలికేందుకు ఇబ్బందిగా ఉంటుందని 'విశ్వేశ్వరరావు'ను ఈశ్వరరావుగా మార్చిందీ యీ దర్శకుడే. హైదరాబాదులోని నాట్య విద్యాలయలో 'డిప్లొమా ఇన్ థియేటర్ ఆర్ట్స్' పొందిన యీ నటుడిని నటనవైపు ప్రభావితం చేసింది బెల్లంకొండ రామదాసు రచించిన నాటకం 'పునర్జన్మ'. 'పదేళ్ళకు పూర్వం ఆ నాటక ప్రదర్శన చూడటంతో నాలో నటుడికి కదలిక వచ్చింది' అన్నాడు ఈశ్వరరావు గతాన్ని గుర్తుచేసుకొంటూ. "'మెలోడ్రామా' శాతం ఎక్కువగా కలిగిన నటననుంచి విడివడి సహజత్వాన్ని ప్రదర్శించే నటనను ప్రేమిస్తాను. అలా నటించ ప్రయత్నిస్తాను" అన్న యీ నటుడు ప్రస్తుతం ముద్దబంతి పువ్వు, పాడవోయి భారతీయుడా, ఓ మనిషీ తిరిగి చూడు (అన్నీ దాసరి దర్శకత్వంలోనే) మరియు ప్రఖ్యాత రచయిత త్రిపురనేని మహారథి దర్శకత్వంలో తయారవుతున్న 'మంచిని పెంచాలి' చిత్రాల్లో నటిస్తున్నాడు. సినిమాలలో నటించడం వెనుక డబ్బు సంపాదనకంటే ప్రధానంగా కీర్తి కాంక్ష నిలుస్తుందని చెప్పిన యీ నటుడు 'తన తల్లిదండ్రుల తర్వాత దాసరి నారాయణరావును దైవసమానంగా చూసుకొంటానన్నాడు' దాసరి యెడల తనకు గల భక్తిభావాన్ని నిండు మనసుతో వెల్లడిస్తూ, నటనాశిఖరపు తొలి మెట్లపై నిలబడ్డ యీ నటుడి తొలి అడుగు దృఢంగా వుంది. తన తొలి చిత్రం (స్వర్గం-నరకం) కేవలం విజయవంతమైన నూర్రోజుల చిత్రమేగాక, సంచలన చిత్రంగావడం ఈశ్వరరావుకు లభించబోయే మంచిభవిష్యత్తుకు శుభసూచకం. -యస్వీనారాయణ

ఉత్తరాలు

"జ్యోతి" ముఖచిత్రంతో వెలువడిన మే నెల "జ్యోతి" చూడ ముచ్చటగా నున్నది. జైమంగళా. సత్యం శివం సుందరం, సీరియల్స్ చదువుటకెంతగానో వుత్సాహము నిచ్చుచున్నవి.

—యస్. సాంబశివ దామోదర్, తెనాలి.

నాకు ఉత్తరాలు వ్రాసే అలవాటు లేదు. కానీ మే నెల "జ్యోతి"లో అలహరి రంగసూరిగారి "పెళ్ళి జరగలేదు" అన్న కథ నన్ని ఉత్తరం వ్రాయడాన్కి ప్రేరేపించింది ఆయన రచనలో క్రొత్తదనం ఉంది. సునిశితమైన వెరైటీ ఉంది. రచనాశైలి బాగుంది. రచయితకు నా అభినందనలు తెలుపుకుంటున్నాను.

—మంజు, హైదరాబాద్.

ఆంధ్ర ప్రదేశ్‌లో ప్యాపులారిటీని మరింత పెంచుకుంటూ "జ్యోతి" ఆదర్శ పత్రికలా తయారౌతుంది. ఈనెల నవలను పుస్తకం నుంచి వేరు చేసేసరికి మా కళ్ళు మిరిమిట్లు గొలిపాయి. ఎంతో ఆకర్షణీయవంతంగా వుంది, నవలాను బంధంపై నున్న గంగాధర్‌గారి ఆర్ట్.

—జి. జగదీశ్వర్‌రెడ్డి. మరియు మిత్రులు
వనపర్తి.

"జ్యోతి"కి. ఇదే నా ప్రథమ లేఖ. నా అభిమాన రచయిత్రులలో ఒకరైన కోడూరి కౌసల్యగారి "సత్యం శివం సుందరం" సీరియల్ మొదటి భాగములలోనే, నన్ను ఆకర్షించినది. మహాకవి "శ్రీశ్రీ" గారి రచనలు త్వరలో చదువబోతున్నందుకు చాలా సంతోషం.

—శ్రీమతి ఎ.శ్రీ లక్ష్మీసత్యనారాయణ,
బెంగుళూరు

మినీ కథలు చాలా బాగున్నాయి. 'సత్యం శివం సుందరం' 'మిస్టర్ సంపత్ ఎం. ఎ.' రెండూ చాలా ఇంట్రెస్టింగ్‌గా సాగుతున్నాయి.

—పి. హెచ్. బి. రెడ్డి, గుంటూరు.

ఈనెల మే 1976 "జ్యోతి" లోని చందు సోంబాబుగారి "తార" నవల నిజంగా ఎంత బాగుందీ, అంటే నేనూ ఒక కవి నయితే వర్ణిస్తూ వ్రాసేవాడిని. నిజంగా ఆ నవల నాకు చాలా నచ్చింది. ఈమధ్య నేను చాలా నవలలు చదువుచున్నాగానీ, ఇది చదివినంత "క్యూరియాసిటీ"తో మరే నవలా చదువ లేదు. ఇక మా అభిమాన రచయిత్రి శ్రీమతి ఆరెకపూడివారి "సత్యం శివం సుందరం" సీరియల్ చాలా రంజుగా నడుస్తోంది. వచ్చేనెల "జ్యోతి" కొరకు ఎదురుచూడమంటోంది.

—ఆకెళ్ళ సత్యనారాయణమూర్తి,
విశాఖపట్టణం.

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి సీరియల్ చాల బాగుంటోంది.

—సి. హెచ్. శ్రీనివాసరావు,
లక్ష్మీపాలెం.

ఈనెల "జ్యోతి"లో నన్ను ఆకర్షించింది ముఖ్యంగా ఉషారాణిగారి 'లలిత' కథ. నన్ను ఆలోచనలలోనుండి తేరనివ్వ లేదు ఈ కథ. 'స్త్రీ' జీవితంలో ఎన్నో రక రకాల కష్టానుభవాలు చదివాను కానీ ఈ రకం అనుభవం ఎవరూ పాఠకులకు అందజేయలేకపోయా రింతవరకూ. ఇటు వంటి నరకాన్ని అనుభవించే తరుణులు ఎంతోమంది వున్నారు. కానీ ఈ కథలోని ముగింపులాగానే అటువంటి అభాగినుల జీవితాలలో కూడా జరిగితే వారు ధన్యులే. అందుకు దోహదం చేసే ఇటువంటి రచ ను అందజేసే "జ్యోతి"కి అభినంద

—వై. కస్తూరి, మద్రాసు.

అతి అవాస్తవికమైన 'తార' నవల చదివాను. ఈ నవలలో వెంకటేశం తన భార్య గురించి చెప్తూ: 74 వ పేజీలో— 'లలిత' అంటాడు. 95 వ పే.లో— 'లీల' అంటాడు!!

—అన్నదానం వెంకటేశ్వర్లు,
హైద్రాబాద్.

(కథకు సంబంధించి ఏ ప్రాధాన్యతా లేని యీ పాత్ర పేరు విషయంలో రచయిత పొరపాటున అలా రాసినా, ఆ పొరపాటు సరిదిద్దే బాధ్యత మా సంపాదక శాఖది. అలా జరగనందుకు చింతిస్తున్నాము. —ఎడిటర్.)

"వెలుతురు పిట్టలు" కావ్యానికి ఫ్రీవర్స్ ఫ్రంట్ బహుమతి

ప్రఖ్యాత యువకవి శ్రీ కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ రచించిన "వెలుతురు పిట్టలు" కావ్యానికి 1975 సంవత్సరపు ఫ్రీవర్స్ ఫ్రంట్ బహుమతి లభించింది. హైదరాబాదులోని ఫ్రీవర్స్ ఫ్రంట్ వారు వచన కవితలో వ్రాసిన ఉత్తమ కావ్యానికి యీ బహుమతి యిస్తున్నారు.

నాటికల పోటీ

ఎజి ఆఫీసు తెలుగు నాటక సమితి నిర్వహించిన అంతర్విభాగ నాటక పోటీలలో 'మధ్యంలో మానవుడు' అన్న నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి లభించింది. మద్యపానపు దుష్ఫలితాలను చిత్రీకరించిన యీ నాటికలో రామకోటేశ్వరరావు, మోహన్, లక్ష్మణరావు, రాధాకృష్ణమూర్తి, శంకరరావు మరియు మీనాకుమారి నటించారు. ఆర్. సి. హెచ్ రాజు రచించిన యీ నాటికను పి. వెంకటరత్నం నిర్వహించారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి యండమూరి వీరేంద్రనాధ్ రచించిన 'కుక్క' నాటికకు లభించింది. చలనచిత్ర దర్శకుడు దాసరి నారాయణరావుబహుమతి ప్రదానంచేశారు.

కవితల పోటీ!

నవ్యభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ (ఇచ్ఛాపురం) చతుర్థ వార్షికోత్సవ సందర్భంగా వచన కవితల పోటీ నిర్వహింపబడుతోంది. ఉత్తమమైన రెండు కవితలకు రెండు ప్రథమ బహుమతులు చెరిఒక్కటి 58 రూ/— ఇవ్వబడతాయి. కవితలు చేరవలసిన చివరి తేదీ: 5, జూన్ 1976. వివరాలకు 'కార్యదర్శి' నవ్యభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఇచ్ఛాపురం శ్రీకాకుళం జిల్లాకు వ్రాసి తెల్సుకొనవచ్చును. ★



..ited and Published by V. Leelavathy Raghavaiah
40/1, Moosasait Street, Madras-600 017 and Printed